AB_AVOD_1933_P-4
Ctm



# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక



సంపాదకుడు, ప్రకాశకుడు: ఆంధ్ర శేషగిరిరావు బి. ఏ.

సంపుటము : ౧. — ఆగష్టు, ౧౯౩౩. — సంచిక : ౪.

ఆంధ్రభూమి ముద్రణాలయము—వేపేరి, మదరాసు.

స్వదేశీ భీమాను ప్రోత్సాహింపుడు

# ది డెక్కన్ అస్యూరెన్సు కంపెనీ

## లిమిటెడ్

నందు మీ భవిష్యత్తును నేడే భీమాచేయుడు.

స్వల్ప ప్రీయములు ! నవీన పద్ధతులు !

### ప్రత్యేక సౌకర్యములు

1. స్త్రీపురుషులకు సమానమైన ప్రీమియము రేట్లు.
2. రు 250, రు 500, రు 750 లకు కూడ పట్టాలు జారీచేయబడును.
3. వైద్యపరీక్షలేని ప్రత్యేక ఎండోమెంటు పద్ధతులు.
4. ఆటోమాటిక్ నాన్ ఫర్ఫీచరు.
5. గృహనిర్మాణమునకై పట్టాదారులకు ఋణము లియ్యబడును.
6. అంగవైకల్యనష్టపరిహారము.
7. వ్యాధిగ్రస్థులైన పట్టాదారులకు వైద్యసహాయసౌకర్యములు.
8. ఆకస్మికమరణములకు రెట్టింపు భీమామొత్తం.

ఏజెంట్లకు ధారాళమైన కమీషను రేట్లు.

ఉత్తరప్రత్యుత్తరములు ఆంధ్రమునకూడ జరుపబడును.


వివరములకు :

## ది డెక్కన్ అస్యూరెన్సు కంపెనీ,


హెడ్డాఫీసు :
బెజవాడ.

బ్రాంచీలు :
మద్రాసు, బెంగుళూరు, హైదరాబాదు, (డెక్కన్)


AB_ oct_ 1933_ 1_ 6



విజయవాడ కనకదుర్గాలయధ్వజస్తంభము.



ఇంద్రకీలాద్రి. — విజయేశ్వరాలయము. — కృష్ణకాలువ.



కృష్ణానదిపై సూర్యోదయము.

# లోకము

✠

నాప్రౌఢజీవితాన్ని చూసి ఈ స్వార్థలోకము నవ్వుకొంటున్నది. నా నిట్టూరుపుల్లో శ్రమతీర్చుకొంటూ నాకన్నీటి చాలులో ఇంద్రధనస్సులు చూచుకొంటున్నది.

ఏమలినపథాల్లోనో మానవులపాదాల క్రింద రజోలేశాన్నయి నలిగిపోనున్న నాకోసం,

ఏ యెడారిసీమనో శిథిలతుషారమునై రూపుమాయనున్న నాకోసం,

ఇంత కల్లోలమా! ఇంత అసహనమా! ఇంత ప్రభంజనమా!

ఆమనినై మూగకోయిల గొంతులో చైతన్యరాగము నింపిననాడు, శరత్తునై మలిన శశాంకుని హైమచాయకు మెరుగుపెట్టిననాడు,

చుక్కలతోపాటే జగతికూడా తలపూపి తేరి చూడలేదా!

ముత్యాలనే భ్రాంతితో హిమకణాలకు దోయిలించాను. కాంచనమేయని సంధ్యాకాంతికి చేతులు చాచాను.

నాగరనీలిమలో మృత్యుశైత్యమున్నదని యూహించలేక పోయాను.

కుములుతున్న శ్మశానహృదయంలో ఇంత అంధకారమును దాచుకొన్న దీవిశ్వము.

మిణుగురికే చోటులేని ఈచీకటిలో మెరుపులకు తావెక్కడ!

✠

—పురిపండా అప్పలస్వామి.

# గ్రామ పునర్నిర్మాణం

## ౧

ఇటువంటి విషయాలమీద ఎవరైనా వ్యాసాలు రాసినా ఉపన్యాసాలిచ్చినా నమ్మకండి. నేను బి. ఏ. చదువుతుండగా ఈ "విలేజ్ రీకన్‌స్ట్రక్షన్" అనే మాట మొదటిసారి విన్నప్పు డదేమిటో అర్థంకాలేదు. అది ఆరోజు హాస్టల్లో డిబేటుకు సబ్జక్టు. అయితేనేం? నలుగురూ అనుకుంటున్నదీ విని విషయం అర్థంచేసు కోవటమేకాక నేనుకూడా మాట్లాడటానికి తయారయి ఒక పదినిమిషాలపాటు ఊపిరిసలపకుండా ఉపన్యాసం ఇచ్చి, కనీసం అరడజను పర్యాయములైనా "హియర్! హియర్!" అనిపించుకుని మరీ ఇవతలపడ్డా.

చెప్పొచ్చిం దేమిటంటే ఉపన్యసించటం అంత సులభం. లాయరు గట్టివాడైతే అన్యాయాన్ని న్యాయంకన్న న్యాయంగా కనపరచగలిగినట్టుగానే కాస్త మాటకారయితే అడ్డమైనదాన్నిగురించీ మాట్లాడి మన జీవితం యావత్తూ దానితోనే ఉందని నిరూపించ వచ్చు. ఈ గ్రామపునర్నిర్మాణం అనేదాన్ని గురించే ఎవరైనా మాట్లాడుతుంటే ఒక్క పర్యాయం వినండి! గాంధీ మొదలైన లీడర్లంతా కడమవ్యాపకాలన్నీ కట్టి పెట్టి గ్రామాలసంగతి ఎందుకు చూడరా అనిపిస్తుంది. తెలీ కడుగు తాను, ఇప్పుడు మనగ్రామాలకేం? పట్ట ణాల్లో ఉన్నట్టు మునిసిపల్ ఎన్నికలు, ఖూనీలులేవు; వెర్రిఖర్చులేదు.

గ్రామాలకు బురదా, చవుడూ మొదలైన లోపా లు లేవనను. కాని పల్లెటూరివాళ్ళచేత అవి లోపాలని ఒప్పించండి చూస్తాం! పోనీ పల్లెటూరివాళ్ళకు వాళ్ళ కష్టసుఖాలే ఎరుకలేనంత దుస్థితి వచ్చిందని ఎవరన్నా దయదలిచి "గ్రామపునర్నిర్మాణ" నిర్వహణం పూ నిరా, అది పూర్తిఅయేసరికి పొద్దుగూకి ప్రళయానికి వేళవుతుంది. వెధవది! - మా నూరాయివంటి మేధావికి పల్లెటూళ్లో బాడ్మింటనుక్లబ్బు ఏర్పాటుచేసేసరికి తల ప్రాణం తోకకొస్తే-క్షమించండి! పొరపాటున కథను చివర అందుకున్నాను.

## ౨

తమ అనుజ్ఞఅయితే ఇప్పుడు కథ సరిగా మొదలు పెడతా.

నేను బి. ఏ. చదివేరోజుల్లో అనేకరహస్యాలు గ్రహించా. ఒకదాన్నిగురించి ఇంతకుమునుపే మనవి చేశా. మరొక టేమిటంటే పల్లెటూరిపట్టులకు చెందిన సౌందర్యాన్నిగురించిన రహస్యం పల్లెటూళ్ళ ననుసరిం చుకుని సౌందర్యం ఉంటూఉన్నదన్న విషయం నాకు తట్టకపోవటంలో నాతప్పేమీలేదు. అది నాకళ్ళ ఎన్న డూపళ్ళేదు బురద, చవుడు మొదలైనవంటారా? అవైతే విరివిగానే చూశాను. ఎంత గుడ్డి కబోదైనా చూడకుండా ఉండలేడు. ఈ సౌందర్యం ఏదైతే ఉందో అది బొత్తిగా నామీద శీతకన్నువేసి ఎన్నడూ నాకళ్ళబడ్డ పాపానైనా పోయిందికాదు పల్లెటూరి వాళ్లు బస్తీలను తిట్టి తమగ్రామాలగురించి మెచ్చు కుంటున్నప్పుడన్నా ఇందులో ఏదోఉందని పోలేదు నాబుద్ధికి. అదంతా పల్లెటూరివాళ్ల పక్షపాతబుద్ధికింద తోసేశాను. కాని షేక్స్పియర్ మొదలైన మహా కవుల నేం చెయ్యను? వాళ్లూ అముక్కే చెప్పుతుంటే ఇక నమ్మకపోవటం ఎట్లా? ఆ అనుభవం నేనుకూడా పొందుదామని అభిలాషకలిగి వేసవికాలపు శలవులకు నూరిగారిగ్రామం పోయినా.

నూరాయి నారాకకు చాలా సంతోషించాడు. అది—నారాక—తనకు ఒకవిధంగా చాలా సహాయ కారి కాబోతున్నదన్నాడు. అదేమిటంటిని. నాకు సమాధానంచెప్పకుండా వాడు ఒక పెద్ద కొయ్యపెట్టె లోనుంచి నాలుగైదు పాత బాడ్మింటన్ బాటులు తీశాడు.

"వీటి గట్ యావత్తూ ఊడదీసి మళ్లేసి మళ్లీ అల్లాలి. సాయంతరంలోపుగా రెండుబాటులైనా సిద్ధం చెయ్యాలి" అన్నాడు నూరి

"చేసి?"

"సాయంత్రానికి ఆడుకోవచ్చు."

"ఎక్కడ?"

"అదంతా ఏర్పాటుచేశాలేరా! పదిహేనురోజుల్నించీ ప్రయత్నంచేస్తున్నా ఈ ఊరివాళ్ళచేత బాడ్మింటన్ ఆడించాలని. నా ఒక్కడివల్ల కాలేదు. కాస్త నువ్వుసహాయంచేస్తేవా, ఈఊళ్లో బాడ్మింటన్ టూర్నమెంటు పెట్టించకపోతే నాపేరు సూరాయికాదు."

సూరాయి నాసహాయం కోరినందుకు సంతోషమయింది.

"సీహంగంతా ఏది?"

"ఏంకావాలి?"

"నెట్"

"ఉంది." వాడు పెట్టెలోనించి ఒక పాతనెట్ బయటకి తీశాడు.

"ఎక్కడిదిరా ఇది?"

"పిత్రార్జితం."

నాకప్పుడంతా జ్ఞాపకంవచ్చింది. మామేనమామ బెజవాడలో ఉద్యోగంచేస్తున్న రోజుల్లో ఇంట్లో బాడ్మింట నాడుతుండేవాడు స్నేహితులతో.

"ఏర్పాటంతా ఉన్నతరవాత ఎవరుపడితే వారే ఆడతారు—బొట్టుపెట్టి పిలవాలా ఏమిటి?"

"ఆడరాడరు! పల్లెటూరివాళ్ళకు కొత్తవిషయం వస్తే భయం. ప్రతివాడికీ ఆటంతా వర్ణించాను. ఒక్కరోజు ఆడిచూడమన్నాను. ఊఁహుఁ! మనిద్దరం రెండురోజులపాటు ఆడి వీళ్ళకు భయంపోగొట్టాలి."

"ఒక్కక్షణం ఉండరా, సూరీ! ఇది గ్రామపునర్నిర్మాణంకిందికి వస్తుందంటావా?"

సూరాయి కాస్సేపు మొహంచిట్లించి "రావచ్చు. నాకెన్నడూ తట్టలేదు. కాని నువ్వు చెప్పింతరవాత—" అన్నాడు.

"అయితే నీప్రయత్నంమాను," అన్నా.

సూరి నిర్ఘాంతపోయి "ఏం?" అన్నాడు.

"గ్రామపునర్నిర్మాణం జరగదు. అది కృతజ్ఞతారహితమైనపని. చివరకు నిన్ను వెలికూడావేస్తారు. అనుభవంమీద చెబుతున్నాను విను."

"ఏమిటి నీఅనుభవం?"

"అట్లాఅడుగు చెబుతాను మొన్న డిసెంబరులో కాంతంగారి ఊరువెళ్ళబోతూ బజారులో చొక్కాలూ, అవీ తగిలించుకునే కొయ్యపదార్థాలుంటై చూశావూ—అది పట్టుకుపోయినా. కాంతం, బావా నన్ను చాలా మెచ్చుకుని దాన్ని మేకుకొట్టి గోడకుపరిచి—పల్లెటూరివేషాలు—ఒకబండెడుబట్టలు తగిలించారు స్నానంచెయ్యబోతూ బావ చొక్కా దానికి తగిలించి తువాలుచుట్టుకుని బట్ట దానిమీద తగిలించబోయ్యేటప్పటికి చొక్కారాలింది. అది తిరిగి దానిమీద వెయ్యబోయ్యేటప్పటికి అదంతా బండెడుబట్టలతో సహా కదిలి బావనెత్తిమీదికి అవతరించింది. పైన ఏం చెప్పను? ఆరాత్రే అదిచచ్చి దహనంపొందింది. నన్నటువంటి వస్తువులు తీసుకురావద్దని కాంతం శాసించటం! దాన్నెందుకు తిడతావే నీచవిటిగోడను తిట్టక- అంటే, నీసున్నపుగోడ లేడిచినట్టే ఉన్నాయి అమ్మంది కనక ఎందుకు తలపెడతావు గ్రామపునర్—"

"అందుచేత మనంవెంటనే బాట్లల్లటానికి ఉపక్రమిద్దాం, ఎక్కువ వ్యవధానంలేదు. సాయంత్రానికి బాట్లు సిద్ధంకావాలి" అన్నాడు సూరి చాటంత మొహంతో.

## 3

మీకెప్పుడన్నా బాటు అల్లించుకోవలిస్తే నా సలహా తీసుకుని ఆరణాలు పారేశి చాతయిన వాళ్ళచేత చేయించుకోండి మధ్యాహ్నం భోజనంకాగానే ఇద్దరం చెరోబాటూ తీసుకు అల్లటానికి ఉపక్రమించాం మొదటినించీ సూరి నేను వెనకపడుతున్నానని సణుగుతునే ఉన్నాడు. ఎట్లాగోట్లా చేతులన్నీ చించుకుని అల్లటం పూర్తిచేస్తే బాటు పరీక్షచేసి ముళ్లు తప్పుస్థలాల్లో ఉన్నయ్యనీ, బాటు వదులయిందనీ, దాంతో ఆడే కన్న చక్కబాటుతో ఆడటం మంచిదనీ వ్యాఖ్యానం మొదలుపెట్టి కొంపదేదాకా ఆగలేదు.

"ఒరే. నూరీ! బంతు లేవీ? చూశావా? నన్ను నమ్ము కుంటే బాగుపడవు. బంతుల్లేకుండా ఎట్లా ఆడతాం?"

"అన్నీ ఉన్నై. నీతెలివితేటలమీద ఆధారపడలేదు నేనూ. వాటిసంగతి నాకు బాగా తెలుసు."

వాడిమాటల్లోనిష్టూరం నేను వినిపించుకోదలచలేదు.

'బాగా నేఉందికాని నాకీఆట బాగారాదే! నేను ఒకటిరెండుసార్లు ఆడాలని ప్రయత్నంచేస్తే బాటు లోనించి బాలు దూరిపోవటంచూసి నాబాటుకు కంత లున్నయని అందరూ కనుక్కున్నారు. నాతో ఏంపన వుతుంది?"

"నీతో నే అవుతుంట. చూస్తూఉండు."

అప్పటి కింకా నాలుగైదుగడియల పొద్దుంది నా నెత్తిన బంతీ, బాటులూ, నెట్టూ పడేసి తాను రెండు బొంగులూ, ఒక తవ్వకోలా, టేపూ తీసుకుని నూరి దారితీశాడు. ఊరిబయట చింతలమధ్య కోర్టుకు సరి పోయే చక్కని సమప్రదేశం ఉంది. పది పదిహేను నిమిషాలకల్లా నూరి కోర్టు సిద్ధంచేశాడు అవసరమైన గీతలూ అన్నీగీసి గుంటలుతవ్వి, గుంజలు పాతాం.

మొత్తానికి మానూరి చాతయినమనిషి. అఖిలభారత గ్రామపునర్నిర్మాణమహాసభ ఒకటి ఏర్పాటుచేస్తే బాడ్మింటన్ బ్రాంచికి మానూరాయి అద్భుతమైన అధ్యక్షుడవుతాడు. ఒకగంటసేపు ఆడి తట్టాబుట్టా నెత్తినేసుకుని ఇంటికివస్తుంటే నూరి "నీ ఆట, మాచ్చికి ఆట్టే చెప్పకుగాని, నాపనికి బాగా ఉపకరిస్తుంది" అని పైనచెప్పటం మరిచిపోయినాడు.

• మర్నాడు మా ఆటకు ప్రేక్షకులు వచ్చారు! మా ఆట వాళ్ళకు చాలాసంతోషకారణమైనట్టు కనపడ్డది. దానిక్కారణం ఆటలో నాకుగల నైపుణ్యమేనని నాకీనాటికి కొద్దిగా అనుమానం ఉండనేఉంది. నన్ను చూసి నవ్వితే నవ్వారుకాని మావాడిప్రయత్నం కొన సాగుతున్నందుకు సంతోషించాను.

ఈవిధంగా రెండురోజులు గడిచింది ప్రేక్షకులు వచ్చి చూసి సంతోషించినవాళ్ళేకాని ఆడేప్రయత్నం ఏమీ చెయ్యలేదు. నూరి ఎవ్వరినీ ఆడమని ఆహ్వానం చెయ్యనైనాలేదు. వాళ్లగలు ప్రేక్షకు లనటానిక్కూడా నాకంత మనస్కరించటంలేదు. వాళ్ళలో ఒక భాగం గొల్లపిల్లలూ, ఇంకో భాగం సంసార్లపిల్లలూ, కొద్దిమంది ఆడపిల్లలూ, ఒకటిరెండు గొడ్లూ, ఒక కుక్కా — దానికి మా ఆటమాస్తే గౌరవంలేదు. వచ్చినట్టువచ్చి ఏదోపనిమీద పోతూండేది — కొన్ని కోళ్లూ అవీకూడా మధ్యమధ్య మాఆటచూసి నవ్వుతూ పురుగులేరుకుంటూ అటూ ఇటూ షికారు చేస్తుండేవి.

నే నీపరిస్థితులు నూరితో ముచ్చటించా.

"నువ్వు తొందరపడకు" అన్నాడు నూరి. "నేను వచ్చి ఆడమంటే చస్తేరారు, బెదిరిపోతారు. ఒక రిద్దరు తూగుతున్నారు. బహుశా రేపు ఎల్లుండిలోపల మనకోర్టు కిద్దరు ముగ్గురు మెంబర్లురావచ్చు. అప్పుడు మనంకాస్తా క్లబ్బయి ఊరుకుంటాం."

"వెధవ బాడ్మింట నాడటాని కింతభయమెందుకు, వెనకాడటం ఎందుకు?"

"మనభయాలు మనకులేవా? నువ్వు నీపెళ్లాంతో ఒక్కరోజు ఊరిబయటికి షికారుపోయిరా 'పాపమా? తప్పా?"

"నవ్వరా?"

"ఇక్కడా అదేభయం"

మాఉద్యమానికి మర్నాడు కాస్త జవంకలిగింది.

మామూలుప్రకారం మేమిద్దరం ఆడుతున్నాం. నేనుమాత్రం మామూలుఫారంలో లేకపోవటంచేత రెట్టింపు ఉత్సాహంతో బంతులు తప్పుతున్నా. ఇంతలో అనుకోకుండా ప్రేక్షకుల్లోనించి ఒకసంసారికుర్రవాడు కోర్టులో జొరబడి నాచేతులో బాటులాక్కుని నూరితో "రావయ్యా! ఆడు; ఒక సెయ్యనూత్తానూ!" అన్నాడు. మానూరి నన్నుకోర్టులోనించి బయటికి పొమ్మని సంజ్ఞచేశాడు.

ఆరోజునించి వారంలోపల కోర్టులో ఎనిమిదిమంది మెంబర్లమైనాం. అందులో ముగ్గురం బ్రాహ్మలం: నేనూ, నూరీ కలుపుకుని. ఒకరోజున నూరి అందరిని కూర్చోబెట్టి చిన్న ఉపన్యాసంఇచ్చాడు. "ఈఆట పదిమంది ఆడవచ్చు. ఇప్పు డెనిమిదిమందిమైనాం. మనకు మంచి

బాళ్లులేవు. బంతులులేవు. నెలకు తలకో రెండణాలు వేసుకున్నా, మంచిబంతివస్తుంది. రూపాయో రూపాయి న్నరో పెట్టితే మంచిబాటొస్తుంది. ఈఏర్పాటంతా చేస్తే మీఆట ఇంకా బాగుంటుంది. మనం ఒకమనిషిని ఎన్నుకుని వాడిచేతికి మనబేడా చందా ఇస్తే వాడే అవసరమైన సదుపాయాలు చేసి నెలాఖరుకు లెక్క చెప్తూవుంటాడు. కాబట్టి మనలోఒకణ్ణిఎన్నుకుందాం. ఏమంటారు? నేను చెప్పినదానికిష్టమైనవాళ్లు చేతులెత్తండి."

ఒకరితరవాత ఒకరు అంతా చేతులెత్తారు. అందరికన్న చివర చెయ్యెత్తినవాణ్ణిమాసి తరవాత నెలరోజులదాకా నవ్వుకుంటునే ఉన్నారు. పల్లెటూళ్ళలో ఇటువంటివి ఊరికేపోవు.

"అంతవరకు బాగానే ఉంది ఈపనికి ఎవరంటారు?"

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. చివరకొక పాతికేళ్ళవాడు మొహం భయంకరంగా పెట్టుకులేచి "మాకదంతా తెలవదండీ. డబ్బంతా మీచేతికేయిత్తాం. మీరేంచేసినాసరే!" ననికూర్చున్నాడు. అందరూ తలలూపారు. అభయంకరాకారం ఒకవిధమైన సిగ్గువల్లా, జంకువల్లా కలిగిన మార్పునిమారి నాకు చెప్పినప్పుడాశ్చర్యం వేసింది.

కొద్దిరోజుల్లో మాకోర్టు కళకళలాడుతున్నది. కొత్తబాళ్లు! కొత్తబంతులు! ప్రతిరోజూ ప్రేక్షకులు. పదముగ్గురు మెంబర్లు. అయిదుగురు బ్రాహ్మణులు, మిగిలినవారు శూద్రులు. మావాడింకోమీటింగుపెట్టి మరిద్దరిని తనుపెట్టేఖర్చులకూ వాటికీ సాక్ష్యంగాఉండటానికి తీసుకుని క్లబ్బులో వాళ్ళక్కూడా పదవిఇచ్చాడు.

కోర్టుకు పేరువచ్చిందికాని కీర్తిరాలేదు. ఊళ్లోముఖ్యులంతా మాకోర్టును లక్ష్యంచేసినట్టు కనపడలేదు కాని ప్రతిరోజూ సాయంతరంవేళ అరుగులమీద జరిగేమీటింగుల్లో మాకోర్టును గురించి చర్చవస్తున్నదని మాకు తెలుసు.

౪

ఒకరోజు రాత్రి నేనూ, నూరాయ్ భోంచేసి చల్లగాలికి అరుగులమీదచేరాం. కొంచెంసేపటికి ముగ్గురునలుగురు బ్రాహ్మణయువకులు వీథివెంటవచ్చి మేంకూర్చున్న అరుగలమీద తిష్ట వేశారు. ఎందుకంటే ఊరికేనన్నారు. మేంవాళ్లని లక్ష్యంచెయ్యకుండా మాధోరణిలోనే ఉండగా ఆ

## ఆంధ్రభూమి

కన్నెఱుంగని నాఁడు కాచి ప్రోచితివి,
మేనెఱుంగని నాఁడు మేలుకొల్పితివి,
పదముతొట్రిలునాఁడు పట్టినిల్పితివి,
నేనెఱుంగనటమ్మ! నిన్నాంధ్రభూమి!
పసిపాపనగు నాకుఁ బాలిచ్చి పెంచి,
అన్నదమ్ములతోడ నాటలాడించి,
మనసున్నవారితో మాటలాడించి,
నన్నెఱుంగవటమ్మ! నాయాంధ్రభూమి!
సంపన్నిధివి నాకు, శక్తివి నాకు,
విమలకీర్తివి నాకు, విద్యవు నాకు,
సౌఖ్యమూర్తివి నాకు, జననివి నాకు
నేనెఱుంగనటమ్మ! నిన్నాంధ్రభూమి!
తెలివిఁ దెచ్చిననాఁడె దీవించి నన్ను
నామనోరథముపై నాసీనవైతి,
భావహాయంబులు పరువెత్తువేళ
నన్నెఱుంగవటమ్మ! నాయాంధ్రభూమి!
గృహదేవతగ నిన్నుఁ గీర్తింపఁగంటిఁ,
కులదేవతగ నిన్నుఁ గొలువంగఁగంటి,
మాతృదేవతగ నిన్ను మన్నింపఁగంటి
నేనెఱుంగనటమ్మ! నిన్నాంధ్రభూమి!
అంతరంగము పత్రి, మాత్మ పుష్పంబు,
భవము ఫలం, బనుభవము తోయంబు,
అనుపమానందాప్తి నర్పింతు నిట్లు,
నన్నెఱుంగవటమ్మ! నాయాంధ్రభూమి!

—ఆంధ్రపుత్త్రుఁడు.

సమూహంలో గుసగుసలుబయల్దేరినై. ఆగుసగుసలు పెద్దవై నలుగురూ ఒక్కసారి బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టి ఎవరిగొంతులు వారికే వినపడక అంతా ఒక్కసారి చాలించారు. అంతా ఒక్కసారి నిశ్శబ్దం.

"ఏమిటీగలభా?" అన్నాడు సూరి

వాళ్లు తెలియచేసినసంగతిది. ఊళ్లో "కొందరు" మాబాడ్మింటన్ కోర్టులో చేరాలనే ఉద్దేశంతో ఉన్నారట. కాని ప్రస్తుతం అంతా శూద్రమేళంగా ఉందని అనుమానిస్తున్నారట ఆది బ్రాహ్మణసంఘం అయ్యే ఏర్పాటుచేస్తే—

రేపుదయం చెపుతానని సూరి వాళ్లను పంపేశాడు.

"మన కిక్కడ బ్రాహ్మణ బ్రాహ్మణేతరసమస్య కూడా ఎదురైనట్టుంది ఏంచేస్తావు? ఉన్నశూద్రపిల్లల్ని తీసేస్తావా?"

"దీన్లో శూద్రులున్నారన్న ఏడుపుకంటె వాళ్లు పదవుల్లో ఉన్నారని ఏడుపు—నిన్న ఇద్దర్ని ఎన్నుకున్నాంకాదూ? బ్రాహ్మడు సంభావ కోసం తిరిగేవాడు. ఉద్యోగంకోసం గాలిస్తాడు ఆంధ్రుల్లో వెయ్యి, రెండువే మైళ్ళదూరంవెళ్లి అక్కడ కీర్తి సంపాదించినవారు లేకపోలేదు అంతా బ్రాహ్మణులే. "ఇంకా కొంతకాలంవరకూ ఈ రాయబారాలు రాకపోతే మనక్లబ్బులో మరినాలుగు గౌరవపదవులు సృష్టిద్దామని చూస్తున్నాను"

"అయితే బ్రాహ్మణుల కోర్టులో ప్రవేశించి శూద్రులను వెళ్లకొట్టటం అన్యాయంకాదా?"

"అప్పుడుకాని గౌరవంరాదు కోర్టుకు ఈ శూద్రులక్కూడా బ్రాహ్మణులు కోర్టులోచేరి తమను ఉన్నస్థానాలనించి వెళ్లగొట్టింతరవాత కోర్టునుగూర్చి గౌరవం హెచ్చుతుంది. అదీకాక ఇంకొకటిచూడు. కూలిదొరక్క, ముష్టిదొరక్క దొంగతనానికి తెగబడి జైలుకుపోయినవాడు అన్యాయమనుకుంటాడా, కర్మ అనుకుంటాడా? ఈ బ్రాహ్మణులు కోర్టులోచేరినతరవాత శూద్రులను ఊపిరాడదు. వాళ్లు బహుశా ఇంకోకోర్టు లేవదీస్తారు."

సూరిచెప్పిన ప్రతిఅక్షరం నిజమైంది నేనాఊరు వదిలివచ్చేటప్పటికి రెండుకోర్టులూ విజృంభిస్తున్నై. కొంతమంది బాగా ఆడుతున్నారు.

౫

తొమ్మిదినెల్లకాలం గడిచింది. తిరిగి ఏప్రిల్ మొదట్లో సూరి మాయింటికొచ్చాడు. తతిమ్మావిషయాలతోపాటు క్లబ్బునుగురించికూడా అడిగాను.

అంతావింటే సూరాయికి క్లబ్బులో ఎక్కువ గౌరవం ఉన్నట్టు తోచలేదు మొదట్లో ఇతరులకు కొన్ని గురించి ఏమీ తెలియకపోవటంచేత సూరికి నిరంకుశాధికారం ఇచ్చారట కాని తరవాత వాడియిష్టంవచ్చినట్టు చేస్తున్నాడని ఇక తమ నాలి చుట్టు మరొకడి కాపడని ఇవ్వాలని కడంవాళ్లకు తోచింది. సూరాయికి ఒళ్ళుమండి క్లబ్బు అసలది తనయిష్టం అన్నాడు. కొన్నాళ్లు క్లబ్బు పాడుపెట్టాడు. సూరాయి అరుగులమీద ఉపన్యాసాలిచ్చాడు. శూద్రులంతా రెండోకోర్టు అద్భుతంగా పనిచేయిస్తున్నారు బ్రాహ్మణులు తెప్పరిల్లి ఇంకోసారి తిరిగి కోర్టుపని చేయటం మొదలుపెట్టింది. జరిగిపోయింది. ఇవ్వాళ సూరి ఇంకో ఎత్తువేశాట్ట. తలకోరూపాయి చొప్పున వేసుకుని మూడుకప్పులు చేయించి పందాలు పెడతానన్నాడు. కొంతకాలం నించి సూరాయి ఏదిచెప్పినా కాదనటం మొదలుపెట్టారు కొందరు మెంబర్లు. ఇప్పుడూ ఆమాటే అన్నారు. అయితే నేను సొంతంగా టూర్నమెంటు పెడతాను ఆడదలుచుకున్నవాళ్ళు ప్రారంభోత్సవంలోపల రుసుము చెల్లించి అప్లికేషను రిజిస్టరుచేయించుకోమన్నాడు. క్లబ్బుమెంబర్లమంటూ చెప్పటానికి వీలులేదు. మాకీ పందాలు వద్దన్నారు.

"ఇంతకీ కప్పల కొరకొచ్చారు పాపం రెండోకోర్టువాళ్లంతా చెల్లించారుసుమా ఇరవైరూపాయిలు వసూలైనై మనకోర్టువాళ్లు ఒక్కడివ్వలేదు రేపు సాయంత్రంలోపల ఇవ్వకపోతే ఎల్లుండి మాచెస్ లోకి రారు."

"నువ్వెంత స్ట్రిక్టుగా ఉండకపోతే ఏంరా? చేతి డబ్బెంత తగులుతుంది?"

‘‘ఏమీ తమ్ముడూ. అసలు కప్పలు మూడూ ఒకంది రూపాయలతో వచ్చేవే. నేనొకతద్దెంతో మూడూ ముప్పైరూపాయల ఖర్చుచేశా. అసలెందుకు? రేపు సాయంత్రంలోపల ఇంకో ఇరవై రూపాయలు రాలవూ?’’ అన్నాడు

సాయంకాలానికి కప్పలు సిద్ధమైనై. రాత్రికి ఇద్దరం సూరిగారూరు చేరాం. తెల్లవారగానే ఊరంతా కప్పలువచ్చిన వార్త వ్యాపించింది జనం గుంపులు గా వచ్చి కప్పలు చూసి పోయినారు. వచ్చిన ప్రతిప్రతి వాడితో మొదటికోరువాడు మూర్ఖుడన్నిగురించి చెప్పాడు సూరి. అందరూ సూరికి ప్రకటిత లేని కప్పలుచూడగానే ప్రవాసీహృదయంలో కామం ప్రవేశించింది కొందరు పెద్దలు గర్వంతో ఈవిషయం దీర్ఘంగా చర్చించి ఏమొ ఏతో మేంచెప్పి ఒప్పిస్తాం. పందాలు ఇంకొండరోజు ఎగలపెట్టి కోర్టు తెగదు విప్పించ’’ ని కోరారు. అది చెప్పటానికే జంకాడు మూడుకప్పలూ రొండోకోర్టుకు పోటీచేస్తాయి’’ నన్నాడు

నేను సూరిప్రయత్నం నిష్ఫలమౌతున్నదనిబాధ పడుతున్నాను—ఈ పందాలతో సూరికి నష్టం వస్తుందనికాదు, పందాలు రొండో కోర్టువాళ్ళతో జరగవనికాదు మొదటికోర్టువాళ్ళు కూడా పందాలులో పాలుతీసుకోకపోతే సూరి గ్రామపునర్నిర్మాణం చెయ్యలేకపోయినట్టే వాడి కది పెద్దమీదదెబ్బ. కాని సూరెందుకు దెబ్బతింటాడు? ఆరో అయిదుగంటలకు సన్నగా పొడుగ్గా ఉన్న కిగ్రవాడు పోతూపోతూ వచ్చినట్టు లోపలికొచ్చాడు. కప్పలుచూశాడు. బొడ్డులోనించి రొండురూపాయలుతీసి తన్ను సింగిల్సుకు వెయ్యమన్నాడు పోతూపోతూ ఈవిషయం మర్నాటిదాకా ఎవరితో చెప్పొద్దన్నాడు. కాబట్టి సూరాయి వచ్చిన ప్రతివాడితో చెప్పాడు. అరగంటతరవాత దృశ్యంచూసి తీరాలి. సూరి డబ్బు రొండుచేతుల్తో వసూలుచేశాడంటే నమ్మండి ఇక కోర్టుమెంబర్లవిషయమా? వాళ్ళకు ఒకరొకరికి ఆగ్రాగానికి మేములేదు ఎప్పుడు సూరి ‘‘ఇక తీసుకోను’’ అంటాడో అనేభయం.

‘‘టూర్నమెంటు’’ జయప్రదంగా జరిగింది.

—కొడవటిగంటి కుటుంబరావు.

# విరహిణి

ఏమిటంచవే చెలీ!<br>ఏడనున్నాడో<br>కరుణించి ఒకసారి<br>కంటికగపడడే! ...ఏమి

తెలిమబ్బుతెరలలో<br>తొలిగి చిరునాటి<br>చందమామొయిగనో<br>జాడ తెలియక ...ఏమి

కనురెప్పవాల్చక<br>కాంతుడే దేశమ్ము<br>ఉన్నాడనో యేమొ<br>ఊహించలేమన్నా! ....ఏమి.

దేశదేశాలలో<br>దివ్యసౌధాంతటి<br>తొంగేటిగాడ్పుకే<br>తెలియునో వార్త! ...ఏమి.

చిఱుతవెన్నెలలోన<br>చిఱుగువ్వలో నేమొ<br>చెబుతున్నదియేమొ<br>చెవియొగ్గి వినవే! ...ఏమి

చూడవే ఓచెలీ!<br>చూడవే! వనలక్ష్మి<br>తలయూపి యున్నదే<br>పలుకంగ లేక ....ఏమి.

కాంతుడే కనపడని<br>కాంతకేమున్నదే?<br>అడవిగాసిన వెన్నె<br>లౌనె నాబ్రదుకు, ....ఏమి.

—కందుకూరి రామభద్రరావు.

# సందేశము

[ఈక్రిందిపద్యములు "శోకాభంగ" మను కావ్యములోనివి. నిర్జనద్వీపమున నేకాకియై ప్రవాసఖేద మనుభవించు కామార్తుఁడగు సుందరుని వాక్యములు.]

౧

తలిరుంబ్రాయపుఁ దీవజవ్వనులఁ జేతఃప్రీతి గాటంపుఁగౌ
గిళులం జేర్చి యెవో రహఃప్రణయవాగ్వృత్తాంతముల్ పల్కుచున్
వలపుల్ నేర్చిన పిల్లతెమ్మెర! నినుం బ్రార్థింతు, నా నెయ్యపున్
జెలియన్ జేరఁగఁబోయి తెల్పఁగదవే శీఘ్రంబ నావృత్తమున్.

౨

లలితలతావిలాసవతులన్ దరియంజని పల్లవాధరం
బుల నధికానురాగమున ముద్దిడి తీయని తేనె లాను నో
యళివర! ప్రేమశీలివిగదా, విహరింతువు స్వేచ్ఛఁ; గాన నా
చెలియకు నావిషాదకథఁ జెప్పవె యిప్పుడ పోయి ప్రేముడిన్.

౩

సరసాంతఃకరణుండవై ఘనుఁడవై సన్మార్గమందున్ నిరం
తర మిచ్ఛాకలనావిహారముల నానందింతువో యబ్దమా!
చిరకాలాత్తవియోగదుఃఖగళితాశేషాశ్రువుల్ గ్రోలి క్ర
మ్మఱ నా నెచ్చెలిచెంగటం గురిసి ప్రేమం దెల్పు మస్మత్కథన్.

౪

ఆ లేమామిడి యాకుజొంపములలో నాచిమ్మచీఁకట్లలో
నాలీలన్ విరహవ్యథాజనితదైన్యస్ఫూర్తి శోకస్వనం
బాలాపించు పికంబ! యిమ్మధువుతో యానంబుఁగావించి నా
నీలన్ గన్గొని మచ్చరిత్రముఁ గృపన్ దెల్పంగదే యామెకున్?

౫

వేలాచుంబనసౌఖ్యసంపదలకై ప్రేమంబు పొంగారఁగా
లోలత్వంబున నేగుదెంచు నుదకల్లోలంబ! వైళంబ దూ
రాలన్ నాసఖియున్న తీరమును జేరంబోయి వాకొమ్ము ని
ష్కాలుష్యంబున నొప్పు నాచరితమున్ గంభీరఘోషంబునన్.

—వఝ్ఝుల వేంకటేశ్వరకవి.

# మేనల్లునిక్కట్నం

రైలుబండి ఎంతకుశలంగా వుంటుందో అంత కుశలంగా వుంటుంది రైల్వే ఉద్యోగస్థులు కాపురముండే బస.—సరిగా నీ మగడూ నీ పెళ్ళాం పడుకోవడానికన్నా సరిపోతుందో లేదో అన్నంత పడుగ్గది, దాని పక్కనే సామానుపెట్టుకోవడానికీ భోజనాలు చేయడానికీ రెండింటికీకలిపి ఓగది, ఆగది కిసుకుంటూ వంటగది గజం గజన్నర చతురపుది ముందుకో చిన్నవసారా, వసారా కెదర అసుకుంటూ నీ నీళ్ళోసుకునే పెరడు,—అటువంటి బసలో టిక్కెట్టు కలక్టరుత్ర్యంబకంయొక్క కాపురం మజ్లో చుట్టంపక్కం వస్తే వసారా కో తెరేసి వసారాలో పడ్డంగాలిసిందే. నిదరకింకోతావు స్టేషన్ విశ్రాంతిగదిలో కుర్చీలోనో, టిక్కెట్లు ఇచ్చే గదిలో బల్లమీదనో చూపించాలిసిందే.

త్ర్యంబకానికి శ్రీరామారావు మేనల్లుడు. ఒకనాడు శ్రీరామారావు త్ర్యంబకాన్ని చుట్టపుచూపుగా చూడ్డానికొచ్చి, రాత్రి భోంచేసి త్ర్యంబకంతోకూడా పిచ్చాపాటీ ఆడుకుంటూ స్టేషన్ ప్లాటుఫారంమీదికెక్కి మగవాళ్ళ విశ్రాంతిగది ముందున్న వసారాలోకి ఒక పడకకుర్చీ లాగించుకొని మంచివీలుగా కూర్చున్నాడు.

త్ర్యంబకం 'బుకింగుఆఫీసు' గదిలో తనపని చూచుకోవడానికివెళ్ళి తిరిగి పదినిమిషాల్లోవచ్చి "నీవు హాయిగా యీలోపల నిదరపోవచ్చును నాకు రాత్రిడ్యూటీ లేదు. నేను పోయి పడుకుంటాను తెల్లారితే తిరిగి కనిపిస్తాను" అని త్ర్యంబకంవెళ్ళిపోయినాడు. శ్రీరామారావొకమారు అట్టే వెళ్ళిపోతూవున్న మేనమామకేసి చూచి తన యథాస్థాయి కొచ్చినాడు అతని మనస్సులో ఒక ఆలోచన పుట్టికే మామను నడుగుదామా అని అడుగకుండావుంటే మంచిదేమో నని ఊగిసలాడుతూవుంది. తుద కడుగలేకపోయినాడు.

త్ర్యంబకం వెళ్ళిపోయి నాక అక్కడ 'లైసెన్సు' కూలీ వొకడగపిస్తే వాణ్ణిపిలచి, "వొరేవు ఈకుర్చీ కొంచెం ఆరుబయటపెట్టు" అన్నాడు. శ్రీరామారావు ఆకూలివాడు వెంటనే ఆకుర్చీ ఆరుబయటవేసినాడు. వెన్నెల కాస్తూవుంది. ప్లాటుఫారంమీద నాటి నక్రోటన్లు, కరువేరుచెట్లు అన్నీ అదో లీలగా అగపిస్తూన్నాయి. ఓమల్లెఅంటు మొగ్గతొడిగి ముదురుమొగ్గలు కొన్ని విడిచి పరిమళిస్తూంది ఏరైలూవచ్చే వేళకాదది. దీపాలు చాలాభాగం ఆరిపేసేరు. ఒకటో రెండో ముఖ్యంగా వుండవలసినవున్నాయి గుండారుకట్టాయిన స్టేషన్ మాస్టరు తాళాలూచుకుంటూ రెండుమూడు సార్లు తిరిగి 'ఒరేవు' అని మళ్ళో లైసెన్సుకూలీనిపిల్చి "ఆ కుర్చీ యిలా వేయరా," అని ఒక పేముకుర్చీ శ్రీరామారావుకు పక్కగా వేయించుకుని కూర్చున్నాడు.

శ్రీరామారావు ఊరుకోలేక—దొరలకైతే 'ఇంట్రడక్షన్' గాని హిందువులకెందుకనో ఏమో—"పంతులుగారూ! తమరేనాఅండీ ఇక్కడి స్టేషన్ మాస్టరుగారు?" అన్నాడు. 'అవునండీ' అన్నాడు ఆయన. అని ఊరుకోక "మీ రేబండీకెడతారండీ" అన్నాడు. "ఏబండీకి వెళ్ళను. ఇక్కడకు మామామగారింటికివచ్చినాను త్ర్యంబకంగారు నాకు మేనమామలు" అన్నాడు శ్రీరామారావు "అలాగాఅండి! నిక్షేపంలాంటి మీ బోంట్లు మేనల్లుళ్ళు వుంటూంటే వారమ్మాయి పెళ్ళికోసరంగా ఆలా తల్లడిల్లి తల్లక్రిందులా యోజిస్తాడేమిటండీ మాత్ర్యంబకం. రేపుదయం కదిపిచూస్తాన్నేను" అన్నాడు వెత్తిగా స్టేషన్ మాస్టరు "ఈయన కదిపిచూసేదేమిటి? నేనే కదిపి చేసుకుంటాను" అని లోపలనుకొని శ్రీ రామారావు పైకి "ఏం? మా మేనమామగారు వారమ్మాయి కీడేడు పెళ్ళిచేయడం తలంపుతో వున్నారా యేమి? చదువుకుంటూవుండవని విన్నాను" అన్నాడు "చదువుకుంటూంటే వివాహం చెయ్యకూడదాయేమి? త్ర్యంబకంగారికి తొందరగా వున్నా లేకపోయినా ఆయన మిత్రులం మేమంతాకైనా తొందరపెట్టి ఆయ నాపిల్ల నెవరికో యొకరి కీయేట్ల

కన్యాదానం చేయించే యేర్పాటుచూడాలి''అన్నాడు స్టేషన్ మాస్టరు. ఎవరికని అడిగేడు శ్రీరామారావు. ''ఎవరి మిటి మీకే''నన్నాడు స్టేషన్ మాస్టరు.

స్టేషన్ మాస్టర్నింకా మరేమేమో అడగాలని యనుకొన్నాడు శ్రీరామారావు, కాని అడగలేకపోయినాడు. అంతలో ప్రక్క-స్టేషన్ నుంచి 'లైనుక్లియర్ టెలిఫోన్' గంట వినబట్టిది. స్టేషన్ మాస్టరువెళ్లిపోయినాడు, 'గుడ్ నైట్' అంటూ.............. ....

సరిగా రాత్రి 12 గంటలైంది. వాల్తేరు నుంచివచ్చే జనంగాడీ వచ్చి స్టేషన్లో ఆగింది. ఎక్కే-జనం కిటకిట; దిగేజనం కిటకిట; వెలిగించిన దీపాలముందు వస్తువుల మిలమిల: ముఖాల కలకల:——— రెండవతరగతి బండిలో నుంచి ఓయువతి దిగింది. ముఖమ్మీదికో బురకా కప్పుకొనివుంది, ఆమెను పోల్చుట కెవరికీ శక్యం కాకుండా. 'లైసెన్సు' కూలీమట్టాకు 'కూలీకూలీ' అంటూ ఆపెట్టెదాకా వెళ్ళి అక్కడాగి వెంటనే ఆమెపెట్టె నెత్తుకుని ఆమెను తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతిగదివద్దకు తీసికొనివచ్చి లోపలవిడిచి. పెట్టి తానక్కడుంచి, వెళ్లిపోయినాడు. ఆమెను టిక్కెట్టడిగినవారూలేరు. ఆమె దిగినసంగతి కనుక్కొన్నవారూలేరు.

దాన్నిబట్టి యోజిస్తే ఆమె ఆలావచ్చి యక్కడ తఱచు దిగుతూవుండడం రివాజేమో అన్నట్లు తోచక మానదు——కొంచెం గుట్టున్నవాళ్ళకు. రైలు వెళ్లిపోయింది. ప్లాటుఫారమ్మీద దీపా లారిపోయినాయి. మఱి రైలు రాత్రివచ్చేరైలు రాత్రి పొయ్యేరైలుకూడా లేవు కూలివానివద్దనుంచి స్టేషను మాస్టరు వఱకూ హాయిగా తలుపులు తాళాలువేసికొని యిళ్ళకుపోయి నిదరపోవచ్చును. పోవచ్చునేమిటి? పోయి నిదర పోతూవున్నారు

> **కృష్ణవేణమ్మకుఁ బూజ**
>
> వ. అది శ్రావణమాసము.
>
> గీ. దాఁటె బెజవాడ యనకట్ట నీటిమట్ట
> మిర్వదడుగులకుం బయిఁ, గృష్ణవేణ్ణ
> యుభయతటముల నిండారి యుబ్బిపొంగి
> పొర్లి పార్వెఱుచుండె సముద్రమునకు.
>
> గీ. అధికమా ప్రవాహ మప్పుడు కృష్ణకు
> నధికమా ప్రభావ మంచు నప్పు
> డరుగుదెంచుచుండి రిరుగూళ్లనుండియు
> నాఁడువారు స్నాన మాడఁ బాఱ.
>
> గీ. పసుపుకుంకుములతోడఁ బండ్లతోడఁ
> బూలతోఁ గృష్ణవేణ్ణకుఁ బూజఁ జేసి
> మ్రొక్కుచుండిరి పసిపైరుచక్కఁబడఁగ
> నత్తఱిని బుణ్యకాంతలు తత్తటముల
>
> ——కడుపుతీపు.

శ్రీరామారావు తన పడకకుర్చీలో కూర్చుని తావత్పర్యంతం జాగరూకత్తో అన్నీ పరికిస్తూ, ఒక్కమాఱు కన్ను మూసుకున్నాడు. నిశ్శబ్దం, ఒంటరితనం మిక్కిలి ఎక్కువైనకొద్దీ ఆకన్నుమూతలో అన్నీ మాయమై పోయినయి. కాని యువతి రైలుదిగడం యువతి రైలుదిగి తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతిగదిలోకి వెళ్ళడం మాత్రం మాయంగాలే. ఆప్రదర్శన మాలాగ్గానే యుండిపోయింది కనుకట్లే.

ఎవరో నవాబుగారి కోమార్తె అని అనకొన్నాడు కన్నుతెఱచి ఆగదివైపునకు చూచేడు గదిలో దీపంవెలిగించుకొని ఆమె తన బురకా కూర్చొనికి తగిలించి ఓ కుర్చీఅద్దానికెదురుగా తీసికొని తనకుదా తన చెదరిన ముంగురులు సరిగా దీసుకుంటూంది. ఆ అద్దంముందామె ఫస్తుదొరసానిలాగుంది పగటిపూట ఆమెదేహచ్ఛాయ బంగారు పసిమిగాఁదోఁచి నిజం దొరసానుల్లో నుంచి కేటాయింపబడితే కేటాయింపబడేదేమోగాని ఆరాత్రివేళ ఆదీపంకాంతిని ఆమె తొడిగికొన్న గౌనును బట్టి, శాలిక కేసికొన్న జోళ్లుబట్టి, మేజోళ్లుబట్టిచూస్తే

జాతిదొరసానే అనుకోవాలి, ఆపైకుర్చీమీదనుంచి లేచి టకటక లేగ్గా గచ్చుమీద నడిచివచ్చి గుమ్మంకమ్ముల రెండింటిమీద చెఱోచెయిఆన్చి, ఓమాటు ప్లాట్‌ఫార మంతా కలయజూచి వెనక్కు వెళ్లింది. వెనక్కి వెళ్ళి ఆ గౌనూ అవీ తీసి వేసికొని రాత్రి తొడుక్కునే వొదులొదులువి వేసికొని తన పలుపు పేముమంచంమీద విప్పికొని తిరిగి గుమ్మంవద్దకువచ్చి యిటూఅటూచూచి తలుపులు వేసికొని పండుకుంది.

శ్రీరామారావు, ఆమె గుమ్మంవద్దకు వచ్చినప్పుడల్లా కళ్ళుమూసికొని, మఱి తక్కినప్పుడల్లా కళ్ళుతెఱచుకొని, ఆమెను గమనిస్తూవున్నాడు 'ఆమె బీబీ కాదు, ఎవరోదొరసాని' అని అనుకున్నాడు. అదే యూహతో నిదరోయేడు. టెలెగ్రాఫ్ గదిలోని గడియారం టంగుటంగున అయిదుకొట్టింది. సిగ్నలర్ వెంకటస్వామి బసముందటి కోళ్ళు కొక్కొరోకో మనడం వినిపించింది. వేగుచుక్క వెలవెలవుంది.

"మంచు చాలాకురిసింది రాత్రి" అని తన పడక్కుర్చీలోంచి ఒళ్ళు విఱుచుకుంటూలేచి శ్రీరామారావు ఉత్తినే మల్లెపాదకేసివెళ్లి పువ్వులుకోస్తూవున్నాడు. గుప్పెడు కోసినాడు.

అప్పుడు ఆడవాళ్ళ విశ్రాంతిగదిలోనుంచి యువతి తనపెట్టె బేడా సర్దుకొని, చీర కట్టుకుని, జాకెట్టు తొడుక్కుని మామోలు హిందూయువతి మల్లే చిన్ని కుంకుంబొట్టుంచుకొని ఓపుస్తకం చేత్తోపుచ్చుకుని యీవలకువస్తూ తలుపు తాళంవేసి ఆ తాళపుగుత్తులు తన మొల్లోగ్రుచ్చుకుని ఆలా ప్లాట్‌ఫారంఅంట యీదా లాపంగా నడుస్తూంది. నడుస్తూ 'ఎవరా పువ్వులు కోశేది ?' అని కేకేసింది. "నేను త్ర్యంబకంగారి మేనల్లుణ్ణి, శ్రీరామారావుని" అని శ్రీరామారావు వెనక్కి తిరిగిచూచినాడు.

ఆయువతి తన మామకూతురని పోల్చుకున్నాడు. నిర్విణ్ణుడైపోతూ గబుక్కునఁదేటి "ఎక్కణ్ణుంచివాక సుందరమ్మా ?" అని యడిగేడు. "నీ వెక్కణ్ణుంచి వచ్చేవు ?" అంది సుందరమ్మ. "నేను రాత్రిరంతా యిక్కడే ఆపడక్కుర్చీలో పరున్నాను, మీయింటిచోట్లేక" అన్నాడు. "మాయింటిచోటుండదు రాత్రి తండ్రికి నిదరభంగం కలుగచేయడ మెందుకు అని నేనూ రాత్రి ఒంటిగంటనుండి యిక్కడే ఆడవాళ్ళ విశ్రాంతిగదిలో పరున్నాను" అంది సుందరమ్మ. అని యింకా అంది "అయితే శ్రీరామారావు! మీతండ్రి మాతండ్రిని కట్నం ౫౦౦౦ అడుగుతున్నాట్టగా." అని అడిగింది "ఆసమస్య ఏలా తేల్చడానికి నాకు చేతకాకే యిక్కడకొచ్చిన్నీ నిన్నట్నుంచి కొట్టుమిట్టాడిపోతున్నాను." అన్నాడు శ్రీరామారావు.

"అయితే రా! ఎన్నిపువ్వులు కోసినావు మల్లెపువ్వులు? నాకోసమేనా" అని ఆపువ్వులన్నీ అతగాని గుప్పిట్లోంచి ఊళ్లాక్కుని "రాత్రల్లా నాకు సరిగా నిదరపట్టలే. ఆరుబయట నీవని తెలిస్తే నేనుకూడా ఓ కుర్చీ ఆరుబయటవేయించుకొని పరుండేదాన్నిసుమా" అంది. "నీవోమాటు బీబీలాగగనిపించేవు. ఓమారు దొరసానిలాగగనిపించేవు; పలకరిద్దామాఅంటే" అన్నాడు శ్రీరామారావు. "ఎవరూ పలకరించకుండా వుంటారనే రైల్లో బీబీవేషం వేసికొని వెయిటింగురూమ్ములో దొరసానులవేషంవేసికొని కూర్చుంటూ వుంటాను. హిందూయువతిగా కనిపిస్తే అంతా అడిగేవాళ్లే 'పెళ్లైందా? పిల్లలెంతమందమ్మా? మీ అత్తారివూరేవూరు? ఎవరమ్మాయివి?' అని most irrelevant questions' అంది సుందరమ్మ. "అయితే ఆ ప్రశ్నలు lovers lovers ని అడిగినా irrelevant ప్రశ్నలేనా ?" అన్నాడు శ్రీరామారావు. "Lovers అడుక్కోనక్కర్లేదు వాళ్ళకన్యోన్యం అంతా looks వల్లనే తెలిసిపోతుంది. తెలియదంటే నీకు ?" అంది ఆమె. "తెలియకేం. your looks make my father lose Rs. 5,000 and your father gain Rs 5,000." అన్నాడు అతడు. " Why of fathers ? Think of us. We are neither losers nor gainers. we are lovers." అంటూ శ్రీరామారావుతో చెట్టపట్టాలేసికొని అతణ్ణి ఇంటికితీసికొని వెళ్ళిందిఆమె.

కట్నంపుచ్చుకోకుండా చి. సౌ. సుందరమ్మను చి. శ్రీరామారావు వివాహమైనాడని కథపూర్తిచేస్తూఆనూతనవధూవరుల్ని దీవించడానికి సందేహం ఎందు కింక?

—కవికొండల వేంకటరావు.

# గురుశిష్యసంవాదము

శిష్యుడు

నమస్కారములు! ఏదో వ్రాయుచున్నారు!

గురువు

వ్రాయుట యిప్పుడే అయినది. శ్రీవివేకానందస్వామివారు ఆయన స్నేహితుఁడగు బాబూ ప్రమదమిత్రుఁడుగారికి 30-౫-౧౮౯౭ తేదీని వ్రాసిన కడబటి యాంగ్లలేఖ యొకటి నీవంటి ప్రియశిష్యుఁడే యొకఁడు యెత్తి వ్రాసి యెన్నాళ్ళక్రిందటనో నాకుఁ బంపినాఁడు.

శిష్యుడు

శ్రీస్వామివారి ప్రసంగములు మూడో నాలుగో వెనుక మీకంపిన యాయనయేనా?

గురువు

ఔను!

శిష్యుడు

ఇదికూడ ఆంధ్రపరివర్తనార్థమే పంపినారా?

గురువు

"మీరు పరిశీలనదృష్టితోఁ జదువుటకు మాత్రమే" యని వ్రాసినాఁడుగాని, నేనది తెలిఁగించి యేపత్రికలోనో ప్రకటింపవలయునను నుద్దేశమే యతని కుండినట్లూహించినాను.

శిష్యుడు

ఆయన కీ లేఖ యెచట దొరికినది?

గురువు

'ప్రబుద్ధభారత' యను సుప్రసిద్ధాంగ్లపత్రికలోఁ జూచినాఁడు.

శిష్యుడు

మహానుభావుఁడగు వివేకానందస్వామి వ్రాసినది లోకోపకారకముగా నుండకమానదని తలఁచెదను

గురువు

నేను నట్లే యెంచుచున్నాను - కాని—

శిష్యుడు

"కాని" యని నీళ్లు నములుచున్నారేమి?

గురువు

బాబూ ప్రమదమిత్రుఁడుగారు శ్రీస్వామివారివలెనే యానాఁటి మహామేధావులలో నొకరఁట. స్వామితో పాటు ఆధ్యాత్మికకృషి చేసిన ప్రాణమిత్రుఁడఁట. ఉత్తరము తీరు చూచిన నుభయులకును అభిప్రాయభేదము విశేషముగా నున్నట్లు తోఁచుచున్నది.

శిష్యుడు

స్వామి తిట్టుచు వ్రాసినాఁడా యేమి?

గురువు


తిట్లు లేవుగాని తిట్లకంటెను తీవ్రముగా నుండు దెప్పుళ్లున్నవి సన్న్యాసియైనను స్వామివ్రాఁతలో రజోగుణప్రకోపమును, అభిమానాతిశయమును స్ఫుటముగాఁ గానిపించుచున్నవి

శిష్యుడు


వివేకానందస్వామి యెప్పుడును పిడుగునోటివాఁడే!

గురువు


పిడుగుతోఁ బాటు చల్లనివర్షము సస్యసమృద్ధి నిచ్చునట్లు ఆయన గాటుమాటలతో వెలువడు బోధామృతము చదువువారిని సత్త్వసంపన్నులుగను, దేశోపకర్తలుగను



బెజవాడ కనకదుర్గాలయము.



కృష్ణానది ఆనకట్టు — రైలువంతెన.



ఇంద్రకీలాద్రినుండి కృష్ణానదిదృశ్యము

జేయును భోజనవిషయమునను బూర్వాచార్యుల విషయమునను మాత్రము అభిప్రాయభేదము లుండకమానవు.

శిష్యుడు

ఆలాగుననా? ఏదీ? దయచేసి యాలేఖ చదువుడు.

గురువు

ఇదిగో! వినుము!

ఆల్మోరా,
౩౦, మే, ౧౮౯౮.

ప్రియమిత్రమా,

తప్పించుకొనశక్యముగాని గృహసంబంధమైన విపత్తేదో నీకు దటస్థించినదని నే విన్నాను. జ్ఞానవంతుడవగు నిన్నాకష్టమేమి చేయగలదు? అయినప్పటికిని సాపేక్షకమగు ఐహికజీవనమునకు స్నేహసంసర్గసుఖము లానుషంగికములని తెలియుటచే, ఇందా మాట నే నెత్తుకొనవలసివచ్చినది, కాని యట్టి దుఃఖసమయములు తఱచుగా నుంచి యాధ్యాత్మికానుభవమును గలిగించుచుండును. తాత్కాలికముగా తమోమేఘములు తొలగిపోయి సత్యాదిత్యుని దివ్యతేజస్సు దృగ్గోచరమగును. కొందఱకు సంసారబంధము సగపాలు సడలిపోవును అన్ని బంధములలోను దృఢతమమైనది ప్రతిష్ఠాబంధము. ఖ్యాతిభంగభీతి మరణభీతికంటెను బలవత్తరమైనది; అయినను అట్టి యవసరములందు దీనిపాశముకూడ గొంచెము వదులయిన ట్లగపడును. మనుష్యాభిప్రాయములు వినుటకంటె మనలో వసియించియుండు పరమేశ్వరుని మాట వినుట కడు శ్రేయస్కరమని మనసున కా క్షణమందు బోధ కట్టును. కాని మఱుంతలో మరలగ్రమ్ముకొనును— మాయ యనగా నిదియే!

చిరకాలమునుండి నేను నీకు సాక్షాత్తుగా ఉత్తరములు వ్రాయుట లేకపోయినను, నిన్ను గుఱించిన వార్తలన్నియు నితరులనుండి నాకు దెలియుచునే యున్నవి. కొంతకాలముక్రిందట భగవద్గీతానువాదపు ప్రతినొకటి దయతో నీవు నా కింగ్లండునకు బంపితివి గ్రంథోపరితలమున నీవువ్రాసిన దొక పంక్తిమాత్రము కలదు ఆ పుస్తక మందినట్లు నేను మూడు ముక్కలలో బ్రత్యుత్తరమువ్రాసి నీ కంపితిని; అందుచే నీపై నా కుండిన పూర్వానురాగ మిపుడున్నదో లేదోయను సందేహము నీకు గలిగినట్లు నాకు దెలిపినది

ఆ యనుమానమున కాధారములేదు. కాని నా సంక్షిప్తలేఖమునకు మాత్రము సరియైన కారణములున్నవి:—

నాలుగైదేండ్లకు, ఆంగ్లపరివర్తనమందిన గీతాగ్రంథము డెక్కపైని నీ చేతితో వ్రాసిన ఆయొక్కపంక్తి మాత్రమే చూచు అదృష్టము నాకు బట్టినది అంతకంటె నధికముగా వ్రాయుటకు నీ కవకాశము లేనప్పుడు, ఎక్కువగా వ్రాసిన యుత్తరము చదువుకొనుటకుమాత్రము నీకు దీఱికయుండునా! యను సంశయము నాకు దోచినది. ఇది ప్రథమకారణము.

హిందూమతప్రచారకులగు తెల్లతోలువారితో నీకు మిక్కిలి స్నేహము కుదిరినదనియు, తుంటరులగు మనదేశపు నల్లవాండ్రన్న నీ కసహ్యమనియు నాకుదెలియవచ్చినది. ఏతద్విషయకమైన భయము రెండవకారణము.

ఇక మూడవకారణ మేమనగా, నేను మ్లేచ్ఛశూద్రాదులలో జేరినవాడను, ఆహారనియమము లేక యన్నియు దినువాడను, వీరు వా రనక అందఱితో గలిసి యీదేశములోను, పై దేశములలోను బహిరంగముగా భుజించువాడను. అదియుగాక నా యభిప్రాయములుమాఱి మహావికృతములైనవి. నిర్గుణమును కేవలమును అగు బ్రహ్మపదార్థము నాకగపడి, యొకొక పడుచున్నది—అని చెప్పగలను; కొందఱు పురుషులలో ఆ మహాతత్వముయొక్క ఆవిష్కరణము అసాధారణముగా నాకు జూపట్టుచున్నది; అట్టి యవతారమూర్తులు భగవంతులని చెప్పినచో నా కదియును గ్రాహ్యమగుచున్నది అంతేకాని కేవల బుద్ధిచే గల్పింపబడి స్వీకరింపబడుచున్న జగత్కర్త్రాదులపైకి నా మనసు ప్రసరింపదు.

నా జీవితములో అట్టి భగవదవతారపూరుషుని జూచినాను, ఆయన యాదేశముల ననుసరించి ప్రవర్తించుటకే నేను బ్రతికియున్నాను. స్మృతికర్తలును

పురాణకర్తలును కించిద్జ్ఞులు, అవి భ్రమప్రమాద జన్యములును, జాతిద్వేషప్రేరితములును అగు వాక్యములతో నిండియున్నవి. విశాలహృదయమును బౌద్ధార్యానురాగములను జూపు నందలి కొన్నిభాగములు మాత్రమే స్వీకరణార్హములై యున్నవి, తక్కినవి త్యాజ్యములు. ఉపనిషత్తులును గీతయునే యథార్థములైన ఆమ్నాయములు. రాముఁడు, కృష్ణుఁడు, బుద్ధుడు, చైతన్యుఁడు, నానక్కు, కబీరు మున్నగువారు నిజమైన అవతారపురుషులు ఎందుచేత ? వారి హృదయములు ఆకాశమంత విశాలములైనవి గనుక, అందు ముఖ్యుఁడు రామకృష్ణుఁడు శంకరరామానుజాదులు సంకుచితహృదయులైన కేవలపండితులుగాఁ గనఁబడినారు. ఆ ప్రేమ యేది? ఇతరుల దుఃఖముచూచి పరితపించి వలవల యేడ్చు ఆ మృదులహృదయమేది ? వట్టిచదువు ! శుష్కపాండిత్యము ! తన మోక్షముకై యే తహతహ ! మితిలేని తొందర ! కాని అయ్యో ! అది సాధ్యమగునా ? ఎప్పుడైనఁ బూర్వ మట్టి ముక్తి సిద్ధించినదా ? ముందెన్నడైన సిద్ధింపఁగలదా ? అణుమాత్రపు టహంభావశేషమైనను లోన నున్నంతకాలము అట్టిముక్తి లభించునా ?

మఱి యొక వైపరీత్యము ! వర్ణరూపపృథగ్భావము సంఘము నుజీల్చి పాడుచేయు మహానర్థకరమైన భావమును మాయామూలమును—అను విశ్వాసము నానాఁటికి పెరిఁగి నా మనసులో దృఢముగా నాటుకొనుచున్నది, పుట్టుకనుబట్టి కాని యోగ్యతను బట్టికాని చ్చు జాతిభేదమంతయు బంధకారణమే "అదంతయు సత్యమే, ఆభావము లోపల నుంచుకొనవచ్చును గాని, పరస్పరసంబంధము గల బాహ్యప్రపంచమునమాత్రము జాతిభేదములవంటి భేదములు పాటింపకతప్పదు అవి యత్యావశ్యకములు" అని కొందఱు మిత్రులు హితోపదేశము చేయుదురు. ప్రశుత్వైభావరూపమైన పిఱికిపేడితనముతోఁ గూడిన యేకత్వభావము లోపల ! పైని పరపీడారూపమైన నరకలోకపిశాచతాండవము ! పరమదరిద్రులగు చండాలాదులకు మరణబాధ కలిగించుచు, ధనవంతుఁడైన మాలవానిని మాత్రము "ఓహో ! ఈయన మతపోషకుఁడు." అనిపొగడుట !

మఱియొకమాట, గ్రంథములు చదివిచూడఁగా మతసంబంధమైన శిక్షణాభ్యాసములు శూద్రునకుఁ గానట్టు నాకుఁ జూపట్టుచున్నవి: ఆహారమునుగూర్చి కాని విదేశయాత్రనుగూర్చికాని యతఁడు తనబుద్ధి నుపయోగించి వివేచించుకొనుచోడల, నది యతనికి నిష్ప్రయోజనమగును, పడినశ్రమ యంతయు వృథాశ్రమయగును. నేను శూద్రుఁడను, మ్లేచ్ఛుఁడను, ఆ బాధలన్నిటితోను నా కేప్రశక్తియులేదు నాకు మాలకూడైననేమి ? మ్లేచ్ఛభోజనమైన నేమి ? జాతిసంబంధమైన పిచ్చిమాటలన్నియుఁ బురోహితులు రచించిన పుస్తకములలో నున్నవి గాని పరమేశ్వరప్రకటితములైన పుస్తకములలోలేవు. తమపూర్వులు గావించిన మహాకార్యముల ఫలములను పురోహితులనే యనభవింపనీ! నేనుమాత్రము ఎందు నా శ్రేయస్సంతయునున్నదో యా భగవద్వాక్యము ననుసరించియే పోయెదను.

"పరోపకారమే పరమార్థము, తక్క నిత్యనైమిత్తిక బాహ్యకర్మాదులన్నియుఁ బిచ్చిచేష్టలు, కేవలస్వమోక్షసుఖాపేక్షకూడఁదప్పే !" అను నింకొక సత్యము నాకనుభవగోచరమైనది. సర్వమను ఇతరులకై త్యజించువానిదే మోక్షము. ఇఁక "నాకుముక్తి ! నాకుముక్తి!" యని యహోరాత్రములు తలఁ బగులగొట్టుకొను తక్కినవారు తమ ప్రస్తుతక్షేమమునకును భావిశ్రేయస్సునకును గూడ భంగము గావించుకొని తిరుగలాడుచుందురు—ఇది స్వయముగా నేను పెక్కుపట్ల ననేక పర్యాయములు చూచినాను. ఈ సంగతులన్నియు నాలోచించుకొనఁగా నీకు జాబువ్రాయుటకు నాకు ధైర్యముచాలినదిగాదు. ఇన్ని విప్రతిపత్తులున్నప్పటికిని, నాయెడలఁగల నీమైత్రి చెడిపోకుండ నెప్పటియట్లే యున్నట్లు నీ కగపడుచో, నిజముగా అది నాకు మహానందకరమైన పర్యవసానమని నే భావించెదను

భవదీయుఁడు,

వివేకానందుడు.

# భాగస్వాములు

౧

ఆబాలగోపాలమ్ము ఊరిలో
ఆదరింపగ, వినయమ్ము చెలి
అనయమ్ము చూపగ పెంపెసంగెడి
రామన్న రామన్నే.

౨

ఇంటిలోపల పొలములోపల
విసుగు లేకను కసురుకోనకను
చెల్వునితో మసలగ నుండు తొయ్యలి
సీత సీతమ్మే.

౩

ముచ్చటాడుచు కూలిజనముతో
ముందుముందుగ మునుము నాటును
పాదుపాదుకు కుంటజలములు
భర్త పోయుచునుండగన్.

౪

తావుదొడ్లలో గొర్రెగుంపును
తడవతడవకు కదలదోలును
గూడబాపను కప్పితూలుచు
కునికిపాట్లతోనైనగా.

౫

మిఱుమిట్లుగొల్పగ తీగెమెఱపులు
మిన్ను గ్రమ్మిన కాఱుమొయిలుకు
మునురువానలు బట్టిలోకము
ముజ్జిడ్డుగానున్నన్.

౬

వడగాడ్పువిసరెడి మండుటెండలో
వణకిపోయెడి శీతకట్టున
ప్రకృతిమార్పుల ప్రతిఘటించుచు
పాటుపడుదురు పొలములో.

౭

విలాసవస్తువు పేరుఒక్కటి
వినియెఱుంగరు సీతమ్మరాములు
ఉప్పు దీపపుచమురు తల
నూనె లనుకొనుటే తప్పగన్.

౮

చేనిపత్తిని గిలకపట్టును సాటి
చెలులతో నూలు తీయును సం
సారమునకు దగినబట్టలు
సాలుసరి సరిపోవగన్.

౯

తనచేనిధాన్యమె పోట్టసింపగ
తనచేడె సీతమ వడుకవస్త్రము
తనకన్నతల్లిగ ఉన్నఊరిలో
తాను సుఖియించున్.

౧౦

విదేశవస్తులజోలి ఎరుగరు
స్వదేశవస్తువె కాంక్షచేతురు
మన్వంతరంబులనుండి రైతులు
మహాత్ము శిష్యులెగా.

౧౧

భాగవతరామాయణాదుల
భావబంధురఫణితితోడుత
భక్తిబోధముచేయు నొజ్జను
ప్రణుతులిడుదురుగా.

౧౨

దినము నక్షత్రమ్ము తిథులను
తెలియచెప్పుచు హితవుకోరెడి
ఆచార్యవర్యుడు బ్రాహ్మణుండని
ఆదరింతురుగా.

౧౩

కోతవేతల సమయమందున
కూలిజనముతో కూడి రాముడు
అస్పృశ్యతను పాటింపడెప్పుడు
హరిజనులు కానన్.

౧౪

హలముయోధుడు కాపుబిడ్డడు
కలము నామే కరణమంచును
కులకట్ల బేధము లే మెరుంగరు
క్రొత్తపాలెపు రయితులున్.

౧౫

అన్నయ్య వదినా బావ చెల్లీ
అనుచు తమలో తాము ఎప్పుడు
ప్రియము చిప్పిల వరుసపేర్లతో
పిలుచుకొందురుగా.

౧౬

కులవిచక్షత ధనవిచక్షత
గొడవలను పాటింపకుండగ
విశ్వమానవసోదరత్వము
విశదపరతురుగా.

౧౭

కవ్వమాడిన కదుఱుతిరిగిన
కఱవుకలవా దేశమందున
కోటివిద్యలు లోకువేగద
కోండ్రునకు ఎల్లన్.

౧౮

పాడువాఱును దేశసంపద
బీడువాఱును నాగరికమున్
మేడిచే గీలింపకున్న ని
మేమమందున నే.

౧౯

బొక్కసమ్మెగద కాపుసంఘము
పూర్ణముగ పరితుష్టినింపగ
బీదసాదల దొరలదాతల
భేరసాగమున్

౨౦

తిరునాళ్ళందున మ్రొక్కుబళ్ళను
తీర్చుకొనుటకు పుణ్యక్షేత్రము
లప్పుడప్పుడుపోవు రాముడు
హర్షమ్ము పొదలంగన్.

౨౧

ముడుపుగట్టిరి తిరుపతమ్మకు
ముందు ఏడాదికినటంచును
కులము గొట్టెను కోడిపుంజునొ
కోర్కెలూరంగన్.

౨౨

కోరిదండాల్ పెట్టు సీతను
కోటి దేవళ్ళకును ఎప్పుడు
బిడ్డగొడ్డును చల్లచూడగ
ప్రేమమీరంగన్.

౨౩

ఆదుకోవోయ్! వెంకటేశుడ
చేదుకోవోయ్ కన్నతండ్రీ
ఏడుకొండలవాడ! నీవే
ఏడుగడనుమ్మా.

౨౪

కనికరముతో కరుణచూడుము
కన్నబిడ్డలవంటి వాండ్లము
ఏలమందకోటయ్య! ఏల్నవాడా!
ఏమఱకు స్వామీ

౨౫

సిలుగులను నొందించకే ప్రభు
చింతచీకులు బాపు దేవా!
భద్రాద్రి సీతారామ! మము
భద్రములతో రక్షింపవా.

[illegible]

[illegible]

# అమ్మమ్మ

## ౧

మా ఆవిడ కొక అమ్మమ్మ వున్నది, అంటే స్వయాం తల్లి తల్లి. ఆమె ముసలితనంలో అడుగు పెట్టిందనవలసినదే. కాని పనీ పాటా చక్కగా విసుగు కోకుండా శక్తితో చేస్తుంది. పూర్వకాలపు వాళ్ళకుండే లక్షణాలామె వద్ద కనుపించవు. ఆమె నడుస్తూంటే నడ్డివంగినట్లుగా వుంటుంది. చేతులు కొంచెం పొట్టిగా వుంటవి. కొత్తగా చూచేవాళ్ళకామె ముఖం చాలా గంభీరంగా వుంటుంది. ఏ రాజ్యానికో మంత్రి అయితే ఈవిడ భూచక్రం గిరగిరా చిటికెన వ్రేలి యిరుసు మీద త్రిప్ప వేయగలదురా అని అభిప్రాయపడతారామెను ఎరిగిన వాళ్ళు. ఆమె యెప్పుడూ తెల్లని మల్లుపంచెలు కట్టుకుంటుంది. రాత్రి భోజనం చేయదు. ఆవిరిలో ఉడికించిన మినుపపిష్టం బెల్లంతో కలిపి తింటుంది ప్రతి యేకాదశీ వుపోష్యం వుంటుంది. కాఫీ మాత్రం పుచ్చుకుంటుంది.

ఆమె, తన భర్త బ్రతికియున్నంత కాలమూ, పరాపురంలో వెలిగించింది కాపురం. భర్త్రు మరణానంతరం ఆమె కొడుకులు నైజాం రాష్ట్రం పోయి అక్కడ ఉద్యోగాలు సంపాదించుకుని జీవిస్తున్నారు. వాళ్ళ దగ్గిరే వుంటూంటుంది ఈమె కూడా. కాని అప్పుడప్పుడు కోడళ్ళతో పడకనో, కొడుకులను సాధించడానికో, మరి యేమి కారణమో మనకు తెలియదు కాని—అప్పుడప్పుడు నెల్లూరులో వున్న మా మామగారింటికి వస్తూ వుంటుంది మా మామగారి భార్య, అనగా మా అత్తగారు, ఆమె కూతురేగా!

ఆమె రావడంతోనే ఇక మా అత్తగారికి వళ్ళు తెలీదు. ఆ సంతోష పారవశ్యంలో మొగుడూ మరెవ్వరూ ఆమెకు కనుపించరు ఆ ముసలమ్మ దగ్గిర ఎంత ఆకర్షణ శక్తియున్నదో నాకు తెలీదు.

వెంటనే ఆ తల్లీ, కూతురూ కలసి మా మామగారిల్లు కేంద్రస్థానంగా ఏర్పరచుకుని, చుట్టుపట్లవున్న దగ్గిర బంధువులకు—స్త్రీ బంధువులకు మాత్రమే- వుత్తరాలు వ్రాయిస్తారు: ముసలమ్మ నైజాంనుంచి చాలా కాలంగా మన దేశం వచ్చిందికనుక వెంటనే బయలుదేరి రమ్మని. ప్రథమాహ్వానం రామచంద్రాపురంలో కాపురం చేస్తున్న ముసలమ్మగారి రెండో కూతురికి. ఆవిడ ఈ ఆహ్వానపత్రం చూచుకున్న తక్షణమే ఆరు నెలల కడుపుతో వచ్చి వ్రాలుతుంది నెల్లూరులో. ఆమె బాగా పాడుతుంది అంటారు ఆమె వచ్చేటప్పుడు హార్మోనియం పెట్టె తెచ్చుట మరచిపోదు. గంపెడు సంతానం ఆమెలో గూడా వస్తుంది. ఏటా ఒక బిడ్డను కంటుంది ఆమె—ఇక రెండో ఆహ్వానం నా భార్యకని వేరుగా చెప్పనక్కరలేదు

ఈ విధంగా నలుగురూ వచ్చి చేరుతారు మా మామగారింట్లో. ఇంకేం, మా మామగారికి దశ ఎత్తుకున్నదన్న మాట. గ్రహాలన్నీ కేంద్రస్థానంలో చేరుకున్నవి.

వీళ్లంతా కలిసి ఏమిచేస్తారో చెప్పనా! గంటగంటకూ కాఫీ చేసికొని త్రాగటం, ఫలహారాలు చేసికొని తినటం, లేకపోతే వూళ్లో స్త్రీ జనాన్ని పిలచి మీటింగులు చేయటం. ఆ మీటింగులలో రామచంద్రాపురం నుంచి వచ్చిన గర్భిణి హార్మోనియం మీద పాటలు పాడి వినిపిస్తుంది; లేదా, ముసలావిడ తన వంశప్రాశస్త్యము గురించీ, తన జనకుడు పూర్వం పెద్దవుద్యోగం చేసి ఇప్పుడు నూరురూపాయల "పెన్షను" పుచ్చుకుంటున్నాడనీ, తన కొడుకులు చాలా ప్రయోజకులనీ, చిన్న వుపన్యాసాలు చెప్పి సభను రంజింపజేస్తుంది.

ఇంత హడావుడీ యింట్లో జరుగుతూంటే మా మామగారు కచేరికి పోయి కూర్చుంటాడు అక్కడ తనతోడి వుద్యోగస్థులతో బంధువుల మూలాన్న తనకు చాలా డబ్బు ఖర్చౌతున్నదని, వచ్చినవాళ్ళు తనింట్లో రెండుమూడు నెలలు తిష్ఠ వేసి పురుషా, పుణ్యాలన్నీ వెళ్ళదీసుకొనిపోతుంటారనీ, అందుమూలాన్న వచ్చే జీతం తనకు చాలటములేదనీ చెప్పుకుంటాడు. ఇంట్లో మాత్రం ఏమాట అనడు మానవుడు. అన్నాడా తన

భార్య కోపదృష్టి సహింపగలడా?

అదిగో పాఠకుడా! చిరునవ్వు నవ్వుతున్నావు? "ఏమయ్యా! మీ మామగారి గుట్టంతా చెప్తున్నావు!" అని కాబోలు అడుగదలచావు. పరవాలేదు. మా మామగారికి కోపంవస్తుందని నాకు భయంలేదు. ఆయనకు లోపల కల్మషమున్నా పైకి చిరునవ్వే నవ్వుతాడు. అంతగా మానాభిమానాలు లెక్కచేసేవాడు కూడాకాదు. ఇక మాఅత్తగారిమాట! ఆవిడకు మాత్రం కోపంఎందుకు? ఆమెభర్తను ఆజ్ఞాపించి నౌకరులా వుపయోగించుకుంటుందని ఆమె అధిక్యతనేగా వుగ్గడించాను?

కథ సాగిస్తాను. మళ్ళీ ఈమధ్య ఆముసలమ్మ నెల్లూరు విజయంచేసిందట. అప్పుడే నాభార్యకు కబురు తెలిసింది. ఆహ్వానంకూడా వచ్చినట్లేవున్నది. లీల చెప్పకపోయినా నేను ఊహిస్తున్నాను.

## ౨

సంవత్సరాదిపండుగ పదిరోజు లున్నది. ఎందుకల్లనో ఆనాడు పడకుర్చీలో నిరుత్సాహంగా పడుకున్నాను. నేనేమో ఆలోచిస్తున్నాననికూడా చెప్పలేను; మందంగావున్నది మనస్సు. అప్రక్క ఎంతసేపటినుంచీ అలావచ్చి నిల్చునివున్నదో, లీల నాకు తెలియనే తెలీదు

"ఏమండీ! ఎన్నిసార్లు పిల్చినా పలకరూ! కళ్ళుతెరచుకొనే నిద్రోతున్నారులావుంది" అని లీల కొంచెం ఎచ్చుస్వరాన అనేసరికి మళ్ళీ ప్రపంచంలోకి వచ్చా.

"ఆ! ఏమిటివిశేషాలు."

"నేను పత్రికాసంపాదకురాలను కాదు సుమండీ!"

"మరి ఇన్యూస్యేరెన్సుకంపెనీ ఏజెంటువా! వాళ్లు పట్టుకుంటే వదలని ....."

"మీ వన్నీ వేషాలు. ఇలాచూడండీ!"

"ఓహో! నీవా? ఎందుకొచ్చావు, లీలా!"

"ఏం రాకూడదా!"

"ఊరికే రావులే."

"మరెందుకొచ్చాను?"

"నాకు తెలుసు."

"తెలిస్తే చెప్పండి"

"చెప్పను."

"మీ కెప్పుడూ నవ్వులాటే-సరేకానండీ; నెల్లూరుకు వచ్చిందట మా అమ్మమ్మ."

"అలాగా! నెత్తి బొట్టవేం మరి! వచ్చిందీ పోదుగు ముసలావిడ!"

"ఆవిడ కెందుకులెండి చక్కదనం; ముసలావిడకు"

"మరి నీకు కావాలా వయసావిడకు?"

"అబ్బ! ఇలా ఎగతాళిసాగిస్తే నేను పోతానండీ"

"ఆ! పోవద్దులే; కూర్చో కుర్చీచేయిమీద — మరి రామచంద్రాపురంనుంచి వచ్చిందా మీ పిన్నికూడా?"

"వచ్చిందిట."

"ఎన్నో నెలట?"

"ఆరు."

"హార్మోనియం పెట్టెకూడా తెచ్చిందటనా?"

"మళ్లీ మొదలు పరాచకం. ఆవిడపాట మీకు బాగుండకపోతే సరిపోయింది కాబోలు."

"ఎవరన్నారూ బాగా పాడదనీ?"

"మీకు మావాళ్ళంటే అంత ఎగతాళి. అల్లుడితనం పోనిచ్చారూ! 'అల్లుని మంచితనంబును" అని సుమతీశతకంలో ."

"ఆపద్యం హార్మోనియంమీద వాయించటము నేర్చుకో మీ పిన్నిదగ్గిర."

"అబ్బ! నేను పోతానండీ, మీ హాస్యానికి మితిలేదు."

"పోతా, పోతానని బెదరిస్తావెందుకూ.? నెల్లూరు ప్రయాణానికి సెలవు అడుగకుండానే ఇక్కడనుండి పోవని నాకుతెలుసు"

లీల కొద్దిగా నవ్వుతూ నేనింకా ఏమో చెప్తాతానని ఎదురుచూస్తున్నది. నేనన్నాను. "అలా వెళ్ళటానికి వీల్లేదండి.! పోయినసంక్రాంతికి నీవు చేసినమోసం నేను మరచిపోలేదు. 'పండుగ నెలరోజులున్నదీ, మళ్లీ పోవచ్చును, వారం రోజుల్లో రమ్మ"నికదా! చెప్పి మీనాన్న వెంట పంపించాను. నామాట నిర్లక్ష్యంచేసి

అక్కడే పండుగకూడా వెళ్ళగిసికొని, నెలరోజుల వరకూ రాకపోయావు. నీ ఆమోసం నామనస్సులో వున్నంతవరకూ మళ్ళీ నీవు పుట్టింటికి పోవడానికి నా ఒప్పుదలలేదు.''

"ఆడవాళ్ళను పుట్టింటికి పంపడమంటే ఎందుకో మొగాళ్ళ కంత కష్టమనిపిస్తుంది?''

"నావిషయంలో చెప్పేనుగా కారణం.''

"మరి రాకరాక పుట్టింటికివచ్చిన ఆడపడుచులను వెంటనే పంపిస్తారా చెప్పండి!''

"నీవువస్తే వాళ్లు అడ్డగిస్తారా ఆలోచించండి''

"పోనీ, ఆ ఒక్క తప్పూ క్షమించేయకూడదూ. ఈసారి ఎక్కువరోజులుండను. ఇంకా పదిరోజులను కదా ఉగాదిపండుగ. పండుగొంటోనాడల్లా ఇక్కడ హాజరౌతాను.''

"ఇల్లా చెప్పి వెళ్లినదానవే అప్పుడుకూడా.'' అంటూ కుర్చీలోనుంచిలేచి టెన్నిసుబ్యాటు పుచ్చుకొని చెప్పులు తొడుక్కుంటున్నాను.

"అప్పుడే క్లబ్బుకు వేళ కాలేదు. కాస్త ఫలహారం చేసి వెళ్ళండి'' అన్నది లీల.

నేను మౌనంతో గడపదాటేను. "ఏంచెప్పేరు చివరకూ'' అని అడిగింది లీల గుమ్మందాకావచ్చి. నేను మాట్లాడకుండా వెళ్లిపోయాను.

మళ్ళీ సాయంత్రం చీకటిపడిన తరువాత నేను క్లబ్బునుంచి ఇంటికి చేరుకున్నాను లీల వంటపనిలో వున్నది. నేను హాల్లో దీపంముందు తీరిగ్గాకూర్చుని కూనిరాగాలు తీస్తున్నాను. ఇంతలో మా మామగారి స్థూలశరీరం గుమ్మందగ్గర ప్రత్యక్షమైంది. ఆయన మా యింటికి ఎప్పుడువచ్చినా సాయంత్రంపూటే వస్తాడు. మళ్లీ తెల్లవారగానే వెళ్ళిపోవచ్చుగదా అని.

మా ఆవిడ తెచ్చియిచ్చిననీళ్ళతో కాళ్లూచేతులూ కడిగికొని లోపలకువచ్చాడు. వచ్చి హాల్లోవున్న బల్ల మీద మేనువాల్చాడు. ఆకొసనున్న పరుపుచుట్టమీద తలవుంచి ఒత్తిగిలిపడుకున్నాడు. నల్లనిరూపం; పొట్టి శరీరం. అప్పటి ఆయన్నిచూస్తే సాక్షాత్తు శేషశాయి జ్ఞాపకంవస్తాడు. ఆయనచుట్టూ ఎవరన్నా నలుగురు కిన్నెరసానులు నాట్యంచేస్తూ, పాడుతూవుంటే బాగుండునురా! అనుకున్నాను ఆయన మంచిరసికుడు వయఃప్రాభవంలో ఆయన వారకాంతాలోలుడనివదంతి

మేము క్షేమసమాచారాలు మాట్లాడుకుంటున్నాము. ఇంతలో మావైద్యాధికారినౌకరు వచ్చాడు "అయ్యా' అయ్యగోరు రమ్మంటున్నరయ్యా! మిమ్మల్ని''అన్నాడు నన్నుచూచి.

వాడికి పుట్టెడుచెవుడు. "వస్తున్నానని చెప్పరా, పో'' అని బిగ్గరగా వాడిచెవిలో చెప్పేను "సరిలెండి! సరిలెండయ్యా!'' అని పోబోతూ వాడు మామయ్యగారినిచూచి "వారోరయ్యా' వారోరు'' అని అడిగేడు.

"ఎవరైతేనేం పోరా'' అంది లీల.

"షావుకోర్లా! షావుకోర్లా!'' అన్నాడు వాడు.

"కాదు మామగార్రా'' అన్నాను నేను వచ్చే నవ్వు ఆపుకుంటూ.

"బాకీకోసం వచ్చిర్రా! షావుకోర్లకు బాకీవుంటే కష్టం బాబయ్యా! ఇంటికొచ్చి పండుకుంటరు'' అంటూ వాడు వెళ్ళిపోయాడు. లీల విరగబడి నవ్వుతున్నది వాళ్ళనాన్న చిన్నబోతాడనన్నా అనుకోకుండా నానవ్వును బలవంతంగా అరికట్టేశాను. మా మామగారు ఇంచుమించుగా జోగికోమటిలాగే వుంటాడు చెప్పొద్దూ.

హూనూమగా రిప్పు డాబంటెమోడావిడచేత ప్రోత్సహించబడి లీలను తీసికొని పోవచ్చాడని నే నూహించలేకపోలేదు. ఆసంగతి భోజనాలైన తర్వాత చుట్టగాల్చుకుంటూ వెళ్ళబెట్టేడాయన. నేను కొంచెం ఆలోచించినట్లు నటించి, ఇంకా నాలుగైదురోజులలో మా ఆఫీసుకు సెలవులిస్తారనీ; అప్పుడు లీలా, నేనూ, బయలుదేరివస్తామనీ, నాకుకూడా ముసలమ్మను చూడాలని చాలావుందనీ ఒక చిన్న వుపన్యాసపూర్వకంగా చెప్పి ఆయనచేత "సరే'' అనుపించాను.

ఇంతలో లీల అందుకున్నది. "అన్నీ దొంగ మాటలే నాన్నా! ఇందాక నన్ను నెల్లూరు గంపనంటే పంపనన్నారు.''

"ఛీ! పెద్దమనుష్యులతో కూడా దొంగమాటలేనా!" అన్నాను.

"అయితే తప్పకుండా వస్తారా మీరుకూడా?"

"చెప్పేనుకాదూ"

"అయితే, నాన్నా! ఇద్దరమూ కలసివస్తాములే వారి ఆఫీసుకు సెలవులిచ్చాక."

"మీ అమ్మమ్మ నీకోసం ఎదురుచూస్తున్నదమ్మా!"

"ఇంతలోకే ఆమెకండ్లు కాయలుకాయవులెండి" అంటూ నేను మాపైయధికారిఇంటికి పోయాను. మర్నాడు ప్రొద్దున్నే మా మామగారు ఒక్కడే వెళ్ళిపోయాడు.

## 3

రేపే సంవత్సరాదిపండుగ. ఇన్నాళ్ళనుంచీ అమ్మమ్మకోసం కలవరిస్తూనేవున్నది శీల. నే నేవో మాటలు చెప్పి ఇంతవరకూ ప్రయాణం సాగకుండాచేశాను.

మామామగారు వచ్చిననాటిరాత్రి నాపైఅధికారి నన్ను ఊరికే పిలువలేదు. నాకొకపని నియమించాడు. ఆయన ఆజ్ఞానుసారంగా నేను సంవత్సరాదిపండుగనాడు సరిగ్గా మద్రాసులోఉండి కొన్నిపనులు చక్కబెట్టుకోవలసిఉన్నది.

రేపు పండుగ; నేను మద్రాసు వెళ్లకతప్పదు. శీల నెల్లూరుపోవాలనిపట్టుపట్టింది. సరే, ఆరాత్రి "మెయిల్" కు బయలుదేరేము. నేను రెండుటిక్కట్లు మద్రాసుకు కొని జేబులో పెట్టుకున్నాను. ఇద్దరమూ ఇంటరు క్లాసుబండిలో కూర్చున్నాము. బండి సాగింది.

తెనాలి'స్టేషన్'లో మాపెట్టెలో జనమంతా దిగిపోయారు. మేమిద్దరమే ఆపెట్టెలో మిగిలింది. ఇందాకటినుంచీ కునికిపాట్లు తీస్తున్న శీలకు ఇప్పుడు సందుదొరకగానే శుభ్రంగా ఆ "కుషన్ సీటు" మీద శరీరం వాల్చింది "మీకూ నిద్రవస్తే నన్ను లేపండిసుమా! ఇద్దరమూ కన్నుమూస్తే నెల్లూరుస్టేషన్ దాటి మద్రాసువరకూ పోగలము" అని నాకు హెచ్చరికచెప్పి తాను నిశ్చింతగా నిద్రపోయింది.

నే నేదో ఒకనవల చదువుకుంటున్నా. రైలుబండి చాలవేగంగానే పోతున్నది. కొన్ని'స్టేషన్ల'లో ఆగుతున్నది; కొన్ని'స్టేషన్ల'లో ఆగటములేదు.

ఆనవల చదివిచదివి విసుగెత్తింది. ఒక్కసారి ఒళ్ళువిరిచి, ఆవలించి, తెచ్చుకున్న 'థర్మోఫ్లాస్కు'లో కాఫీ అంతా త్రాగేశాను. అప్పుడు నాచేతిగడియారంలో 'టైము' చూస్తే రెండుగంటలైంది. ఆ అమావాస్యచీకటిలో బండికిటికీలోంచి అవతలకుచూస్తే నాకంతా నల్లగా కనపిస్తున్నది. బండిదగ్గరనుంచి భూమిమీద రెండుగజాల మేరనరకుమాత్రం లోపలవున్న దీపాలకాంతి కనుపిస్తున్నది. కొంచెము చలిగాలి వీస్తున్నది బండిలోకి. గంభీరమైన ఆనిశాసమయంలో బుసలుకొట్టుతూ పోయే త్రాచుపాములాగా రైలుబండి పరుగిడుతూంది.

నాకూ నిద్రవస్తున్నది. 'సూటుకేసు' మీద తలమోపి అలా కన్నుమూసి నిద్రపోయాను. నెల్లూరుస్టేషను దాటిపోతామేమో నన్నభయం నాకు లేదు.

ఆనిద్రలో ఒకకల. స్వప్నరంగము మద్రాసుమౌంటురోడ్డుమీద. నేనూ శీలాకలసి వెళ్ళుతూంటే ఆ ముసలమ్మ ప్రత్యక్షమైంది. ఆవిడ కెవరో మద్రాసులో 'కూము' నది చాల పుణ్యనది అనిచెపితే సంవత్సరాదినాడు అందులో స్నానంచేసి కాస్తపుణ్యం మూటగట్టుకుపోదామని వచ్చిందట. ముక్కుట్టుకుని ఆనదిలో స్నానంచేసి కొంచెంవిభూతి—ఇంటివద్దనుంచి మూటగట్టి తెచ్చుకున్నది ఫాలభాగాన ధారణచేసి మా కెదురైంది. మమ్మల్ని సమీపించి అమాంతంగా శీలనుకౌగలించుకుని ఏడ్చింది. చివరకు కన్నీళ్ళుతుడుచుకుని ఒక మిఠాయిపొట్లం తీసిఇచ్చింది. శీల దాన్నివిప్పి కొంత మిఠాయితీసి నాకీయవచ్చింది. నూనెకంపు వస్తూంటే నాకొద్దన్నాను. నేను స్వీకరింపకపోతే తన అమ్మమ్మకవమానకరంగా వుంటుందని భావించిందేమో, బలవంతంగా నానోట్లో పెట్టవచ్చింది. నే నసహ్యపడుతూ దానిచేయి త్రోసేశాను.—ఈత్రోయడంలో నాతలక్రింది పెట్టె క్రిందపడి పెద్దమోతైంది. దానితో నానిద్రభంగమైంది. శీలకూడా లేచింది రైలు పొన్నేరు స్టేషన్ లో ఆగివున్నది

ఇప్పుడు శీలకు గాభరాఎత్తుకున్నది నెల్లూరుదాటిపోయిందే అని. దానితోపాటు ఇంకోభయంకూడా

వున్నది, ఎవరైనా టిక్కెట్లు తనిఖీచేసేవాడువచ్చి డబాయించాడూ అంటే మేము తెల్లమొగము వేయ వలసి వస్తుందేమోనని. ఏమీ పాలుపోని మనస్సుతో నా ఆలోచన అనుగుణంగానే నిరుత్సాహంగా నా కేసి చూచింది. నాజేబులోవున్న టిక్కెట్లు మద్రాసు వరకూ అని ఆపిల్లకు తెలియదు.

ఎంతమోసంజేసినా మనదేశంలో పాపం స్త్రీ భర్తే దైవమనుకుని అతన్ని అనుసరించివుంటుంది. ఎంత తెలివితక్కువ పెద్దమ్మను చేసి ఆడిస్తున్నా సిగ్గుతో చిరునవ్వుచూపించి అతన్ని గౌరవిస్తుంది. అప్పటిస్థితిలో శీలను చూస్తే నాకు జాలివేసింది. అంత అమాయికత్వాన్ని మోసంచేస్తున్నానని తోచినప్పుడు నా కార్పణ్యానికి మేరలేదనితోచింది. శీలంటే నా కెందుకో ఒక విధమైనప్రేమ. ఆమెలోనుంచి ఒక ఉత్సాహశక్తి ఎప్పుడూ నాహృదయంలోకి ప్రవహిస్తూంటుంది ఆమె పలువరుస కొంచెమెత్తుగా వున్నా అది భాగ్యచిహ్నమే ననుకున్నాను. తండ్రివలె మితిమీరి కాక కొంచెము బొద్దుగావున్నా, తల్లికివలె శరీరచ్ఛాయ ఎరుపే. కన్నులుచేరడేసి లేవు గాని తేజస్సువున్నది వాటిల్లో. మొత్తముమీద కురూపికాదు: సౌందర్యరేఖలు ఆమెలో లేకపోలేదు. కాని నాప్రేమకూ, ఆమె చక్కదనానికీ సంబంధం లేదు. నే నామె నెందుకు ప్రేమిస్తున్నానో నాకే తెలీదు ప్రేమించడము నా స్వభావమే అయిపోయింది

జేసిన్ బ్రిడ్జిస్టేషన్‌లో టిక్కట్లు వసూలుచేసేవాడు రాగానే జేబులోనుంచి రెండు టిక్కట్లూ తీసి ఇచ్చేశాను వాడు వాటిని జేబులోవేసుకుని వెళ్ళిపోయాడు. అప్పటికి శీల మనస్సు కుదుటపడింది. టిక్కట్లవాణ్ణి మోసపుచ్చానుకుని నా తెలివితేట లుగ్గడించింది.

| |
|---|
| **కృష్ణాస్రవంతి చెంతలయూళ్లన్** |
| పరిమళించెడు తెల్లవిరి కొత్తిమిరి చేలయింపుఁజూచుచు సంచరింపఁగలిగె. |
| ఘృతదధిప్లుతముగా నతిరుచ్యముగ మిత్రగృహముల విందారగింపఁగలిగె, |
| తోఁకపై కెత్తి గంతులు అంకెలిడుచుండు కోడెదూడలపిండు చూడఁగలిగె, |
| సెనగకాయలు మొక్కజొనకండె లూచకంకులుగాల్చి చిఱుఁదిండ్లు సలుపఁగలిగె. |
| హృదయమిచ్చి యాదరించు గృహస్థుల నడుమఁగాఁపురం బొనర్పఁగలిగె |
| కేలుమోడ్పు నీకుఁ గృష్ణాతరంగిణీ తీరశోభితాంధ్రదేశ లక్ష్మి! |
| చక్కెర యక్కఱ లేనివి చిక్కనిపాల్ గడ్డపెరుగు జిడ్డగునేయున్ |
| మిక్కిలి చవిగల కూరలు చిక్కున్ గృష్ణాస్రవంతి చెంతలయూళ్లన్. |
| —కడుపుతీపు. |

## ౪

మద్రాసులో నాపను లేవో చూచుకుని పట్నంలో విశేషాలు కొన్ని శీలకుగూడా చూపిద్దామని సాయంత్రం వేళ 'ప్యూపిల్స్ పార్కు'కు తీసుకపోయాను. మొదలు ఒంటెల శాల చూచాము. మెడ నిక్కించి చూస్తూన్న ఒక ఒంటెను చూపించి 'అది చాలా బాగుందండీ' అన్నది శీల. "ఎరుగవా? అది మీ అమ్మమ్మే" నన్నాను. "పోదురూ. మీచమత్కారం, మీరూనూ" అన్నదామె. "చమత్కారంగానే భావిస్తున్నావా? ఆమెడచూచి పోల్చుకోవచ్చునే" అంటూ ఆమె చిరునవ్వు కొంత చూరగొన్నాను.

తరువాత ఎలుగుబంటునుచూపించి చిన్న వుపన్యాసం ఇచ్చాను. "నల్లగా, స్థూలంగా, ఒంటినిండా బొచ్చుతోవున్న ఈ జంతువునుచూస్తే నాకు మీ నాన్న జ్ఞాపకంవస్తాడు. ఆయనను లంచాలంటే ఎంత ప్రీతో ఈజంతువుకు తేనపట్టంటే అంతఆశక్తి. తేన

టీగలు కుట్టుతున్నా పట్టువదలడు'' అన్నాను. వినీ, విననట్లుగా అలాగే చూస్తున్నది లీల ఆజంతువును.

పెద్దపులిని చూచినప్పుడుమాత్రం మాఆవిడ కొద్దిగా భయపడింది. "ఇది చాలా భయంకరమైన మృగం సుమండీ!'' అన్నది.

"అవును మీ అమ్మకు మల్లేనే. భర్తమీద కోపం వచ్చినప్పుడీరూపాన్నే ధరిస్తుంది ఆమెకూడా. మీ నాన్నగారి దృష్టిలో ఏమైనా తప్పుగా నడుచుకున్నట్లైతే ఆయనమీద ఆమె ఎలా నోరు చేసికొని అరుస్తుందో అలాగే గర్జిస్తుంది ఈజంతువుకూడా.'' ఈ నామాటలకు కొంచెంగా నవ్వినా లీలచూపుల్లో కొంచెం కోపంకూడా వ్యక్తమౌతున్నది.

ఇంతలో ఎక్కడనుంచో ఒకస్వరం బయల్దేరింది. "మీపిన్నికాబోలీచాయల హార్మోనియంమీద గానం చేస్తున్నట్లున్నది లీలా!'' అన్నాను. ఆమె తలత్రిప్పి అక్కడ ఓండ్రపెట్టుతూన్న ఒకగాడిదను చూచింది.

కంగారుమృగాన్నిమాత్రం లీల చాలాసేపుచూచింది. "ఈజంతువుపేరేమంటారండీ'' అని అడిగింది. "దానిపేరు కంగారు. అది మీచెల్లెలిలాగా చాలా అందంగావుంటుంది'' అంటూ నవ్వేను.

మేము తిరిగివచ్చేటప్పుడు అక్కడ గొలుసులతో కట్టివేయబడివున్న రెండుకోతులు కిచకిచ మని అరుస్తూ మా ఆవిడ చీరకుచ్చెళ్ళు పట్టుకునిలాగినై ఆగాభరాలో ఆమె తనచేతిలో ఇంతదనుకనుంచీ ఒక్కొక్కటి తినగా మిగిలిన జీడిపప్పులు క్రిందికి జారవిడిచింది. ఆపప్పులు రెండుచేతులా ఏరుకుని తినడంమొదలెట్టినై కోతులు. "లీలా! భయపడకు. ఇల్లాంటి కోతిచేష్టలు రోజూ నీతమ్ముడు రాముడు చేస్తూనే వుంటాడు; ఇది క్రొత్తకాదుగదా'' అంటూ ఆమె భయముడిపి ఇంటికి దారితీశాను దారిలో లీల మాట్లాడలేదు. తాను చూచినదంతా మళ్లీ మనస్సులో నెమరువేసుకుంటున్నట్లున్నది. ఇదివరకెన్నడూ మద్రాసు చూచివుండనందున ఆమెకు చాలావింతగా వున్నవి కొన్నివిషయాలు. ఇంకా పట్నంలో రెండుమూడు రోజులుండాలని కోరికగా కూడా వుందామెకు.

బసకు చేరుకుని సామానంతా సర్దమనీ మెయిల్‌కు వెళ్ళిపోదామనీ లీలను తొందరచేశాను. "ఇక్కడ ఇంకా రెండురోజులుండి పోదామండీ'' అన్నది.


"ఐతే నెల్లూరులో దిగే ఆలోచన మానుకోవాలి. ఆలస్యమైతే నా ఉద్యోగం వూడిపోతుంది''

"సరే అలాగే ఏకాయికి వెళ్లిపోదాం ఇంటికి.''

"మరి మీఅమ్మమ్మను చూడక్కరలేదూ! జంతుప్రదర్శనశాల చూడగానే మీవాళ్ళందర్నీ చూచినట్లుగానే తలస్తున్నావా?''

"మా అమ్మమ్మను మనవూరు రమ్మని వ్రాద్దాము లెండి. ఆమెవచ్చి నాలుగురోజు లుండిపోతుంది'' అంటూ గదిలో "ఎలెక్ట్రిక్ స్విచ్చి'నొక్కింది ఆవిద్యుద్దీపకాంతిలో శరద్విభావరీదేవిలాగా నిల్చునివున్నది లీల. అమ్మమ్మకంటే విలువైన విషయాలు మద్రాసులోవున్నవిసుమా అనుకుంటూ నేను 'టిఫిన్ కారియర్' పుచ్చుకుని పూటకూటింటికి భోజనం తెచ్చేనిమిత్తం త్వరత్వరగా వెళ్లిపోయాను.

నాలుగోనాడు సాయంత్రం మళ్ళీ మావూరువచ్చేశాం. మా మామగారు వ్రాసినవుత్తరం ఒకటి మా యింట్లో పడివుంది. పోస్టుజవాను కిటికీలోగుండా లోపలపడేసి పోయివుంటాడు ఉత్తరమంతా మా ఆవిడే చదివింది. సంవత్సరాదిపండక్కు తనయింటికి మేమురానందుకు చాల నిష్ఠురవాక్యాలు నామీదికి విడువబడినై. చివరకు మాకోసం రెండురోజులుచూచి, చూచి ముసలమ్మ పండుగవెళ్ళిన రెండోనాడు నైజాం వెళ్ళిపోయిందని చదివింది పీడావదలింది పో అన్నాను. లీలమాత్రం అమ్మమ్మకోసం నాలుగురోజులు దిగులుపడింది.



# అశ్రుమాల

✣

౧

తీరనికోర్కె నే ననుభవింపగ లేక తపించుచుండ సం
ధ్యారుధిరాశ్రువుల్ విడచు నాకస మీమలిసంజవేళ—ఏ
మోరగిలించు నాహృదయ మూరటనెందక సంచలింప—ఏ
కారుణికాశ్రువో కనుల గట్టును సర్వము శూన్యమేయగున్

౨

తారలె ఈవిహాయసపథమ్ముల మిన్కుమటంచు నవ్వగా
నీరజనీవిలాసము సహింపఁగఁజాలక చూతు నేరహ
స్థీరములందొ నాకొరకుఁ దీరనికోరికఁ జూచుకన్నులన్
జారినరూపముల్ వెదుక, శ్యామమనోహరరూపశాలినీ!

౩

ప్రీలి కృశించు నాబ్రతుకు. రెక్కలుతాల్చి యనంతమైన దూ
రాల కగమ్యభావమధురస్మృతివీథులకున్ జరింపగా
జాలక; ఈనిశీథము మృషాపథమై కనుపట్టు నాకు, చిం
తాలసమైన నాకనులయందు గడున్ విరహాశ్రు లూరగా.

"మధు వీథి."

✣

# సింహళ ద్వీపం కైఫియ్యతు


## [మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపు రాజును జయించిన వృత్తాంతము]

ఆమరునాడు దళవాయి చిన్న కేశవప్ప నాయకుడున్ను మరికొందఱు పాళెయగాండ్లున్ను యిరవై వేలజనముతో వఖమంజీల్‌మందు పోతూవుండగా పుత్తళమునుంచి కండివారిజనం బహుజనంవచ్చి యెదురునిలిచి యుద్ధమ య్యేటప్పటికి కండిశీమజనం యెన్నడున్ను యుద్ధంచే యనివారు గనుక అడివిగుంపుగనక యీపాళెయగాం డ్లున్ను నగరిజనమున్ను మోజొచ్చి పొడిచినందున కండి జనానీ కొంతజనం గాయాలలోనున్ను కొంత మృతి బొందింది ఆసేనానాయకుడున్ను తోడవిరిగిబడెను. అంతట ఆజనం కొంత ఆయుధాలు ఫిరంగులు విడిచి పెట్టి పలాయనమై పారిపోయినారు అదే దవుడుగా వచ్చి ఆకోట తీసుకొని తనరాజు పాళెంవచ్చి జేరేవర కున్ను చిన్నకేశవప్పనాయడు అచ్చటనేయుండి ఆపా ళెంవచ్చినపిమ్మట ఆ పాళేనకిన్ని యేలినవారినిన్ని అచ్చ టనేనిలిపి తాను వొఖమజిలీముందుగా పొయ్యేటప్పటికి శింహళపురాజు మంత్రులు నలుగురున్ను యెనిమిది దెస లున్ను నలభైవేలజనముతో డట్టు అడ్డంతాకి బహుజగ డం చేసేటప్పటికి యిచ్చటనున్ను అచ్చటనున్ను బహు ఛేదముపై ఫిరంగీశబ్దములున్ను తుపాకిశబ్దములున్ను రాజా పెదకృష్ణప్పనాయడువారు బహుశా వినిన్ని అంచలమీద క్షణేక్షణే కబుర్లువచ్చేది వినిన్ని సకలదళ సమేతముతోను హవుదాయెక్కి తమదండలో పోయి చేరి పాళెకాండ్లును యిరుపార్శ్వాలా రెండుచేతులు గానున్న మధ్యదళవాయి చిన్నకేశవప్పనాయడు మొదలయిన దొరలనున్ను సాగించి తామున్ను హవుదా యేనుగను నడిపించుకొని బహుయుద్ధం చేస్తున్నవారి దండులోచొచ్చి చెయికలిశి యుద్ధంచేశినందున వారి మంత్రులు యిద్దరున్ను ముగ్గురు దేశనాయకులున్ను గాయాలతోపడిరి మరిన్ని అనేకదళం కొట్టుపడిపో యిరి. బాకీ మంత్రులు యిద్దరినిన్ని దేశనాయకులు అయిదుగురున్ను చెయిపట్టుగా తగిలిరి. అంతట జయ భేరివేయించి ఆగాయకాండ్లను యెత్తుకరమ్మని అచ్చట వఖ మయిదానం జలసౌఖ్యంచూచి డేరాలువేయించి అచ్చట దిగి ఖండిమంత్రులుకున్ను దిశానాదులుకున్ను గాయాలతోపడిన మంత్రులు యిద్దరు దిశలు ముగ్గురి కిన్ని వేరవేరే గుడారాలుయిప్పించి గాయాలుకట్టించి గాయాలులేని దిశలుకున్ను మంత్రులుకున్ను కావలసిన సామగ్రీలుయిప్పించి వారికి పరిచారకుల నేమించి బహుమర్యాదగా నడిపించినందున వారికి యీరాజు మహాధర్మిష్టుడు యితనికి శత్రువుపై యెదిరించి జగ డంచేసి వారి జనానసరుదారులున్ను అనేకజనాన్ని మనం ఛేదపరిచివుండిన్ని మనమొన యెత్తుపడి వారిలో మనం తగిలినందును మనల యేమిన్నీశాయక యింత మర్యాదగావుంచి రక్షించినందుకు మనం వీరికి ద్రోహం శాయక వారి చిత్తానువృత్తిగా నడుచుకోవలెననిన్ని యీరాజు శీమలో వొఖపాళియగాడు దుష్టకృత్య ములు చేస్తూవుంటే వానితో మనరాజు స్నేహంచేశి నది అనుచితం. అదిగాక వారిశీమలోవుండి శీమంతా నిపాతంచేస్తూవుండగా వాణ్ని శిక్షించవలశినది వారికి విహితమైవున్నది గనుక అందుకు మనరాజు ఆరాజును సభలో గర్వించి వ్యత్యాసమయిన మాటలాడినందుచేత మనకున్ను మనశింగళప్రజకున్ను మనదేశానికిన్ని యింత విపత్తువచ్చెను గనుక మనరాజుకున్ను వీరికిన్ని సఖ్యం చేశి వీరి మనోభీష్టప్రకారం నడుచుకోకుంటే యింకా వుండే శింగళప్రజ చచ్చి పలాయనమయి అందరు ముని గిపొయ్యేకాలం వచ్చిందిగాని మన శింగళప్రజ వీరితో సమానంగానిలిచి యుద్ధం శాయచాలరని వారందఱు యోచించుకుని యేలినస్వామివారి సముఖానకువచ్చి కొన్నిసంగతులు మనవిచేసుకోవలెనని దళవాయి చిన కేశవప్పనాయనికి చెప్పి అంపించిరి.

ఆ వర్తమానం అతడు అక్షణమే రాజువద్ద యెరుక చేసి ఆక్షణమే గాయాలులేని యిద్దరుమంత్రులున్ను

# ఉండవల్లిగుహాలు

మహాపంతస్తులుగా నిర్మింపఁబడి జీర్ణదశలోనున్న ఉండవల్లిగుహాలు పురాతనాంధ్రుల శిల్పకళాచాతురికి చక్కని నిదర్శనములు. అన్నిట గోడలపైనను, స్తంభములమీఁదను సర్పరసములు చిన్నవైన అనేక చిత్రములు రచింపఁబడియున్నవి. ఒకమూల అనంతశయనుని విగ్రహము ప్రాచీనవిధానకముగ శిథిలమై పడియున్నది. రెడ్డిరాజులకాలమున ఈ గుహాలయము గొప్పవైభవ మనుభవించినట్లు తోచుచున్నది. ఒకప్పుడు కాటమరెడ్డియు, 14-వ శతాబ్దమున శ్రీకృష్ణదేవరాయలును ఈస్వామిని సందర్శించి కొన్ని మాన్యములు సమర్పించుకొన్నట్లు నార్తు ఆర్కాటు జిల్లాలోని రికార్డులవల్లను, లభించిన శాసనములవలనను తెలియుచున్నది. కాని ఆనాటి వైభవచిహ్న మొక్కటియును నేఁడు కనిపించుటలేదు. వేద నుండి అర్చకుల స్తోత్రమయముగనుండిన ఈ ఆలయములో నేఁడు అప్పుడప్పుడు ఒక్కొక్క పరిశోధకుని పదన్యాసములు మాత్రమే ధ్వనించుచున్నది. పండుముప్రత్తితోఁ జేయఁబడిన వత్తులు వెలిగింపఁబడి శోభాయమానముగ నుండిన ఈ క్షేత్రమునకు నేఁడు గోడలమీఁది వర్ణపు నీటిచారలే అలంకారములైనవి. పూర్వము కమ్మని కర్పూరపు వాసనలు చిమ్మిన ప్రదేశమున ఇప్పుడు గబ్బిలపుకంపు. దేవరవములు మిన్నంటినచోట కీచురాళ్లకంచుమ్రోత చెలరేఁగుచున్నది.



ఈజీర్ణగుహాలయమును మరల పునరుద్ధరించుటకుఁ బ్రయత్నించినవారిలో బెజవాడ వాస్తవ్యులు గొల్లపూడి రామచంద్రరావు గారు మాత్రమే స్మరణీయులు. వ్యయప్రయాసలకోర్చి, కొందరు ప్రభుత్వోద్యోగులవలని యవమానము నైన సహించి, వారీ క్షేత్రమును మనస్థానములోనికి తీసికొనిరాఁగలిగినారు. ఆ తరువాత అకస్మికముగ వారి శరీరము వ్యాధిగ్రస్తమై నాలుగు మాసముల క్రిందట వారు పరమపదించిరి. వారియొక్క మరణానంతరము కథయు నక్కడనంతమైనది. ఆలయపునరుద్ధరణ కేర్పడిన "ఉండవల్లిగుహాలయకమిటీ" తనకర్తవ్యము మఱచి నిద్రించుచున్నది. 'కమిటీ' సభ్యులకిదే మేలుకొలుపు. మరల వారు జాగరితస్థితిలోనికివచ్చి నడుముకట్టుకొని పనిచేసి భక్తులను రామచంద్రరావుగారి యుద్యమము కొనసాగించి వారి పవిత్రాత్మకు శాంతి నెలకొల్పుదురు గాక! అందులకు ప్రతియాంధ్రుఁడును తనశక్తికొలఁదిగ సాయముచేయఁ గలఁడని నమ్మకము.

—పురాణం కుమారరాఘవశాస్త్రి.



కృష్ణకాలువపై వంతెన, నీటికళంము.

అయిదుగురు దేశలున్ను సముఖానకు రప్పించగానే వచ్చి పాదాక్రాంతులై నిలిచి స్వామీ మారాజుఖుందున్న మాయందు నేరమెగాని స్వామివారియందు లేశమాత్రమయినా తప్పితంలేదు గన్క మాయందు కృపజేసి యుద్ధరంగాన మావారు అనేకులు చచ్చిన్ని గాయలతో పడివున్నారు. తమ గాయకాండ్లను అంతాయెత్తుకవచ్చి గాయాలుకట్టుతున్నారు, చచ్చినవారి నంతా యెత్తి దహనంచేస్తున్నారు గనుక ఆమేరకు మావారికిన్ని కబులిచ్చి యెత్తుకపొమ్మని ఆజ్ఞాపించవలెనని తిరుగా కాళ్లోపడి అడిగినప్రకారం దళవాయి చిన్నకేశవనాయునికి వుత్తరవిచ్చినారు. అందున సరుదారులుగా గాయాలుకట్టితే బ్రతుకుననియున్నవారినంతా వీరి మనుష్యులవిడిచి యెత్తించి డోలీలోవుంచి పుత్తళంకోటచేర్చి భద్రముగా వారికి కావలశిన సామగ్రీలు యిప్పించి తగిన మనుష్యుల వారిదగ్గిర నేమించి గాయాలు వాశికాయమని అదేప్రకారం తమ దళములో పడ్డ గాయకాండ్లనంతా డోలీలో యెత్తించి పుత్తళానికి అంపించి గాయాలుకట్టమని పుత్తళానవార్ని వుంచివచ్చిన రామభద్రనాయనికిన్ని, పేష్కారు వీరభద్రయకు తాకీదులువ్రాశి అంపించినారు. గాయాలవారిని చచ్చినవారిని యెత్తుకపొమ్మని వీరకవులు కాకితమున్ను సింగళపుమంత్రుల కాకితమున్నువ్రాశి హరకారులచేతయిచ్చి అచ్చటికి ఆమడ పొడవున దిగివున్న కండిరాజుపాళెమున్ను యీయుద్ధాన హతశేషులున్నవోయి దిగియున్నతావున వారి ముఖ్యప్రధానివద్ద యీకవులుకాకితము లిచ్చి వారిరాజుకు యెరుకచేసి అక్కడినుంచి డోలీలున్ను కొంతజనాన్నిన్ని అంపించి గాయకాండ్లనున్ను మృతినొందిన జనాన్నిన్ని యెత్తించుకపోయినారు.

నాటియుద్ధాన కండివారి జనానముపై సరుదారీలున్ను రెండువేలజనమున్ను చావు, గాయాలు వెయ్యిన్నైనమన్నూటికి గాయకాండ్లున్ను మధుగవారి జనాన వేయిజనమున్ను పడ్డెనిమిది సరుదారులున్ను పాళెపట్టుదొరకొడుకు యెనిమిది మనిషిచావున్ను నూటయాభైయారు జనమున్ను పదమూడు సరుదారులున్ను ఆరుపాళెపట్టుదొర కొడుకులకు గాయాలున్ను అయినందు చాత నాటిదినం మృతిబొందిన వారినంత దహనం శాయమని గాయకాండ్లనంత యెత్తుకబోయి గాయాలుకట్టించమని పుత్తళానికి పంపించి నాటిదినం పాళెం ముఖామిచేసి ఆ మరునాడు యుపయాస్నై రణభేరివేయించి కండిరాజు దిగివుండె పాళెంమీదికి బోవలెనని తయారు అయిన వర్తమానం ఆమంత్రులు విని తమ సముఖానకువొచ్చి వొఖమనవి జేసుకోవలెనని చెప్పిపంపించిన ప్రకారంరమ్మని వుత్తరవై ఆమంత్రులు యిద్దరున్ను దేశీలు అయిదుగురున్ను సాష్టాంగ నమస్కారంచేసి స్వామీ వొఖమనవి చిత్తగించవలెను అనగా మంచిది అట్లానే కానీ అని వుత్తరవియ్యగానే స్వామీ రామారాజును మీభేటికి రప్పిస్తున్నారం మీరు ఆజ్ఞాపించినప్రకారంయిచ్చి నడుచుకొనుచున్నారం మూడుదినాలుకుమాత్రం యీపాళెమున్ను మీరున్ను యిచ్చటనే వుండేటట్టుగా దయచేసినట్టైతే మాఏడుగురిలో వొఖరికిన్ని మీ హరకారుల్లో యిద్దరికిన్ని వుత్తరవిస్తే మేమున్నూ కాకితములువ్రాసి మారాజుకున్ను అచ్చటవుండె మాపెద్దమంత్రి కిన్ని కాకితాలువ్రాసి అన్ని వయినములు మాట్లాడుకరమ్మంటున్నారం అన్నందుకు అదేప్రకారం అంపించండి అయితే మీ రాజు మీరు వ్రాశినప్రకారం చూచి నడిపించకుంటే మిమ్ముల యేమిచేశేదని అడిగిరి. అందుకు వారుజెప్పింది మామాట వినకుంటే మేమున్నూ మాతోశేరిన సింగళమున్ను మీతోశేరిపోతున్నారం మాకు మీరేరాజు కాని అతడు రాజుకాదని తోశివేస్తున్నారం మీరుజూచి యిచ్చటనే వుండమనిజెప్పితే యిచ్చటనే వుంటున్నారం లేక మీవెంబడికూడా గమ్మన్నట్టైతే వస్తున్నారమని చెప్పగానే అయితే మీమాట మేమెట్ల నిజమని యెంచేది అని రాజు అడగగానే ఆమంత్రులు ఆదేశలు తమ బుద్ధస్వామిమీద ఆనబెట్టియిచ్చిరి.

ఆమీద రాజు చాలా సంతోషపడి వారికి వస్త్రభూషణాలుయిచ్చి పారాగద్దనిఅందరికి పాలకీలుయిచ్చి యెక్కరమ్మని శెలవుల్కు వారికి కావలశినంత యిమ్మని వొకమంత్రిని వొకదేశనుకూడా వారిరాజు

వద్దికి బొమ్మనుమని వుత్తరవిచ్చి యిద్దరికిరెండుగుఱ్ఱాలు సవారీకియిచ్చి పంపెంచిరి. వారిరాజువున్న పాళ్యానకుపోయి పెద్దప్రధానిని కని అతనితో అన్నిసమాచారములు కలశి మాట్లాడుకుని ఆపెద్దమంత్రినికూడా పిలుచుకొని వీరుయిద్దరుకూడాపోయి రాజువద్ద యీ సంగతులన్నియు తెలియజెప్పినందున రాజువిని అర్థాంగీకారముగా వీరికి ప్రత్యుత్తరము చెప్పకుండా వున్నందున వీరికి మనస్సున వెగటై రాజునుజూచి మేము మీ క్షేమంకోరివుండ తగ్గవారం గనుక వారియుద్ధమున్ను జూచి వెనకవచ్చిన దండున్ను ఆ పాళెగాండ్లున్ను అందున వచ్చే సరదారులనున్ను ఆజనంయొక్క మొన జూచి మన సింగళప్రజ వారిముందునిలువనేరదు. అందువల్ల మన రాజ్యానికె మోసంవచ్చును. యీప్రకారం మాట్లాడుకవచ్చినారం. యీప్రకారం నడుచుకుంటే అందరికి క్షేమంకలుగును. అనగానే రాజు కోపంజేసి వారిమాటలువిని నీవుకూడా యెట్లా జెప్పుతున్నావు అని పెద్దమంత్రిని కోపించుకుని నేను కిరీటసింహాసనాధిపతిని. నేను ఒహారిదగ్గిరికివచ్చి బేటీతీసుకుని వారుచెప్పిన ప్రకారం వినేదా రేపుతాళి యెల్లుండివస్తున్నాను వారి భేటీకి మీరేపోయి చెప్పండా అహంకారముగా చెప్పినందుచేత మంత్రులు మగ్గరున్ను రాజుకుఱ్ఱమొక్కబైటికివచ్చి పెద్దమంత్రితో ఆలోచనచేసినందున పెద్దమంత్రి చెప్పినవయినం యీరాజును కాలసామాన్యంచాత యీ దుర్బుద్ధితోచినది కాబట్టి మీరు సత్యంజేసి యిచ్చినవారుగదా! మీరు వారిదగ్గిరికి పోయి జేరండి. నేను రాజునువిడిచివచ్చేది ధర్మంకాదుగదా. కడాపట మీరు చెప్పినప్రకారం నడిచిపోను అని మీరుపొండు అని వీరున్ను యీయిద్దరు హగకారులును పిలుచుకొని పాళ్యానకువచ్చి మంత్రి దేళలతో కలిసిమాట్లాడుకొని వారందఱు యీరాజువద్దకివచ్చి తాము పోయి వచ్చిన సమాచారమంతా పలకరించి స్వామీ నేటిసుతా తమవారగను యీశిమలో సగంజనం మాతో చేరినజనం వున్నది. స్వామి ఆజ్ఞాపించినప్రకారం నడుచుకొంచున్నాము అని మంత్రులు మనవిచేసుకున్నందుకు రాజు నవ్వి మీరు వూరికివున్నండి రేపటిదినం మీరాజు మా భేటికి వస్తున్నామన్నాము గదా వచ్చినపిమ్మట జయాపజయములు జూచి ఆపిమ్మట మాట్లాడుకోవచ్చును గాని అదివరకు మీరు మాదండువెనక నిలిచివున్నండి అనేదిగా వారినిపంపించి మంగపతినాయిణ్ని పిలిచి దండు తయారుకాయమని అందున పదివేలజనం మంచి జనంగా యేర్పరచి పదిఫిరంగులు తీసుకొని యింకా నాలుగు ఘడియలదూరంపోయి యుండుమని అక్కడ మోర్జాలంపించి అందుమీద ఫిరంగులుంచి జనాన్ని వ్రంచవలశిన తావులో భద్రముగావుండి రేపు వారువస్తే యివతలికి విడవకుండా అని పోట్లాడుమని అంపించిన ప్రకారం మంగపతినాయుడుపోయి మోర్జాలువేశి ఆ పైని ఫిరంగుల లెక్కించి జనాన్ని భద్రముగావుండమని తయారుచేసెను.

రేపు ఖండిరాజు సైన్యంవస్తే విడువక అని పోట్లాడుమని యేలినస్వామివారు ఆజ్ఞాపించివున్నారు గనక మీరందరు అదేప్రకారం వుండమని జనానికి అంతవరి జెప్పి అచ్చట డేరాలువేయించి దిగివుండగా మరునాడు వుదయాననే ఖండిరాజు తమసైన్యాన్నితయారుజేసి రణభేరివేయించి సింగళం అరవై వేల జనమున్ను కాఫీరీలెల్లా పదివేలజనమున్నూ ఆరాజుకేవిడీగాకిటు హాజరుగ వుండేది ఫిరంగితోపుఖానావారిపార్శ్వం వుండేది వారితో కూడా హవుదాయెక్కి ముందుగా వారున్ను తోపుఖానావున్నూ వారికివెనుక ఖండిశీమలోను రావన్నిపన్నియడు మొనలైన పాళెగాండ్లున్ను వారికివెనక పెద్దమంత్రిన్ని శింగళపుసరదారులున్ను వారికివెనుక రాజుహావుదాన్ను రాజబంధువులున్ను తక్కిన సైన్యమున్ను యుద్ధసన్నద్ధులైనడిచి మంగపతినాయిడి మోర్జాలమీద అఘాడివచ్చిన కాఫరిజనం యెదురుతాకి ఫిరంగిజగడ మయ్యేటప్పుడు వారివెనుకవచ్చిన శింగళపుజనమున్ను పాళ్యగాండ్లవారి జనమున్ను పెద్దమంత్రివెంబడి జనమున్ను యిరువంకల మంగపతినాయిడి పాళ్యాన్ని చుట్టుకొని బహుయుద్ధమయ్యేటప్పుడు మంగపతినాయుడు అయిదువేల జనాన్ని తీసుకొని ముందెక్కి కాపరిజనంమీద తాకి మోచొచ్చి పొడిచేటప్పటికి యెదిరి బహుదళం గనక రాజు హవుదాయెక్కి యేనుగేను మందునడిపించి

చెయిచూపి జనాన్ని పురికొలిపి మంగపతినాయుడిని చుట్టుకొని బహుయుద్ధ మయ్యేటప్పటికి మంగపతినాయుడు నానాయుద్ధములు జేసి తీరినబంటు గనక తాను పట్టె ఖడ్గంతీసుకొని మూడువేలజనాన్ని, రెండుచేతులు గాపంచి శింగళవాళ్ళగాండ్లమీదవొకచెయ్యిన్ని, మంత్రి పార్శ్వం వొకచెయ్యిన్ని తనతో రెండువేలజనం తీసుకొని తోపుఖానామీద తాకి యుద్ధమయ్యేటప్పటికి కాఫిరిజనం మొనకలిగినజనం గనక ఫిరంగులచాతనున్ను, తుపాకులచేతనున్ను, ఆనికొట్టేటప్పటికి మంగపతినాయుడిజనాన వెయిజనం రాలైనదిజూచి వెయిజనంతీసుకుని మంగపతినాయడు మొచొచ్చిపోతుండగా యెదటివారిది బహుఎశిం గనక రెండుచేతులుగాపంచినజనాన్ని రెండువేలజనం గాయాలతోను మృతిబొంది పడ్డందుచేత కడమ వెయిజనం విరిగిమోర్చావచ్చిచేరి ఆజనంతో జేరుకొని ఆని పోట్లాడేటప్పటికి సింగళపుజనమున్ను, వారి పాళెపట్టుజనమున్ను తాకి మోర్చాలుచుట్టుకొని రెండుమోర్చాలు తీసుకొని కడమ మూడుమోర్చాల్లో జగడమయ్యేటప్పటికి మొచొచ్చి యుద్ధంచేశే మంగపతినాయుడుతిరిగిజూచి రెండుమోర్చాలుతీసుకొన్నారు.

కడమ మూడు మోర్చాలు యెత్తుబడేట్లువున్నదని మోర్చాలపార్శ్వం తిరిగి వస్తూవుండగా కాఫీరీజనమున్ను, రాజు హావుదాజుట్టుకవచ్చే జనమున్ను మంగపతినాయుడిమీదికి తాకి మోర్చాలకు పోనియ్యక నఖముఖాలాచుట్టుకొని తుపాకులచేతనున్ను, ఫిరంగీలచేతనున్ను ప్రయోగంచేశేటప్పటికి మంగపతినాయుడి జనములో యేనూరుజనంనరకు ఛేదమై కడమ యేనూరు జనముతో వొకపార్శ్వంచొచ్చి బల్యాలచేత పొడుచుకొని పొయ్యేటప్పుడు సెఖరావన్నియడు యితణ్ని పోనియ్యకుండా యెదురుగవచ్చి అడ్డంతాకి—వచ్చిరన్నియడి జనానికిన్ని, మంగపతినాయుడి జనానికిన్ని, చెయికలిశి వొడిపట్లు శిగపట్లుగా జగడంచేశిరి. ఆ సమయాన మంగపతినాయుడికిన్ని నొఖరావన్నియడికిన్ని రూపురూపున చెయికలశినప్పుడు అతనిచెయి నరుకు యితనిమీదనున్ను యితనిచెయినరుకు అతనిమీదనున్ను తాకినందున మంగపతినాయుడు లెస్సగా సాముచేశినవారు గనక రెండోనరుకు యెడపి వాడు నరికేటంతలో యీయన సమాళించి ఆనరకు తప్పించి పట్టాతీసి నరికేటప్పటికి వన్నియడికి వఖభుజం తెగి మరణమూర్చతో కిందపడెను.

అప్పుడావన్నియడిజనం సరుదారుపడగానే ఆజనం విరిగిపోతూ వుండేటప్పటికి మంగపతినాయడు ఆ గాయాన్ని సద్దజేయక ఆదివరలో మిగిలినజనాన్ని శేఖరంచేసుకొని అడ్డంతాకిన వారిని గదిమికొట్టుకొని పోతూవుండగా వెఖ శింగళపువాడు తుపాకీనివెయ్యగా ఆగుండుతాకి వొరిగి పడపొయ్యేసమయాన వారిజనం మొనగాండ్లు అతణ్ని సమాళించి తీసుకొని మోర్చాల సమీపానికి పొయ్యేటప్పటికి ఆ మోర్చాలలోవున్న వీర జనం యెదురుకొనివచ్చి వీరిని చుట్టుకొని వెంబడించి వచ్చిన శింగళపుజనాన్ని చొచ్చి కొట్టి మంగపతినాయడిన్ని కూడావచ్చిన మిగతజనాన్నిన్ని మోర్చాలో పోయి చేరినారు. అదివరలో మంగపతినాయడిజనాన చావు గాయం యీవగన అయిదువేలజనం ఛేదం. సరుదారులు మొనగాండ్లులో ముప్పైరెండుమంది ఛేదం. ఖండిరాజుజనాన మూడువేలకు మృతమున్ను వెయ్యింటికి గాయమున్ను యిరువైయేడు సరుదారులు చావున్ను పదియేను సరదారులు గాయమున్ను అయి అప్పటికి ఆరాజు బహుకోపముతోకూడా తన దళాన్ని పురికొలిపి బాకివున్న మూడు మోర్చాలమీద నఖముఖాలలో చుట్టుకొని ఫిరంగిజగడం అయ్యేటప్పటికి మరివఖమోర్చాలోవున్నజనాన్ని హతపరచి మోర్చాలను తీసుకుని కడమ రెండుమోర్చాలమీద నెగ్గి జగడంకాయగా యీయుద్ధసంగరం ఫిరంగివేట్లున్ను చావు చంపులున్ను యిది యీవత్తున్ను పెద్దదండులో వినపడి రాజా పెదకృష్ణప్పనాయనిగారు బహుకోపంజేసి దండు యీవత్తున్ను ప్రయాణభేరి వేయమని కూచిచేశి డెబ్భైరెండు పాళయగాండ్లు సమేతంగా ఏకముఖముగా దండు యీవత్తున్ను బయలుదేరి తమ దండువచ్చిచేరి మోర్చాలు రెండులోనున్ను, అనుకొని ఖండివారు తీశిన మోర్చా మూడున్ను కొట్టి లగ్గయెక్కి తీసుకొని మంగపతినాయడివారు చేసిన సాహసములు విని చాలా సంతోష

పడి మంగపతినాయిణ్ని పుత్తళానికి యెత్తిపంపించి యిచ్చట దండు తాను మూడుచేతులుగాపంచి దళవాయి పినకేశవప్పనాయుడువారు తమదండట్టు యావత్తున్ను వఖచెయ్యిన్ని డెభై రెండు పాళెయగాండ్లున్ను వారిదండు యావత్తున్ను రెండుచేతులు గానున్ను యీ ప్రకారం మూడుచేతులుగా దండుయెంచి గుమునుచేసి తాము న్ను అంబారియెక్కి దండుసాగించిరి.

కండివారున్ను దండుయావత్తున్నూమూడుచేతులుగా పంచి నెగ్గి ఫిరంగులుయెత్తికట్టి వీరున్ను వారున్ను ఫిరంగులచేత జగడంచేయగా ఖండివారికి ఫిరంగులు నిండా గనక వీరికిమట్టు గనుక వారి ఫిరంగిగుండ్లచాత వీరికి శానాఛేదం వచ్చినందువల్ల రాజా పెదకృష్ణప్పనాయడువారి దళవాయి చినకేశవప్పనాయిడి వారినిన్ని కార్యస్థులనున్ను పాళయకాండ్లనున్ను చూచి కోపం చేసుకొని యుద్ధరంగమందు బొభ్యంచేశి మనుష్యుల చావనిచ్చేది విహితముకాదని కోపంచేశి అంబారిముందర నడిపించగా చినకేశప్పనాయిడివారున్ను పాళయకాండ్లున్ను ఏకముఖముగా వీరావేశులై ఫిరంగిగుండ్లు తాకి జనంఛేదం అవుతున్నుండగానే గుండ్లలోచొచ్చి ఫిరంగులమీదవున్న జనాన్నికొట్టి వకావకలుచేయించి ఫిరంగులు చెయివశంజేశుకొని దండులోచొచ్చి వీరికిన్ని వారికిన్ని సంకుల సమరమయ్యేటప్పటికి నాలుగుమంత్రులున్ను అయిదుగురు శానానాధులున్ను వీరిదగ్గిర ముందరవచ్చి సత్యప్రమాణములు చేశియిచ్చి వీరుపంపించి తమ రాజుదగ్గిరికిపోయి పెద్దమంత్రితోకూడి ఖండిరాజుకు అనేకవిధముగా చెప్పిన్ని వినకనే నిరాకరించి వండెత్తిరి. గనక మంత్రిన్ని రాజుచేశేపని సమ్మతిలేదు గనక నలుగురుమంత్రులతో చేరినదండున్ను దళానాధులతో చేరినదండున్ను మరిన్ని అనేకదండు వారివారిపాటున తొలగి పలాయనముగా పారిపోయిరి గనక ఖండిరాజున్ను కాపురియులు చచ్చిపోయినారు పోగా నిలచిన యెనిమిదివేలున్ను శింగళపువాళ్ళలో పదివేలున్ను పాళయకాండ్లలో పదివేలున్ను అంత యిరవైయెనిమిదివేల జనమున్ను నిలిచిరి.

పెదమంత్రిన్ని రాజు యెంత దుష్టుడుగావున్నప్పటికిన్ని విడిచిపోరాదని నిలచెను. వారిక్కి వానబల మాయగనక వీరు నెగ్గిచుట్టుకొని యుండగా పెద్దమంత్రి ఆలోచించి రాజుకు యిప్పడయినా బుద్ధివచ్చియుండీనియని రాజువద్దికిపోయి అనేకవిధములుగా యెదిరియొక్క క్షాత్రమున్ను బలాబలమున్ను తమయొక్క బలహీనమున్ను శింగళపునంగు మంత్రులతో దళానాధులతో చేరి తొలంగిపోయిన వివరమున్ను తెలియచెప్పినందున ఆరాజువినక నేను శింగళద్వీపమునకు రాజును కిరీటాధిపతిని నేను యింకొకరాజుకు లొంగి పేష్కష్ యిచ్చివుండేటివాణ్ని గనుక మీరు అందరున్ను వారితో కూడుకొని మామీదికివచ్చినా నేనొకడైనిలచి ప్రాణత్యాగమైన చేశేదేగాని వొకరికిలొంగి మాట యిచ్చేదిలేదు యని రాజుచెప్పినందున మంత్రిఅయితే మీమనస్సుకు సరిపోయినట్టని పెద్దమంత్రి చింతాక్రాంతుడై మనం యీదేశానికి పారంపర్యముగా సర్వాధికారంచేశి పేరైనవారం గనక మనమున్ను రాజునువిడిచిపోతే బహుకాలానికి అపకీర్తివచ్చునని వుండె దళాన్ని శేఖరించుకొని యుద్ధానికినిలిచినందున మధురవారి దళవాయిన్ని వారి సయిన్యమున్ను పాళ్యగారులున్ను నెగ్గిన నఖుముఖాల్లో లోచొచ్చి తుపాకులచేతనున్ను కత్తులు బాణాల చేతనున్ను నుగ్గుచేస్తూ మహాయుద్ధమయినందున యెదటిదళాన అనేక సరదారులుచచ్చిన్ని గాయాలతోనున్నుపడి వారిదళమందున్ను బహుఛేదమయినందున నిరువాహకం చాయలేక వారి పాళయపట్టిజనమున్ను విరిగి పలాయనమై పొయ్యేటప్పటికి పెద్దమంతిరిన్ని అతనికి కేవలం విహితమయిన శింగళం వారిలో రెండువేలజనమున్ను కాఫిరీవారిలో నాటియుస్థాన సైన్యం రెండువేలజనంపోగా కడమ నిలచిన యెనిమిదివేల జనమున్ను ఆరాజుబంధువులలో యిరవై సరదారులున్ను రెండువేల జనమున్ను హావుదాచుట్టుకొని నిలచిరి.

—సశేషము.

# కృష్ణాప్రవంతి

## కృష్ణానదీమాహాత్మ్యము.

గీ. కలియుగమునందు శ్రీజహ్నుకన్యకాది
సకలపుణ్యమహానదీసంఘమందుఁ
దా వినుతిఁ గాంచెఁ గృష్ణాభిధానతటిని
యధికపుణ్యఫలప్రదం బౌటఁ జేసి.

సీ. ఈ కృష్ణవేణ్యాఖ్య నేపారు నిమ్నగ
శ్రీకృష్ణభవయై ప్రసిద్ధిగనుట
స్వర్గలోకమునుంచి వసుధకుఁ గృష్ణుచే
నానీతయై మహాఖ్యాతిగనుట
నీద్వీపవతి కమలేశుచే విధి కాత్మ
వలననీఁడి పుత్రివరుసఁగనుట
కల్మాదినిఖిలలోకభయంకరమహాఘ
భేదనంబైనట్టి బిరుదుగనుట

గీ. నదులకెల్లను మొదటిజన్మంబుగనుట
మానితంబైనయట్టి సన్మహిమగనుట
సకలపాతకవిసరకర్షణముగనుట
వలనఁ గృష్ణాఖ్య నీనది వన్నెకెక్కె.

ఉ. శ్రీకరసహ్యజాస్మరణచే నుతిచేతను
స్పర్శనంబుచేఁ
బ్రాకట తన్నదీసలిలపానము చేతను
మజ్జనంబుచే
లోకులు నైజపాతకవిలోపముఁ జెంది
మనోజ్ఞసద్గతిన్
జేకొని దైవసంఘములచే నుతిఁ
జెందుదు రబ్జసంభవా!

మ. ఒకసారవ్వనిపాదపంకరుహసంయో
గంబుచే సత్కృపో
త్తుకరఖ్యాతిని గాంచె జహ్నవి త్రిలో
కంబందు నత్యంత మా
సకలేశాచ్యుతమూర్తియైపరఁగు కృ
ష్ణాసింధు వెంచన్ సుమా
రక విశ్వస్తుతి గాంచదెట్టులు సమగ్ర
ప్రాభవోజ్జృంభతన్.

మ. విలసన్నిర్మల కృష్ణవేణిజలముల్
విశ్వాతిపూజ్యంబుల్
యిలలో నే నరుఁడైనఁ ద్రావ తనదా
హీనోగ్రదుర్బుద్ధిదిం
తలఁ బాయంగలఁ డామహామహుని
చెంతంజేరఁగా నెంచియున్
మలినాఘౌఘము సోకఁగా వెఱచు
షణ్మాసంబు లెంతేనియున్.

శా. సిష్ణానూత్కట పాపహారక పయ
శ్శింజత్తటత్వంద్వయై
విష్ణుబ్రహ్మసురేంద్రవర్ణిత జగ
ద్విఖ్యాతచారిత్రయై
కృష్ణశ్రీకరదివ్యగాత్రభవయై
కీర్తిస్ఫురన్మూర్తియై
కృష్ణాఖ్యాకనదీవతంసము చెలం
గెన్ విశ్వసంస్తుత్యయై.

గీ. గుడమమంబైన వస్తువు గోరిమెసవ
మధుర మంతట వర్తించు మాడ్కి కృష్ణ
కృష్ణదేహంబు తానయి కెరలుకతన
సమ్యగిష్టఫలంబుల సంఘటించు.

గీ. కామధేనువు గతిగాను గమలభవుఁడు
దానుసృజియించి కృష్ణను మానవులకుఁ
గ్రమములో నిచ్చె వారికిఁ గామ్యఫలము
లొప్పవాటింపఁ గల్గించుచుండఁ గోఱను.

శా. దూరస్థుండు దలంచె నేని మిగులం
దూలించుఁ బాపంబులన్
జేర న్వచ్చి కనుంగొనంగ నపుడే
చేకూర్చు నిష్టార్థముల్
నీరం బంటిన మోక్ష మిచ్చు నన్నఁగా
నిత్యంబు స్నానంబుచే

నీరూపంబు ఘటించునో యెఱుఁగరా
డెంతో విమర్శించినన్.

## కృష్ణానదీస్తోత్రము.

వ. ఓజననీ! భక్తులమై భవత్పాదదర్శనంబుఁగోరివచ్చిన మాకన్నుల కగపడి మమ్ముల నుద్ధరించుట దొడ్డతనంబు. జగద్ధితకరామృతస్వరూపిణివై ప్రత్యక్షంబుగానుండుదు వందువలన యుష్మదంఘ్రిపంకేజసేవకులగు మానవు లమరత్వంబు నొందియుండుదురు. శతానందుం డాదిత్యులకుఁ గలశంబుచేఁ దగుకొలఁది నమృతంబు నొసంగె. నీ వత్యంతకారుణ్యంబువలన మర్త్యులకొఱకు మహామృతవాహినివై కనుపట్టియున్నదానవు. సమస్తాశ్రమవాసులైన బుధసముదయంబులకును సర్వవర్ణంబులకును శరణంబై సర్వజీవశరణ్యవైన నిన్నుసేవింపక దర్శనంబునకు రాక యేమనుజులూరకుండుదురు? మిక్కిలి జలంబపేక్షించి పరిదృశ్యమానహంసంబులు దూరారణ్యంబునుంచి శుద్ధోదకంబు మదింగోరి భవత్సన్నిధానంబున కరుగుదెంచుపగిది నోదేవీ! పరమహంసముఖ్యులు సుఖాదులయందు నిస్పృహులై మోక్షంబపేక్షించి తావకీనదర్శనంబునకుఁ జనుదెంచుచుందురు. మఱియు బ్రహ్మసర్చస్కాములగు బ్రాహ్మణులును, పరిపంథిజయాభిలాషులగు రాజులును, ధనధాన్యాద్యపేక్షచే వైశ్యులును, నన్యులగు సకలజనంబులును దమతమ కోరికలఫలియింపఁ జేసుకొనుటకై త్వత్సమీపంబునకు వచ్చుచుండుదురు. వెండియు దేవదైత్యాప్సరస్సిద్ధసంఘంబులును, నాగగంధర్వ కిన్నరయూథంబులును స్వకీయకామ్యాభిసిద్ధికై జననీసమీపంబునకుఁ బుత్రులరుదెంచు చందంబున వచ్చుచుండుదురు భూసమావలోకనేచ్ఛను సమాగతుండగు శేషుని మంగళప్రదంబగు తనువు భంగి దీర్ఘంబును, కుటిలంబును, దవళంబునునై వెలుఁగొందు త్వదీయ దివ్యమూర్తిని దూరమున నుండి కనుఁగొన్నను గిల్బిషము హరించునన్న స్నానపానాదులకు నీజలం బనవరతంబును వాడుకొనువారల విషయమై యేమిచెప్పనగును?

క. శ్రీవిష్ణు శరీరణిరై
యావిధినుతయై మునీంద్రుఁడగుకృష్ణునిచే
నీవసుమతిఁజెందిన కృ
ష్ణావిమలద్వీపవతికి నతులొనరింతున్

శా. ఏకల్లోలిని శుంభదూర్మికలచే
నింద్రాదిదేవేశను
శ్లోకాత్యుత్తను విష్టపాళికి లసల్లోపాన
పంక్తిక్రియన్
లోకాఘంబుచే నూహింపఁదగి యీ
లోకంబులో శోభిలెన్
నాకంజేత్షణయైన కృష్ణకు నతుల్
హర్షంబునన్ జేసెదన్.

మ. మనుజవ్రాతములార! భీతిలక సన్మానం
బుతో మీరు వే
ననుఁబూజింపుఁ డభీష్టసద్వరవితా
నంబిత్తు మీకేనటం
చను నేనిమ్నగ నీరపక్షిపటలీశుంభ
న్నినాదంబుచే
జనసంఘంబులఁ బిల్చునట్లలరుఁ
దత్సహ్యాద్రిజన్ గొల్చెదన్.

శా. సాలశ్రేష్ఠసమస్తపుష్పఫలరాజత్సంఘ
సంయుక్తయై
వాలాయంబుగ మానవప్రకర సర్వాభీష్ట
సంధాత్రియై
చాలన్ శోభితయయ్యె నేతటినిఁ బ్రాంచత్క
ల్పవల్లీక్రియ
న్నాలావణ్యవతీశిరోమణిని నేనత్యంతమున్
గొల్చెదన్.

చ. భువనవిచిత్రసద్గుణసమూహమహత్త్వము
వల్ల మిక్కిలిన్
బ్రవిమల సజ్జనంబునకుఁబాపి కదంబమునన్
శరణ్యయై
భువి నెపు డేసరిద్వరము పొల్పెసలారును
దమ్మహానదీ

ప్రవరకుఁ గృష్ణ కేనతివిభాసుర భక్తినిఁ
జేలెూగ్గిడ్చెదన్.

చ. ఇనుము రసంబు సోఁకఁ దనహీనపుకాంతి
తొలంగి పైడియై
కనుపడుమాడ్కి లోకనుతిఁ గాంచిన
సహ్యసుతాంబుసంగమం
బున ఘనకిల్బిషం బపుడె పుణ్యతమంబగుఁ
గానలోకపా
వనతఁ జెలంగు కృష్ణ ననివారిత భక్తిని
నే నుతించెదన్.

ఉ. మానక సుప్రసన్నగతి
మానితలోకవిముక్తికై జల
స్నానముఁ జేయువారలకు
శాశ్వతవైభవదివ్యశాశ్వ భృ
త్త్రాన మొసంగుశక్తిగల
ధన్యవు గొల్తురు పాపముక్తులౌ
మానవులెల్లరున్ నిను స
మంచితభక్తిని సహ్యనందనా!

గీ. నీదు సలిలంబు లత్యంతనిర్మలములు
ఘోరజన్మశతాఘముం గూల్చివైచుఁ
జండతరభానుమాలి తేజశ్చయంబు
కటికిచీకటులను బాపుగతిఁ దలంప.

గీ. దుష్పతిగ్రహంబు దురోభ్యజనంబును
దుర్వ్యథః ప్రసక్తి దోషములను
దొలఁగఁజేసి మమ్ము గలకాలము నుగావ
వినుతిఁజేతు కృష్ణవేణ్ణి! నిన్ను

గీ. కృష్ణవేణితల్లి! విష్ణుదేవోద్భవ!
భక్తిగరిమతోడఁ బ్రణుతిఁజేసి
నిఖిలపాపహంత్రి! నీకర్ఘ్యమిచ్చెదఁ
జేకొనంగవలయుఁ జిత్తమలర.

వ. ఓ జననీ! సర్వపాపఘ్నియును నారాయణియును నగు నీకు నమస్కరించెద. శరణాగతుండనగు నన్ను సంరక్షింపు, మేనరుండు పరబ్రహ్మస్వరూపిణివగు నిన్ను వినుతించుటకు సమర్థుండైయుండు, నస్మదీయంబగు భక్తి నీయందు నిలుచుంగాక! మదీయస్తుతిచే సంతుష్టచిత్తవై మదపరాధంబులు సహింపవలయునని వేఁడెద, నో జననీ! నీయందు మజ్జనంబుచే మర్త్యుండు విధూతపాపుండగుచు విష్ణుపదంబు నొందు నిది యదార్థంబని గాధినందనుండు వినుతించె.

## కృ ష్ణా సా గ ర సం గ మ ము.

శా. శక్రాశ్మప్రతిమానదేహయగు కృష్ణా
సింధు వీరిత లో
కక్రూరాఘనివారణంబు కొఱకై
కారుణ్యమేపార భూ
చక్రాలంకరణంబు సేయుచును విశ్వ
స్తోమదోషావళీ
నక్రత్వంబును మాన్పుచున్ గలసెఁ
బ్రాగ్వార్ధిన్ స్వనీరంబుచేన్.

మ. అనులోమంబుగఁ గృష్ణముందరఁ దటి
న్యధ్యత్కుఁ డుత్సాహియై
ఘనవీచీమయబాహువుల్ చాఁచి
రంగల్లీల నాలింగనం
బనుమానింపకఁజేసె నచ్చటను జాయా
శ్లేష సమ్యక్క్రియా
జనితానందసుధామనోజ్ఞఝరిణీ
సంభోగచాతుర్యుఁడై.

## ఫ ల శ్రు తి

మ. అమలాత్ముండగు కృష్ణమౌనివరుచే
నాసీతయై భూమిపై
విమలాంభఃపరిపూర్ణ నిర్ఝరముచే
వేడ్కన్ బ్రవర్తిలు నీ
సుమహద్వాహిని యొక్కవృత్తము ప
ఠించున్ లోకమం దెవ్వఁ డు
త్తముఁడౌ నాతఁడు గాంచుఁ దద్గతిని గా
త్రత్యాగియై యవ్వలన్.

—తాతంభట్టు గురుమూర్తి శాస్త్రి.

అలసముతైన నీనడల నందము పొందిక గన్న, దూర్పుగా
ష్పులు బరు వెక్కి యన్ మధురముల్, నలివెచ్చనలయ్యె; కెంపు ని
గ్గుల వెలిగ్రక్కు మోవి కొసకున్ నలుపబ్బిన మృత్తికావరీ
మళములమించె; క్రొందళుకు మప్పకొనెన్ సకలాంగముల్ సఖీ!

అరవిరిదమ్మి సోయగమునందిన నీ తెలివాలు గన్నులే
పరిచితమాధురీమహితభావనలన్ గొని తెచ్చి మోవికిం
గరపినవో విలాసములు కార్కొను చిర్నగవుల్; హృదంతర
స్ఫురిత మహాప్రకాశపరిపూర్ణత చూడ్కికి పట్టియిచ్చెడిన్.

అలమిన పండువెన్నెలలయందు చెమర్చిన మంచు ముత్తెపుం
దళుకుల చల్వలందడిసి నానిన యీ తెలిమబ్బుదొంతరల్
నిలువున పుల్కరింప పయినించు సమీరునిలోని తావి నీ
అలతి పిసాళియూర్పులకు నంటిన దేమొ విలాసవల్లరీ!

ఇదివరదాక గంటి వికసించిన నీనయనాంతరేఖలం
దొదిగిన ప్రేమవెల్లి; ఇపుడో విమలమ్ము పవిత్రమై సుధా
స్పదమగు మాతృవత్సలత జాల్కొని నీ పరిశుద్ధమూర్తినిం
గదిసి మనోజ్ఞభావముల నాహృదయంబును ద్రిప్పునెచ్చెలీ!

చెదరి యలంతిగాడ్పులకు చెక్కులనట్టువ ద్రొక్కు ముంగురుల్
గుదురుగ ద్రోయునోపికయు గోల్పడి వాలిన మోమువాంచి ఎ
య్యది తలపోయుచుంటి వబలా! ఒడినింపగలాడు కుల్కులే
బెదవుల మొల్కలెత్త పసిబిడ్డడు నీహృదయమ్ము నంటుచున్.

తొలగినయౌవనంపుపసతో అడుగామడగా మనోహరుం
గలసియుగూడ, నిద్దపుజగాముసగుంగను గోన లేర్చు సి
గ్గులసొగపొందుడెందమున కోమలి! కిం అనబోవు వీడు గో
చిలికెడు నవ్వుతో నడుగు చెప్పుము యుష్మదభీప్సితంబులన్.

సొగసులనంది పుచ్చుకొని చొక్కపుకంఠము జుట్టివచ్చు ఆ
నగలగుపింపవేమి? లలనా! బరువయ్యెనె యవ్విగూడ! చి
ర్నగవులు నీలిచూపుల పరంపర రెండును నుండెనేని లో
టగునా కో నీనిసర్గహృదయంగమరాగరసైకమూర్తికిన్?

చూ...

కడుపున గ్రొత్తతేనె కొనకంగ...
గడలకు ద్రోయుచున్ ధవళకాం...
బొడవడు మల్లికాముకుళమున్...
పడు నినుగన్న ఊరక యొ...

బడలిక ముంపులోన పనిపాటల...
గడుకొన లేతనిద్దురల గందొవ...
మడతలు నుంతదప్పని విరామవ...
క్కడ గడెసేపు తీరుబడి గాంచవు...

మిసమిసలాడు కుందనపుమేలిప...
ప్రసవదళమ్ములట్టు కొనవారిన...
మసలవు; పుట్టతేనియల నట్టు గ...
క్కసముగ గానమాధురుల గ్ర...

జిలుగువెలుంగులందు నకిషీపని...
న్కలనెరసంజప్రొద్దు లొడికమ్ము...
ట్టలను గ రంగుచీరలు మిటారి!
న్నులగను మింక మోడుపుగను...

చికిలిమెరుంగుసూపుల పచేళిమ...
లిక నునసిచ్చియున్ వయసు లేత...
యకమును దాచియుంచుకొనిన...
డొకపసిపాపనిన్ మమతలూరు...

ఇవమునమున్ని జాజిపువుటెత్తులు
రవరవసింపు సొంపులహారంగు
కువవలె వేరులేని మనకూరిమిల
చివురుబదాల హొంబ్రతిమచే

## లాలు

నిగారపు గమ్మ తావులం
తుల నించుకవాడి చూడ్కికిఁ
పరిబోలు నవీనమూర్తి నె
ులపుల్ గుములై తలిర్చెడిఁ.

చ్చయె లేక చిట్టముల్
ఁ మొగిడించి కుచ్చెళుల్
ఁ గొంటివిః ముందుముందు ఎ
తే పసిపాపసేవలో.

ందుల జిందు చంపక
ట్టిపుగోళ్లు మీటులఁ
మ్మున లొంగిపోయి వె
దు వీణియ మూగనోములఁ.

న నల్లమబ్బుతు
దీరిచియారవైచె ని
ఋ మారపుచూడ్కులెత్తి మి
వలో దిగబెట్ట మాంద్యముఁ.

దని ముద్దరాలి పో
మ్మునమున్న నీకు తీ
మహాసుకృతమ్మునుండి నే
ల్ దయసేయు శ్రీమతీ!

గాత్తిన మేలితావులఁ
లెసంగ తురంగలించు వే
మొలకెత్తునట్టి ఆ
మెల్ల తరించు నోసతీ!

ఇట్లు ... (signature)

కమలముతోడ వేకువల కందెరపుల్లయి తోట నీశుభా
గమనముజూచు పూవులుసిగఁ గయిసేయకమున్నెవోలె అం
దములను వేల్పుగద్దియకు దార్చుకొనఁ, తొలిచూలు లేతడెం
దముగదలించి ఎట్టిపరిణామ మలర్చెగదే ప్రియంవదా!

మతి కరిగించివైచి బ్రతిమాలిన మిన్నకవెచ్చనూర్చి సాం
ప్రతములు జాలిమాపులను బైకెగద్రోయుచు కేలుదమ్మి ను
న్నితముగజుట్టి మోము గమనించుచు కన్బొమఁ నమించు నీ
యతివినయప్రవృత్తి గనినంతన ఆగదు నవ్వు మానినీ!

పెనకువసందిటం బొదువ బిట్టుచలింపక కౌనుదీవ మ
న్ననగొను మున్నె నే డతిఘనమ్మయి నీయెడగౌరవమ్ము నె
మ్మనమున బెంచు ప్రేమరసమాధురి గ్రోలెడి ముద్దరాల వీ
వనఘము మాతృపీఠమున కర్హతగాంచుట జీ. తేశ్వరీ!

చిబుకము నెత్తి ముద్దుగొన చెక్కులనంటిన పాండిమంబు పై
కుబికెః గళమ్ము గద్గదికనూగె; వికస్వరలోచనాంతముల్
ప్రబలె సితచ్ఛవిఁ; పలుకువాసి చలించెను మోవి సేడు నీ
యుబుసు లవేమొ క్రొత్తలయి యుల్లము నెల్ల గరంచు ప్రేయసీ!

కుతుకమునిండుకొన్న కనుకోనల మూనలవోసి నవ్వు లీ
ప్సితములు దిద్ది తీర్చి సరిచేసిన గొబ్బెమవద్ద పాడుచో
మతివడి పౌష్యలక్ష్మి పెరిమంగని "వాంఛితసిద్ధిరస్తు తే
సతతమ్" అటంచు దీవనలు సల్పినదేమొ మదేకజీవినీ!

ఇరువురితేజ మీయెడద నేపు వహించెను, ప్రేమపల్లరిఁ
మురువులు సూపనుండె తొలిపూవు, యెడందసుఖించు ప్రొద్దులఁ
బరిసిన నీవు వెన్నెలలదారుల సోలుచు తేలియాడుచుం
దిరిగెడి ప్రాణ్యదబ్దమువిధిఁ నయనమ్ములు చల్లచేయగఁ.

ఇదిగో! నీగర్భగోళమం దిమిడియున్న
ఒకమహాతేజ మీకులముద్ధరించి
నిలుపు సర్వసర్వంసహావలయమందు
మంచిముత్తెసరుల్ దలవంచు యశము!

# పుష్కర ప్రశంస

అహల్యాజారుడై శరీరము ఆపాదమస్తకము అసహ్యముగ నగునట్లు శప్తుడైన ఇంద్రుని పాపములు తొలగించుటకు బ్రహ్మచే నిర్మింపబడిన తీర్థరాజు పుష్కరుడు. అతడు సమస్తతీర్థములకును అధ్యక్షుడై ఎల్లవేళల స్వర్గలోకమునందలి మందాకినీనదియందు వసించియుండునట్లు బ్రహ్మదేవుని ఆదేశము అయినను పుష్కరుడు భూలోకమునుకూడ పునీతముచేయు ఉద్దేశముతో కొన్ని నియమితకాలములందు ఇచ్చటి నదులయందును ప్రవేశించి కొన్నిదినములుండుచుండును తాను ఎల్లవేళల నివసించియుండు దేవలోకమునకంతటికిని గురువగు బృహస్పతి మేషాదిద్వాదశరాసులయందు ప్రవేశించుకాలమును పుష్కరుడు తాను భూలోకమునకు వచ్చు ముహూర్తముగ ఏర్పఱచుకొనెను. బృహస్పతి సంవత్సరమునకు ఒక్కొక్క రాశియందు ప్రవేశించుచుండును. అట్లు బృహస్పతి ఆయారాసులయందు ప్రవేశించిన తొలి పండ్రెండుదినములందును దేవలోకమునుండి పుష్కరుడువచ్చి భారతదేశమునందలి ఆయాపుణ్యనదులయందు నిలుచును. పుష్కరుడు తీర్థములకురాజుగదా! కావున అతడు ఏనదియందు ప్రవేశించునో అచ్చటికి మూడుకోట్లఏబదిలక్షుల తీర్థములు; సమస్తసముద్రములు; సర్వనదులు; అఖిలనిధులు; అరణ్యములు; ఋషులు; దిక్పాలకులు; దేవతలు; వాణి, లక్ష్మి, గౌరి; విష్ణువు, మహేశ్వరుడు వత్తురు. పుష్కరుడు పండ్రెండుదినములుండి తిరిగి దివ్యలోకమునకు పోవును. మిగిలిన వారెల్లరు సంవత్సరపర్యంతము అచ్చటనుందురు. ఈపుష్కరయోగము అతిపవిత్రమైనది, పుణ్యప్రదమైనది పుష్కరయోగముల నదులయందు స్నానమొనరించి శుచియై దానాదికర్మలాచరించుటవలన పాపములు పోవును, శుభములుకలుగును. పుష్కరయోగకాలమున సమస్తతీర్థములును ఆయానదులయందు సన్నివేశమైయుండును గావున అప్పటి ఆనదియందలి స్నానము సర్వతీర్థస్నానమగును; ఒక్కచోచేరిన సమస్తదేవతలను ఒక్కసారిగ సేవించినట్లగును. పుష్కరయోగపుణ్యకాలమున గావింపబడు దానముల ఫలములు కోటిగుణితములుగా నందును. ఈపర్వకాలమున తీర్థవిధులు పెట్టుటచేతను, పిండప్రదానములు చేయుటచేతను పితృదేవతలను తృప్తులచేయవచ్చును. ఇప్పటి పిండదానములనంది పితృదేవతలు తృప్తులై ఉత్తమలోకములకు పోవుదురు

గురుడు మేషరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు సార్ధత్రికోటితీర్థసహితుడయి యేతెంచి గంగానదియందు ప్రవేశించును. గురుడు వృషభరాశియందు ప్రవేశించిన సమయమున పుష్కరుడు నర్మదానదియందుప్రవేశించును. గురుడు మిథునరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు సరస్వతీనదియందు సమావిష్టుడగును. గురుడు కర్కాటకరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు యమునానదియందు ప్రవేశించును. గురుడు సింహరాశియందు ప్రవేశించిన తరుణమున పుష్కరుడు గోదావరీనదియందు ప్రవేశమునుగాంచును. గురుడు కన్యారాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు కృష్ణానదియందు ప్రవేశము నొందును. గురుడు తులారాశియందు ప్రవేశించిన తరుణమున పుష్కరుడు కావేరీనదియందు ప్రవేశించును. గురుడు వృశ్చికరాశియందు ప్రవేశించినప్పుడు పుష్కరుడు భీమానదియందుప్రవేశించును గురుడు ధనూరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు రథ్యానదియందు ప్రవేశమునొందును. గురుడు మకరరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు భద్రానదియందు ప్రవేశమునొందును. గురుడు కుంభరాశియందు ప్రవేశించిన సమయమున పుష్కరుడు సింధునదియందు ప్రవేశించును. గురుడు మీనరాశియందు ప్రవేశించినపుడు పుష్కరుడు ప్రణీతానదియందు ప్రవేశమునుగాంచును

# కృష్ణవేణీ!

కలుషాపహారనిపుణే!
సదమలపీయూషభారసంభరితే!
ఆంధ్రైకభాగ్యనిలయే!
మాతః! కృష్ణే! నమామి తేంఘ్రియుగమ్.

ప్రాచీనాంధ్ర వికాసాన్
కలకలనినదైశ్చ శ్రావయస్యస్మాన్,
తుంగతరంగోద్భూతైః
అపినోమాతః ప్రబోధయస్యధునా?

ప్రాచీనకాల జాతామ్
నౌకావాణిజ్య సంపదం మహతీమ్
ఆంధ్రప్రాభవకౌశల
విసారిణీం హృద్గతాం వీక్షే.

విశ్వైకమోహన;
మపారరసప్రచారమ్;
సంపూర్ణభావ పరి
శీలితదివ్యలక్ష్యమ్;

సంస్తుత్యవర్ణ పరి
రంజిత; మార్యగీతమ్;
తీరస్థితం; హృదయ
హారి; స్మరామి శిల్పమ్.


అపారసకలాగమ
ప్రచురపాండితీసంస్కృతైః
పురఃకలిత స్వాధిప
ప్రచురకీర్తి దిఙ్నాగకైః;

కలావితతిమూలకే,
మహితవిశ్వవిద్యాలయే,
కృతం హృదివిభావ
యామ్యతుల మాంధ్రవిజ్ఞానకమ్.

సమస్తజనపాలనా
కలితస్వీయచిత్తాంబుజా;
మహాకలుషహారిణీ;
నిఖిలభక్తహృత్తోషిణీ
వశీకృతసుభర్గకా;
ప్రథితస్వర్ణదుర్గాంబికా
శిరోమకుటరత్నకం;
భవసిధన్యభావాచత్వమ్.

సుధామధురి మా
కలితదివ్యసారస్వత
ప్రసారనిపుణాశ్చ;
యేకవనకర్మమర్మస్పృశః;
ప్రభూతయశసోఽభవన్
భవదుదారతీరాశ్రితాః
రసేషుమహతీంఖలు
ప్రకటసిద్ధిమాప్తాశ్చయే.
పురాత్వత్తీరేఽభూత్
ప్రవిమలయశః ప్రాప్తిసుభగః;
సుకావ్య స్వారస్యో
న్మదితచిత్తాబ్జనికరః;
ప్రవీరో; ధర్మాణాం
సహజనిలయ; శ్చార్ద్రహృదయః
మహారెడ్డ్యాఖ్యాకః,
ప్రథితవిభవః రాజనికరః,
పురాత్వత్తీరేఽభూత్
ప్రవిమలకలాస్థాననిచయః,
మహాప్రాజ్యం రాజ్యం;
భువనతిలకం పండితకులమ్,
ఇదానీంతత్స్థానే పరిగత
మభావంచకలయన్,
మనోరంగే దూయే జనని!
సతతం పుణ్యనిలయే!

ఇతి, శ్రీ వేంకటేశ్వరస్య.



## జూన్, ౧౯౩౩.

౨౮:—పచ్చయప్ప ధర్మములబోర్డుయొక్క ప్రత్యేక సభయందు శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రి గారు బోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

౩౦:—కడప. శ్రీమతి రామసుబ్బమ్మగారు కె. కోటిరెడ్డి బి.ఏ. బారు అటులా, ఎమ్. యల్. సి. గారి సతీమణి, కడపజిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిలుకు అధ్యక్షురాలుగా ఎన్నుకొనబడిరి.

:—నెల్లూరు. జిల్లావిద్యాసంఘమునకు రా. సా. ఎం ఎ., అబ్బాయినాయుడుగారు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—అనారోగ్యకారణమున శ్రీమతి పొణకా కనకమ్మగారు శిక్షాకాలము పరిపూర్తికాకముందే వేలూరుజయిలునుండి విడుదలచేయబడిరి.

## జూలై, ౧౯౩౩.

౧:—మదరాసు. వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రిగారు తిరువత్తూరు బెంచికోర్టు అధ్యక్షులుగ ప్రభుత్వమువారిచే మూడవసారి నియమింపబడిరి

౩:—లండను. ఉత్కళప్రతినిధులు ఇండియా మంత్రిని సందర్శించిరి.

౪:—బరంపురము. గంజాం ఆంధ్రమండలి వి. వి. జోగయ్యపంతులుగారి అధ్యక్షతను సభజరిపి గంజాంజిల్లా రద్దుచేయ రాదనితీర్మానించిరి.

౫:—దొరతనమువారిచే రాజమండ్రి మునిసిపల్ సంఘమునకు కమీషనరుగా నియమింప బడిన ఉండేశ్వరస్వామిగారు చార్జితీసికొనిరి.

౬:—ఆంధ్రవిశ్వవిద్యాలయము ఇనస్పెక్షను కమిషనువారిరిపోర్టు ప్రచురింపబడెను.

౮:—సర్ అల్లాడి కృష్ణస్వామిఅయ్యగారు యూరపుయాత్ర ముగించి చెన్నపురికి తిరిగివచ్చిరి

:—కీ. శే. (అభినవాంధ్రకవితాపితామహ) మండపాక పార్వతీశ్వర కవిగారి శతవార్షికదినోత్సవము విశాఖపట్టణమున శ్రీపింగళి లక్ష్మీకాంతముగారి అధ్యక్షతను జరిగెను.

౯:—ది బ. శై. వెంకటనారాయణనాయుడుగారు వెంకటగిరిసంస్థానమునకు దివానుగా నియమితులై చార్జీపుచ్చుకొనిరి.

:—చీరాల. ౧౬-వ ఆంధ్రరాష్ట్రీయవిశ్వబ్రాహ్మణమహాజనసభ బ్రహ్మశ్రీ పట్నాల గోపాలస్వామి ఆచార్యులుగారి అధ్యక్షతను జరిగెన.

౧౦:—పాలకొల్లు మునిసిపల్ చైర్మన్ శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తిగారిపైన కొనిరాబడిన విశ్వాసరాహిత్యతీర్మానము వీగిపోయెను

:—బెజవాడ న్యాయవాద ప్రముఖులలో నొకరగు కొండపల్లి శ్రీరామచంద్రరావుపంతులుగారు చెన్నపురి జనరల్ ఆసుపత్రిలో మరణించిరి

:—ఒరిస్సా సరిహద్దుసమస్యావిచారణ, ఇండియామంత్రికి తెలుగువారిపక్షమున విజ్ఞాపనము. శ్రీయుతులు సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు, ఉన్నవ రామలింగంపతులు, పి. నారాయణరావు, వి బి. నారాయణరావు, సుబ్బారావు, సీతాపతిగార్లు విజ్ఞాపనము చేసిరి. శ్రీవెంకటగిరికుమారరాజా గారు జబ్బుగానుండుటవలన సభకు రాజాలకపోయిరి

౧౧:—లండనువిశ్వవిద్యాలయములో ఉన్నతవిద్య ముగించివచ్చిన డా. బి. హెచ్. ఎస్. వి. రాఘవరావుగారు ఎం. ఎస్ సి., పి. హెచ్. డి (లండను) ఆంధ్రవిశ్వవిద్యాలయమున కెమిస్ట్రీ లెక్చరరుగ నియమింపబడిరి.

౧౩:—చెన్నపురి ఆంధ్రమహాసభపక్షమునజరుపబడిన సభలో డాక్టరు లంకసుందరముగారు మలయా, సయాం, ఇండోచైనాద్వీపములందలి భారతీయులస్థితినిగూర్చి ఉపన్యసించిరి.

# సంపాదకీయ సమాలోచన

## బసవరాజు అప్పారావు కావ్యములు :—

కీ. శే. బసవరాజు అప్పారావుగారి కావ్యపుష్పములన్నియు మాలగా గ్రుచ్చి ఆంధ్ర సరస్వతీ దేవి పాదాంకములచెంత సమర్పించుటకు ప్రయత్నము జరుగుచున్నదని వినుట



బసవరాజు అప్పారావుగారు

కెంతయు సంతసించుచున్నాము. అప్పారావుని కాపురపురోహితుడగు బెజవాడయందలి ఆతని న్యాయవాదమిత్రుడు ఈ ప్రయత్నమునకు ఆద్యప్రవర్తకులైయున్నారు. రసికవ్యాపకులును, 'ప్రజామిత్ర' సంపాదకులును అగు శ్రీయుత కాటవిల్లి రామబ్రహ్మము చౌదరిగారు ఆధునికాంధ్రకవిపుంగవులలో నొకరును, ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయపాలకులును అగు శ్రీయుత అబ్బూరి రామకృష్ణారావుగారు మున్నగువారీ ప్రయత్నమునకు సర్వవిధముల సాయమొసంగుట సముచితముగనున్నది. అచిరకాలముననే ఈ ప్రయత్నము సఫలముగుగాకయని కోరెదము.

## నంద్యాలలో ఇటలీదేశపు పాతనాణెములు :—

టి. వి. సుబ్బయ్య (బి. ఏ., బి. యల్) గారు జూలై 12వ తేది 'ఆంధ్రపత్రిక' లో నిట్లు వ్రాయుచున్నారు: "నంద్యాల యూని. పి. జి. సుమర్ కాంపౌండునద్ద సర్వే నెంబరు 581లో రంపపుకోత నిమిత్తము భూమిని త్రవ్వుచుండగా కొన్ని బంగారునాణెములు దొరికినవి. ఈ విషయము తెలిసినవెంటనే నంద్యాల స్టేషనరీ సబ్ మెజస్ట్రేటు అచ్చటికి వెళ్లి విచారణసలిపి సుమారు ఏబదిరెండు నాణెములను స్వాధీనము చేసికొనిరి. ఒక్కొక్క నాణెము సవరకాసింతకు కొంచెము బరువుగను, మిక్కిలి శ్రేష్ఠమైన బంగారముతో చేయబడినదిగను ఉన్నది. క్రీ. శ. రోములో రాజ్యమేలుచుండిన నీరోసీసర్ ప్రతిమ కొన్నిటిపైనను, ఆ దేశపురాణీప్రతిమ కొన్నిటిపైనను ఉన్నవి. స్పష్టమైన లాటిన్ భాషతో పేరు వగైరాలు కనబడుచున్నవి. నాణెముల కిమ్మతు వేయిరూపాయిలు ఉండవచ్చును." ప్రాక్తనకాలమున ఆంధ్రులు ఖండాంతరదేశములతో వ్యాపారము సాగించియుండిరనుటకు ఇదివఱకే కొన్ని నిదర్శనములు కనుగొనబడియున్నవి. ఆ నిదర్శనములకు ఈ నాణెములుకూడ బలమొసంగగలవు.

సముద్రమునకు చాలదూరముననున్న నంద్యాలయందు ఇవిదొరకుటయు, ఇవి క్రీస్తు పూర్వపువి యగుటయు చారిత్రకముగ వీని విలువ హెచ్చుచున్నది. ఆంధ్ర దేశపు చరిత్రపరిశోధకులు ఈ నాణెములు ఆంధ్ర దేశమునందే యుంచుటకును, వీని పూర్తివివరములు వెంటనే పత్రికలయందు ప్రచురింపబడుటకును ప్రయత్నింపవలసియున్నది

**శ్రీరామమూర్తిపంతులుగారికి సన్మానము -**

శ్రీరావుసాహెబు గిడుగు రామమూర్తి పంతులుగారు నేటి ఆంధ్రదేశపు మేధావులలో నొకరు సుప్రసిద్ధ శాస్త్రవేత్తయగు థామస్ఆల్వాఎడిసనుతో శ్రీరామమూర్తిపంతులుగారికి ఒక్క బధిరత్వవిషయముననేగాక దీక్ష, ప్రజ్ఞవిషయమున కూడ సాదృశ్యముగలదు భాషాసౌలభ్యమునకై శ్రీవారు గావించినకృషి అనంతము జాతీయమైన భాషకొఱకు వారు శోధించిన గ్రంథములకు, అవలోకించిన శాసనములకు లెక్కలేదు తెనుగు, సవర భాషల నిఘంటువు వారిదీక్షాపరత్వమునకు అక్షరరూపము అట్టివారి డెబ్బదవ జన్మదినోత్సవము ఈ సంవత్సరము నవంబరుమాసమున రాజమహేంద్రవరమునందు జరుపుటకు ఏర్పాటులు గావింపబడుచున్నవి. ఈ ఉత్సవము రాజమహేంద్రవరమున జరుపుటలో నొకవిశేషము గలదని మాకు తోచుచున్నది. రాజమహేంద్రవరము (తూర్పు గోదావరిమండల మనుట బాగు) సాంఘిక విషయములయందు ముందడుగును, భాషా విషయమున వెనుకడుగును వైచుటకు పేరుకెక్కియున్నది. తూర్పు గోదావరిమండలము గ్రాంథికభాషకు పెద్దప్రాపగు ఒకమహారాజావారిమండలము. ఆ మండలముయొక్క తెలకనగరమగు కాకినాడయందు ఆంధ్రసాహిత్యపరిషత్తువారి పీఠముగలదు. ఆమండలమునందలి రెండవనగరమగు రాజమహేంద్రవరమునుండియే శ్రీరామమూర్తి పంతులుగారి యుద్యమముపై వజ్రాయుధము లేచినది అట్టి మండలమున ఇపుడు శ్రీరామమూర్తిపంతులుగారి డెబ్బదవ జన్మదినోత్సవము జరుపబడనున్నదనుట శ్రీవారి యుద్యమవిజయమును సూచించుచున్నది. ఆ ఉత్సవదినమునాటికి శ్రీపంతులుగారి వ్యాసములు, ఉపన్యాసములు చేర్చి ఒకసంపుటమును; 'ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజము,' 'బాలకవి శరణ్యము', 'గద్యచింతామణి' అను వారి గ్రంథములును అచ్చువేయించుటకు జన్మదినోత్సవనిర్వాహకసంఘమువారు తలపెట్టియున్నారు. ఈతలంపు పచేళిమమగుటకు రెండువేల అయిదువందల రూపాయిలు కావలెను. భాషాపోషకులు, ఉదారులు అగు ఆంధ్రధనికులు విరాళములిచ్చి శ్రీరామమూర్తిపంతులుగారి భాషాసేవకు కృతజ్ఞత చూపగలరని నమ్ముచున్నాము.

**శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి షష్టిపూర్తి:-**

శ్రీతిరుపతి వేంకటకవులు ఆధునికాంధ్ర సారస్వతప్రపంచమున చిరకీర్తి నార్జించిరి. వారి విద్యావివాదములు స్వభావముచే సారస్వతమునకు విముఖులుగానుండు యువకులను గూడ సారస్వతప్రియులనుగా నొనర్చినవి. వారు కొన్నితావుల విద్యావిజయములను గూడ పొందియున్నారు. కవితావేశులగు ఈ శతావధానులకు ఆంధ్రదేశమంతయు కవితావిహారముసల్పు బయలైయుండినది. శ్రీనాథుని తరువాత ఇట్టి నిరాఘాటకవితావిహారము సల్పినది వీరేయని చెప్పవచ్చును. వీరు శతావధానముల సందర్భమున ఆయా విషయములనుగూర్చి చెప్పిన పద్యములు

తెనుగున ఖండకావ్యరచనకు దారితీసినవని చెప్పుటకు ఏకమున్నది. ఈకవులలో నిప్పుడు సజీవులై యున్న శ్రీ వేంకటశాస్త్రిగారికి షష్టి



పూర్తి సందర్భమున గొప్పఉత్సవమును, వారిగ్రంథములు సమగ్రముద్రణమును నాగింపబడుచున్నవి. రాజమహేంద్రవరము చెంతగల కడియమను శ్రీవారి జన్మస్థలమైనను వారు బందరుపురమున పలుసంవత్సరములు ఆంధ్రోపాధ్యాయులై యుండి ఆప్రాంతమునందలి యువకులలో పలువురను కవితారాధకులను జేసికొనియుండుటచే ఈఉత్సవమునకు బందరుపురము కార్యక్షేత్రముగ జేయుట యెంతయు ఒప్పియున్నది. శ్రీ వేంకటశాస్త్రిగారింకను పలువత్సరములు జీవించి శ్రావ్యమగు తమ పద్యరచనము చేత ఉత్తేజమును, మధురమగు తమ హాస్యభాషణములచేత రంజకత్వమును కల్గించుచు ఆంధ్రకవిలోకమునందరిని సేవింప పరమేశ్వరుడనుగ్రహించునుగాక !

ఆంధ్రరాష్ట్రము : బొబ్బిలిరాజావారు:—

నెల్లూరు వేదిక, సైమనుని వేదిక ఆంధ్ర రాష్ట్రనిర్మాణావశ్యకతను పేర్కొనినవి. కాని ఆపేర్కొనుటను ఆంధ్రు లందుకొని తగినంత ఆందోళనము సాగింపనికారణమున ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రశంస వెనుకబడినది. మొదటి రౌండు టేబిలు సమావేశమునకు పోయియున్న ఆంధ్రప్రతినిధియైనను ఈ ప్రశంస యెత్తుకొనలేదు. రెండవరౌండు టేబిలుసభలో శ్రీ బొబ్బిలి రాజా వారు ఆంధ్రరాష్ట్రప్రశంస తెచ్చిరి. లండనులో ఆ ప్రశంస అంతకార్యకారి గాకుండినను దేశమునందు ఆంధ్రులను మేలుకొల్పి రాష్ట్రవిషయమున కృషిసల్పుటకు ఉత్సాహము పుట్టించినది. నాటినుండియు పత్రికలయందు ఈ విషయమై కొంతచర్చ జరుగుచునేయున్నది. ఆ ఉత్సాహమునకును, ఈచర్చలకును శ్రీ బొబ్బిలిరాజావారి అప్పటి ప్రయత్నమే కారణమనుట నిలువరానిది. దేశమునకు వచ్చినతరువాత శ్రీరాజావారు మద్రాసుమంత్రాంగమున ప్రవేశించిరి. అప్పటినుండి శ్రీవారి మనము ఆంధ్రరాష్ట్రనిర్మాణ విషయమున ఏనోటి వినుటయు కాజాల్చెను. ప్రత్యేకాంధ్రరాష్ట్రము కావలెను, కావలెను అనిన నోటితోడనే ఆంధ్రరాష్ట్రము వద్దు వద్దు అని వాదింపగలిగిరి. లండనులో ఆంధ్రరాష్ట్రము కావలెనని చెప్పి ఆంధ్రదేశమున రాష్ట్రవిషయమున ఎంతటి ఉత్సాహమును, దీక్షను పురికొల్పిరో శ్రీవారు ఈనాటిలో ఆంధ్రరాష్ట్రము వలదని చెప్పియు ఆంధ్రదేశమున రాష్ట్రవిషయమున అంతటి ఉత్సాహమును, దీక్షను పురికొల్పుచున్నారు. మాటమాట బొబ్బిలిరాజావారి ప్రకటనముపై దేశమున రేగిన అలజడిని! కావున శ్రీవారికి ఆంధ్రమహాప్రజాసంఘము చిరకృతజ్ఞతను చూపగలదు. నాయకత్వమువహించి రాజా, ప్రతినాయకత్వమువహించి రాజా నారు ఆంధ్రరాష్ట్రనిర్మాతలు కాగలరనుట నిక్కము. గత

వత్సరపు 'కావలెను' ఈవత్సరమున 'వద్దు'
గా మారినది. పైవత్సరమున ఈ 'వద్దు' తిరిగి
'కావలెను'గా మారగలదేమో! ఈ నెల
౧౬వ తేదీనాటి వారి సప్లిమెంటులోని
తుదిభాగము ఈ సందేహమునకు బల
మొసంగుచున్నది. రాజ్యాంగమున తెలియు
న్నవారిమాట నీటిపై వ్రాలుకంటెను అస్థిర
మొనదను దానికి బొబ్బిలిరాజావారు మంచితాజా
నిదర్శనముగనున్నారు. ఊటీకొండలనుండి
దిగవచ్చిన బొబ్బిలిరాజావారి ప్రత్యేకాం
ధ్రరాష్ట్రము వలదను ఈ కేకను రెండుకోట్ల
మంది ఆంధ్రులలో ఒక్కరైనను వినిపించు
కొందురని చెప్పుట సాహసమేయగును.

**యస్. టి. పి. యూనియను వార్షికోత్సవము :**

నరసాపురము తాలూకా ప్రోగ్రెసివ్
యూనియను వారి మున్నదిరెండవ వార్షికో



దేశోద్ధారక, విశ్వదాత
శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు

త్సవము ఈమాసము ౧౭వ తేదీని నరసా
పురమున 'దేశోద్ధారక,' 'విశ్వదాత' బిరు
దాంకితులగు శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు
పంతులుగారి అధ్యక్షతను జయప్రదముగ
జరిగినదని వినుటకు సంతసించుచున్నాము.
మున్నదిరెండువత్సరములుగా పనిచేయుచు
హరిజనులయందును, స్త్రీలయందును విద్యా
ప్రబోధము కలిగించుటకుగాను పాఠశాలలు
నిర్వహించియు; పోటీపరీక్షలు సర్వజని
న నడుపుచు; ఉచితపఠనమందిరమును; గ్రంథ
భాండాగారమును స్థాపించి జరుపుచు ఆంధ్ర
దేశమునందలి ప్రజాహిత జీవితాభివృద్ధికి
యథాశక్తిని దోహదమొసంగుచున్న నరసా
పురము తాలూకా ప్రోగ్రెసివ్ యూనియ
ను వారు ఆంధ్రదేశమునందలి సమస్త సదు
ద్యమములకును ఆశ్రయప్రదాతలై ఆంధ్రమా
తను సేవించుచున్న శ్రీనాగేశ్వరరావుపంతు
లుగారి ఉపదేశబలమున ద్విగుణీకృతోత్సా
హముతో దేశసేవ గావింతురుగాక!

**"ఏ దేశలింగపీఠిక కేరీతి పూజనమో ?"**

అని గతమాసపు 'ఆంధ్రభూమి' సంపా
దకీయ సమాలోచనలోని ఒక శీర్షిక నుదహరించు
చు 'ధర్మసాధని' ఇట్లు వ్రాయుచున్నది:—

"శ్రీ కి. దేశలింగపంతులుగారి స్మారకచిహ్నమేమి
యును నెలకొల్పకపోవుటను గురించి తీవ్రముగా విమర్శించి
నందులకు "ఆంధ్రభూమి" ప్రశంసింపదగియున్నది. ఈ
సంవత్సరము రెండవ దినము కళింగపురము శ్రీ కి. దేశలింగము
పేట నాకు గొప్పజనసమ్మేళనము మధ్యమున నిర్మింపబడి
యున్నది గాని దానిలో మనము, ఆశ్చర్యపోవలసినది.
అటులు ఆంధ్రమహాజనులు కవీశ్వరులను స్వాతంత్ర్యసింహ
ములలో గణికట్టైన ఉత్సాహమును కనబరచుచున్నారు.
ఆంధ్రభాషాజనకుడు కానలేని సేవచేసిన శ్రీ కి. దేశలింగ
ముగారు వలయునట్లుగా పొందియున్నారా? కండ్లప్పుడును కనిపిం
పని మాత్రమునకే కర్తవ్యమును నెరవేర్చుటకు తగుదానిగ రా
బోవు వార్షికోత్సవము నాటికి కి. దేశలింగముగారి చిత్ర
పటమును ప్రతిష్ఠించుట అవశ్యకార్యము, యుక్తము."

# "ANDHRA BHUMI."

**An illustrated monthly journal in Telugu.**

*(Published on the 15th of every month)*

*ANDHRA BHUMI* seeks to interpret the renaissance in Andhra Art and Literature in the light of History. The journal is intended to reflect, as far as possible, modern culture and civilization in all their manifold as pects A considerable part of it is devoted to the economic, social and political uplift of the Andhras, and generally to all matters affecting their welfare and happiness.

One of the objects of the journal is to help forward the movement in favour of the advancement of the economic and social status of Indian Womanhood, and bestow particular attention to all matters of special interest in woman's sphere of life

Besides this, contributions relating to Banking and Insurance form a special feature of the ANDHRA BUHMI.

A journal like this, which necessarily includes regular literary contributions of much interest to the average reader, will not fail to draw his pointed attention to the technical but nonetheless important subjects. As such the journal would form the best medium for advertisement.

**REGULAR FEATURES OF THE JOURNAL.**

---

LITERARY CONTRIBUTIONS:
Including Short Stories, Life Sketches, Humorous Writings, Articles on Modern Science & Historical Research, Essays in Criticism, Art and Poetry.
EDITORIAL COMMENTS
THE WOMAN WORLD.
THE SCIENCE OF INDIAN ORNAMENTS.
INSURANCE TOPICS.
THE LANDED ARISTOCRACY.
LIBRARY MOVEMENT.
ANDHRAS ABROAD.
HEALTH NOTES.
BOOKS REVIEUED
DIARY OF THE MONTH.
(By an Andhra.)

*Editor and Publisher* :

Andra Seshagiri Rao. B.A.,
56, Mukathala Street,
Vepery, Madras.

# OPINIONS.

"Andhra Bhumi" is a welcome addition to the ranks of illustrated magazines in our country. The Publication contains very attractive features and interesting articles We are much impressed with the ideal that the magazine professes to serve, viz, the happy consummation of the idea of Andhra Province. In the first issue more than one article is devoted to the professed subject and is written in a manner calculated to serve as an active propaganda for the Andhra Province. We wish the journal a long lease of life and a career of great usefulness to the Telugu Public.

—*The New Times*

"Andhra Bhumi" is an illustrated Telugu Monthly Journal. Among its many objects, the promotion of Andhra unity and culture occupies the first place. The contributions appearing in this, the first issue augur well for its future Several beautiful Poems embellish the pages of this issue. One short story appearing in this issue (which is very modern both in its conception and development) reveals the inner workings of the bureaucratic mind of an Indian Excise Inspector, while at the sametime reproducing a page from "the Short and Simple annals of the poor" in India. Separate Sections in the journal have been **devoted** to 'Women', 'Insurance', 'Health', etc. The journal is a very welcome addition to those very few which are now "in the field". It is to be hoped that it will obtain from the Telugu-reading public the encouragement it deserves.

—*The Hindu.*


"Andhra Bhumi" is a valuable addition to the ranks of Telugu Journalism. A monthly devoted to art. culture and literature, it is bound to be popular in Andhra Desa. A journal which serves as a vehicle of independent thought has been a long felt necessity in Andhra Desa and "Andhra Bhumi" it is to be hoped will satisfy that want Valuable articles on subjects of topical interest by well-known writers are published in it, and its special feature is the attention paid to Health, Insurance and Art. Mr. Andra Seshagiri Rao, B A, ex-editor, "Griha lakmi", edits this journal, and that is assurance enough that the journal will be conducted on independent and honest lines, keeping up to a high standard of journalism. The get-up of the journal is attractive and the subscription comparatively low, Rs. 3 *Per annum*. We wish Mr. Seshagiri Row's enterprise all success, and hope the Andhra Public will extend to him the encouragement the venture deserves.

—The Sunday Chronicle.

"We are in receipt of "Andhra Bhumi" which contained our advertisement We have to congratulate you for your success. The get-up of the book is nice Since this magazine is touching the social, political, religions, commercial and such other present topics we believe that the same will be patroni sed by the Public at large and advertisers as the demand for the same will be promising."

JAGANMOHINI INSURANCE CO., LTD.
*Vizagapatam.*
(sd.) V.A. GUPTA,
Managing Agents.

భవిష్యత్తును తెలిసికొనవలయునను అభిలాష మానవునకు పుట్టుకతో వచ్చునది. ఈ అభిలాషను నెఱవేర్చుకొనుటకుగాను ఆతడు తన బుద్ధిబలము నుపయోగించి జ్యోతిషము, సాముద్రికము మున్నగు శాస్త్రములను పెంపొందించియున్నాడు. ఈజిప్టు, గ్రీసు, రోము దేశముల చరిత్రలయందు ఈ శాస్త్రములు సత్యసమ్మతములనుటకు ప్రమాణములుగలవు ఇక హిందూదేశమో! ఈశాస్త్రములకు పుట్టినిల్లే. కాని ఈశాస్త్రము లిపుడు హిందూదేశమున విశేషపరిశోధనయందు లేవు



చిత్రము 1.

పాశ్చాత్యదేశములందు హస్తసాముద్రికమును ఉన్నతికి గొనివచ్చినవారిలో ముఖ్యుడు డిబరొల్లిన్ అను ఫ్రెంచిజ్యోతిష్కుడు. ఇతడు క్రీ శ 1801 యందు ఫ్రాంసు దేశమునకు ముఖ్యపట్టణమగు పారిస్‌నందు జనించి 1886లో అచ్చటనే చనిపోయెను అతని శిష్యులు ఇప్పుడు పెక్కురు యూరప్‌యందును, అమెరికాయందును గలరు. డిబరొల్లిన్ చిన్ననాటనుండియు సాముద్రికమునం దత్యంతకుతూహలముతో అభినివేశము చూపుచు దాదాపు 50 సంవత్సరముల యనుభవమును పొందినపిమ్మట హస్తసాముద్రికముపై రెండు పుస్తకములను రచించెను. అందుండు పెక్కు విషయములను ప్రమాణములుగ ఈనాటి సాముద్రికులుకూడ గ్రహించుచున్నారు.

కాని హస్తసాముద్రికము పాశ్చాత్యదేశజన్యమని చెప్పుటకు వీలులేదు. ఇప్పటి పాశ్చాత్యసాముద్రికమున లోకప్రఖ్యాతిగాంచినకౌంటు లూయి హేమను తానేర్చిన విద్యయంతయు భారతదేశమునగల ప్రాచీనసాముద్రికశాస్త్రగ్రంథములలోనిదే అని నొక్కిచెప్పుచున్నాడు. భారతదేశమునకు వచ్చి తీసికొనివెళ్లిన ప్రాచీనగ్రంథములు ఇప్పుడుకూడ తనవద్దగలవట. తనవద్ద 60,000 తక్కువకాని హస్తముల ముద్రణములున్నవనియు, తాజూచిన హస్తములు లెక్కకు మించినవనియు ఇతడు తనపుస్తకమునందొకదానిలో వ్రాసికొనియున్నాడు యూరపునందలి పెక్కు దేశాధీశులు, సేనానాయకులు, మంత్రులు మొదలగువారి హస్తముల నీతడు పరీక్షించి [బొంబాయి] 'టైమ్సు ఆఫ్ ఇండియా' యందును, తానురచించిన పెక్కు పుస్తకములయందును ఈ హస్తములను గురించి వ్రాసియున్నాడు. ఇతడే "కైరో"

ఆంగ్లేయ ఫ్రెంచిభాషలందు సాముద్రికమును గుఱించి వ్రాసినపుస్తకములు పెక్కులుగలవు. హీరక్ అలర్, ఆల్క్ లిమో, సెయింట్ జర్మైన్ అనువారు జీవించియున్న సాముద్రికశాస్త్రగ్రంథకర్తలలో ముఖ్యులు. వీరుగాక ఇతరులువ్రాసిన పలు గ్రంథములను చదివియుండుటచేతను, దాదాపు పదమూడు వత్సరములకెక్కువగా నాకీశాస్త్రమునందనుభవముండుటచేతను ఈ పత్రికాసంపాదకుల కోర్కెపై హస్తసాముద్రికమును గుఱించి కొన్ని వ్యాసములిందు వ్రాయబూనితిని


## ౧

సాముద్రికశాస్త్రము రెండు భాగములుగ విభజింపబడినది హస్తములు, వ్రేళ్లు, నఖములు వీని ఆకారమునుబట్టి వ్యక్తిస్వభావము గనుగొనునది మొదటిభాగము. వ్రేళ్ల లోభాగమునందు అరచేతియందు గల రేకలనుబట్టి మనుజుని స్వభావమేగాక, ఆతని జీవితమునందు జరిగినవియు, జరుగబోవునవియునగు ముఖ్య విషయములను తెలుసుకొనునది రెండవ భాగము. ఈ రెండుభాగములు కలిపి చదివినగాని సాముద్రికజ్ఞానము సంపూర్ణము కాదు ఒకేరేఖ రెండురకములకు జెందిన వేరువేరు హస్తములపై వేరు వేరు ఫలములనిచ్చుచున్నది.

సాముద్రికశాస్త్రమునందు రెండవభాగముగ పైన పేర్కొన్న రేఖాజ్ఞానభాగమునందలి ముఖ్యాంశములు ఈ సంచికయందు తెలుపబడును. ఇందు వ్రాసిన విషయములను చదువరులు చక్కగ గ్రహించినగాని ముందు వ్రాయబోవు విషయములు అర్థముగావు

ఇందుగల చిత్రములో నెం 1. ముఖ్యమగు రేఖలు మాత్రము పేర్కొనబడినవి. 1-1. జీవ, 2-2. శిరో, 3-3. హృదయ, 4-4 అదృష్ట, 5-5 సూర్య, 6-6 కుజ, 7-7. ఆరోగ్య, 8-8 వివాహ, 9-9. శుక్రునివక్రరేఖలు.

నెం 2. చిత్రము అంకెలువేసి చుక్కలతో ఏర్పరుపబడిన స్థానములపేళ్ళు ఇవి:— 1. గురుస్థానము, 2 శనిస్థానము, 3 రవిస్థానము, 4 బుధస్థానము 5. చంద్రస్థానము 6. శుక్రస్థానము, 7 కుజుని లోస్థానము, 8 కుజుని పైస్థానము





చిత్రము 2.

### గురు, శని, రవి, బుధస్థానములను గనుగొను విధము

హస్తములను సూక్ష్మదృష్టితో పరిశీలించినయెడల, అరచేతి చర్మమునందే ఇమిడియున్న నూలుపోగులవంటి అణురేఖలు కానవగును. ఇవి అరచేతియందు అన్నివైపులకు వ్యాపించుచున్నవి హృదయరేఖకు పైభాగమున ఈ అణురేఖలు మూడవచిత్రమున పోలియుండును. ఈ చిత్రమునందు అంకెలతో గుర్తుపెట్టిన స్థలములే గురు మొదలగుస్థానములు. (చిత్రము 3) రెండవచిత్రమున చూపబడిన స్థానములందు ఈఅణురేఖలచే ఏర్పఱుపబడిన కేంద్రములు వ్యత్యస్తములై యుండుచుండును.

ఇట్టి వ్యత్యస్తమువలన వేరువేరుఫలములు వచ్చుచున్నవి. ఈ మూడవచిత్రమున గురుని కేంద్రము (1, చిత్రము 3) మాత్రము యథాస్థానమున నున్నది. ఇట్లుండుటవలన దాని యొక్క సుగుణములు పూర్తిగ పట్టియున్నవి శని 2, రవి 3, బుధ 4, కేంద్రములు ఉండవలసిన స్థానములకంటె పైప్రదేశముల కెక్కియున్నవి. ఇట్లు యథాస్థానచ్యుతములగుటచే నివి ఫలవిషయమున బలహీనము లగుచున్నవి ఈ చేతి యందు శని రవి కేంద్రములు బలహైన్యమును పొందియున్నను వానికి యథోచితములైన అదృష్టరేఖయు (౧), సూర్యరేఖయు (౨) స్ఫుటముగ నుండుటచే వారికి ధనసంపత్తియు, విద్యాసంపత్తియు కలిగించినవి. బుధకేంద్రమున నిట్టి సహకారియగు రేఖాసంజ్ఞ యేమియు లేకపోవుటచే వీరు న్యాయవాదులై యుండియు వాగ్ధాటి లేనివారుగా నున్నారు. ఏదియెట్లున్నను గురుని కేంద్రము యథాస్థానమున నుండుట వీరు అదృష్టవంతులై ప్రజాగౌరవమును బడయుటకు కారణమైనది.




చిత్రము 3.

ఈచేయి చెన్నపట్టణమునందు న్యాయవాదిగనుండి సాలునకు దాదాపు 15 వేలను ఎక్కువగ నార్జించువారి హస్తమునందలి అణురేఖలను చూపునది ఈ రేఖలచే ఏర్పడుచున్న 1, 2, 3, 4 అను గుర్తులచే తెలియచేయబడినవి క్రమముగ గురు,శని, రవి, బుధస్థానములు. ౧ అదృష్టరేఖ యందలిభాగము. ౨ సూర్యరేఖ యందలి భాగము.

## ౨

ఒకవ్యక్తికి రెండుచేతులయందు గల రేఖలు, గ్రహస్థానములు, అందలి ఎత్తుపల్లములు ఒకవిధముగనుండవు ఇట్టి వ్యత్యస్తమునకు సాముద్రికశాస్త్రమునందు వివరణముగలదు ఎడమచేతియందుండు రేఖలు స్వతస్సిద్ధమైన గుణములను తెలియజేయునవి. కుడిచేతియందుండు రేఖలు వ్యక్తి యొక్క స్వయంకృషిచేతను: జీవితమునం దనుభవించినకష్టసుఖములచేతను స్వభావమెంతవఱకు మార్పు చెందుచున్నదో వెల్లడిచేయునవి. రెండుచేతులందును రేఖలు ఒకేవిధముగ నున్నచో వ్యక్తి చిన్ననాటను ఏగుణములు గల్గియుండెనో పెద్దవాడయినప్పుడు కూడ ఆగుణములే గల్గియున్నాడని తెలుసుకొనవలయును. ఎడమ చేతియందు జీవరేఖ బలహీనముగను, అస్ఫుటముగను ఉండి కుడిచేతియందు దిద్దినట్లున్న, ఆవ్యక్తి చిన్నతనమందు స్వభావసిద్ధముగ బలహీనుడనియు, పిమ్మట వ్యాయామాదికృషులచే తనదేహదార్ఢ్యమును చక్కబెట్టుకొనెననియు చెప్పవలయును. ఇట్లే ఎడమచేతియందు శిరోరేఖ (1-వ చిత్రమునందలి 2-2 రేఖవలె) ధనువునుపోలి వక్రాకారము దాల్చి చంద్రస్థానమునందంత మొందుచు, కుడిచేతియందు ఉన్ననిగీతమై చంద్రస్థానమునకు దిగకుండ కుజుని పైస్థానమునకు (రెండవపటమునందలి ౨-౨ వ రేఖవలె) వ్యాపించుచో అట్టివ్యక్తి విద్యాభ్యాసము ముగియువఱకు కవితాలంకృత

ములు గల్గి మానసికాభిలాషలు; చిత్రము, శిల్పము, మొదలగు లలితకళలయం దభిరుచిగల్గి జీవనోపాధికై ఈవిద్య లంతగ ఫలింపవని అనుభవమూలకముగ తెలిసికొని లోకవ్యాపారానుగుణమైన సడవడియు, ఉద్యోగమును పొందుచున్నాడు అట్టివ్యక్తి కుడిచేతియందు అదృష్టరేఖ జీవరేఖతో ఎట్టి సంబంధము లేక (4-1 రేఖ నెంబరు 1 చిత్రము) మణికట్టునుండి రెండవ వ్రేలివరకు తిన్నగ వ్యాపించినయెడల అతడు ధనాదాయము ముఖ్యోద్దేశముగ చేసికొని తాత్కాలిక స్థితిగతుల కనున కుమార్గమరసి అందు కృతార్థుడగుటకు సందియ మెంతమాత్రము లేదు. ధనరేఖ ఎడమచేతియందు జీవరేఖనందుండిగాని (2 చిత్రములో రేఖ ౮-౮). శుక్రస్థానమందుండిగాని (౮-౫ రేఖ-రెండవచిత్రము) బయలువెడలుచు, కుడిచేతియందు మణికట్టు నుండి బయలువెడలుచున్న యెడల అట్టి హస్తములు గల్గువ్యక్తి తన జీవితమునందు ప్రథమభాగమున గృహసంబంధమైన కట్టుబాట్లు తనజీవనమునకు ప్రతిబంధకముగుటయు, తనజీవితమున రెండవభాగమునందు అనగా 30 లేక 35 ఏండ్లువచ్చునప్పటికి గృహబంధనములనుండి విముక్తుడై స్వయంకృషి వలన జీవించుచున్నాడు.

ఇట్లు రెండుచేతులయందు రేఖలు భేదములైనచో పై జెప్పినవిధమున వ్యక్తియొక్క జీవము గొప్పమార్పులను పొందుచున్నది. అట్లుగాక రెండు చేతులయందును ముఖ్యరేఖ లించుమించుగ నొకేవిధముగ నున్నయెడల అట్టివ్యక్తి జీవితమునందు మార్పులు లేక తానేస్వభావమును, స్థితిగతులు చిన్ననాడు కలిగిఉండెనో అట్టిస్వభావముతోడనే అట్టిస్థితిగతులతోడనే అతడు మృతి నొందుచున్నాడు. అత డేమియు గొప్పకార్యముల చేయలేడు. తన మిత్ర బంధువర్గములందు అందరితోపాటు ఒకడై యుండునేగాని కృషి చేసి తానుండు స్థితికంటె ఔన్నత్యమును పొందలేకుండును. అట్టివ్యక్తి హస్తములు మృదులములును మాంసలములును అయి ఉండినయెడల అతడు బద్ధకస్తుడును సుఖాపేక్ష కలవాడును అయి కష్టపడనొల్లక వృథాకాలక్షేపము చేయు జీవి యగుచున్నాడు.

రెండుహస్తములందును రేఖ లెట్లున్న మంచిదో ఇచ్చట వివరించెదను కుడిచేతియందు రేఖలు స్ఫుటముగనుండవలెను. జీవరేఖ ఖండముగాక ఉండవలెను (1-1 రేక చిత్రము 1) గురుస్థానమునకు దిగువను శిరోరేఖ జీవరేఖతో అంతగ నైక్యము కాకుండ నుండి ఎక్కువగవంగక చంద్రస్థానమునకుపైభాగమునకుగాని (2-2 రేఖ చిత్రము-1) కుజుని పై స్థానమునకుగాని (౨-౨ రేఖ రెండవ చిత్రము) వ్యాపింపవలయును. హృదయరేఖ గురుస్థానము నుండిగాని (౧-౧ రేఖ చిత్రము రెండు), గురు శనిస్థానములమధ్య నుండిగాని (3-3 రేఖ చిత్రము-1), బయలుదేరి బుధునిస్థానమునకు క్రిందివఱకు వ్యాపింపవలయును అదృష్టరేఖ మణికట్టునందు మొదలిడి శిరోహృదయరేఖల నతిక్రమించి విరుపులు మలికలు లేక శనిస్థానమువరకుగాని (4-4 రేఖ చిత్రము-1), గురు, రవి స్థానములకుగాని వ్యాపించిఉండవలెను. అట్టిహస్తమునందు సూర్యరేఖ ఏమాత్రమున్నను (౬-౬ రేఖ రెండవపటము) ఆవ్యక్తి లోకఖ్యాతిసిగడించును ఇట్లుగాక ముఖ్యమగు ఈరేఖలు వ్యత్యస్తములైనను, భంగాది దుర్లక్షణములు కలిగియున్నను కానగు ఫలములు పై మాసపు సంచికలో వివరింపబడును.

# విడ్డూరములు

## §. రెక్కలు గల పిల్లి

ఆక్సుఫర్డునందలి జంతుప్రదర్శనశాలకు ఈమధ్య ఒకపిల్లివచ్చెను దానికి వెనుకటికాళ్ళదగ్గర ఇరుపార్శ్వముల చెరియొక పక్షి రెక్కయు నుండెను. ఆ రెక్కల యందు ఈకలు బాగుగనుండెను. ఒక్కొక్క రెక్క ఒకఅడుగుపాడుగు ఉండెను ఆపిల్లి ఆరెక్కలను పక్షికివలెనే అల్లల్లాడించుచుండును. ఈవింతజంతువు ఎవరిదో, ఎక్కడినుండివచ్చినదో తెలియరాదు.

## §. ముక్కు విలువ ఎనిమిది వేలరూపాయలు

లాసేంజెల్సునందు ఒకస్త్రీ మోటారుప్రమాదము వలన తన ముక్కుయొక్క కాంతి చెడెననియు, దానికి పరిహార మిప్పించవలసినదనియు కోర్టులో దావా తెచ్చెన. విచారించి ఆమెకు కోర్టువారు నాలుగువందల పౌనులు (సుమారు ఎనిమిదివేలరూపాయిలు) పరిహార మిప్పించిరి.

## §. ఒకేచెట్టున ఎనిమిదిరకముల సీమరేగుపండ్లు.

చికాగోనగరమునకు చెంతగల ఓక్‌పార్కుగ్రామపు ఆరోగ్యశాఖాధికారియగు డాక్టరు ఫ్రాంకుసీడ్‌హామ్ గారి పెరటిలో నొకచెట్టుగలదు. ఇది ఇరువది సంవత్సరములకుపూర్వము నాటబడినది నాటినుండియు డాక్టరుగారు ఆచెట్టుకు పలురకముల సీమరేగులను అంట్లుకట్టుచువచ్చెను. ఇప్పుడాచెట్టు ఎనిమిదిరకముల సీమరేగుపండ్లను కాయుచున్నది. పీతలనుబోలిన సీమరేగులు; కూరకు పనికివచ్చు సీమరేగులు; ఫలాహారములకై పనికివచ్చు పలురకముల సీమరేగులు ఆచెట్టున గలవు. పీతలనుబోలిన రకపు సీమరేగులను కాయుకొమ్మ ఈయేడు ఒకపక్షముననే రెండుసారులు కాసినది. ఈ రెండవకాపంతకాపు ఇంతవఱకెప్పుడును కాయలేదు.

## §. తొంబదిరెండేండ్లతొక్కు చచ్చిబ్రతుకుట.

టోకియోయందు టూసాన్ కిసోసెతి అను తొంబదిరెండేండ్లస్త్రీ చనిపోయెను. ఆమెశవమును పీనుగుపెట్టెయందుంచి బంధువులు అపరక్రియాకలాపమునకు గడంగిరి. కాని ఇంతలో పీనుగుపెట్టెనుండి ఒకవిధమైన శబ్దము వినవచ్చెన. అందుమీదపెట్టెమూతనువిప్పిరి. టూసాన్ కిసోసెతి మెల్లగలేచి పెట్టెనుండి బయటకువచ్చి తన మరణసందర్భమున చేయబడుచున్న అపరక్రియాకలాపవశమున అక్కడి వేదికపై నుంచబడిన బియ్యపుఅట్లను తినుటకు ప్రారంభించెను.

## §. స్నానముచే తిరిగి యౌవనమునిచ్చు ఉష్ణజలగుండము.

ఏషియామైనరునందలి మైషియాదేశమునకు చెందిన పెర్గామస్ నగరము బహుప్రాచీనమైనది. అది క్రీస్తుపూర్వము ౨౮౩-వ సంవత్సరమున ఒక చిన్నరాష్ట్రమునకు రాజధానియైయుండెను. ఆనగరము చెంత ఇపుడొక ఉష్ణజలగుండము కనుగొనబడినది. ఆ ఉష్ణజలగుండమున స్నానముచేయువారు పోయిన యౌవనమును తిరిగి పొందగలరు; వారు సుందరదేహులను అగుదురు. ఆ గుండమునందలి జలములకు ఇట్టి మహత్తరశక్తినిచ్చిన భౌతికరసాయనికపదార్థములందేమిగలవో పరిశోధించి తెలిసికొనుటకు జర్మనుశాస్త్రజ్ఞులజట్టు అక్కడకు పోవుచున్నది.

## §. దినమునకు తొంబదిరెండు శిశుహత్యలు.

శిశుహత్యలు చీనాదేశమున నేడుకూడ విశేషముగ జరుగుచున్నవి. ౧౯౩౨-వ సంవత్సరమున ఒక్క షాంగై పట్టణమునందే దినమునకు సగటున హత్యచేయబడిన శిశువుల శవములు తొంబదిరెండు వీథులయందును, సందులయందును, ఉప్పుటేరులయందును కానబడెను

# మహిళాలోకము

## సోవియట్ రష్యాలో స్త్రీలు

సోవియట్ సంఘమునందు స్త్రీల న్యాయసంబంధమైన హక్కుల విషయమునను, సాధారణానుభవముల విషయమునను బోల్షివిక్ విప్లవము గొప్పమార్పులను గొనివచ్చినది. జారు ప్రభుత్వకాలమున రష్యాదేశపు స్త్రీకి ఎట్టి హక్కుగాని లేకుండెను. వివాహమగువఱకు తండ్రియొక్క నిరంకుశాధికారముక్రింద, వివాహానంతరము భర్తయొక్క నిరంకుశాధికారముక్రిందనుండి అప్పటి రష్యా స్త్రీ ఇంటియందొక దాసియై యుండెను. భర్తలు భార్యలను కొట్టుటయనునది వింతవిషయముకాదు. తనపేర కుటుంబపుటాస్తిలోని ఒకభాగమైన నుంచుకొనుటకు ఆమెకు హక్కులేదు. ప్రభుత్వకార్యాలయములందుగాని స్థానికప్రభుత్వసంస్థలయందుగాని నారి యుద్యోగము చేయుట చట్టసమ్మతముకాదు. వ్యాపారప్రపంచమున బాధ్యతతోకూడిన పదవియందు దేనియందును స్త్రీ ఉండియుండినదనుటకు నిదర్శనము ఒక్కటియైనను కానము

బోల్షివిక్ విప్లవానంతరము సోవియట్ నారి నూత్నప్రపంచమున ప్రవేశించినట్లయ్యెను. ఆమెకు పూర్తి దాస్యవిమోచనమయ్యెను. రాజ్యాంగపునర్నిర్మాణమున, సాంఘికపునర్నిర్మాణమున ఈవఱకు మానవుడు త్రొక్కిచూడని క్రొత్తదారులవలంబించిన లెనిన్ మహాశయుడును, అతని సహకారులును సోవియట్ రష్యాలో స్త్రీకి క్రొత్తఅంతస్థు నిచ్చిరి పురుషునకుగల సర్వమైన హక్కులును స్త్రీలకుకూడ ప్రసాదింపబడినవి

కలిగినమార్పు సంపూర్ణమైనది ప్రభుత్వమునందును, వ్యాపారమునందును కోరికగల ఏస్థానమునేని ఆమె ఇపుడు పొందగలదు పొందగలదననేల? ప్రభుత్వమువారు నియమించు కమీషనులయందును, పెద్దపెద్ద వ్యాపారసంస్థలపాలకవర్గమునందును సోవియట్ స్త్రీలు బాధ్యతతోకూడిన ఉన్నతపదవులను బొందియేయున్నారు.

సోవియట్ రష్యాయందు భూమి అంతయు ప్రభుత్వమువారిది ఆ యా ప్రదేశముల వ్యవసాయపు కార్యములను చక్కబెట్టుటకు ప్రత్యేకసంఘములు గలవు అట్టి సంఘములలో సభ్యురాండ్రయియున్న స్త్రీలు నేడు సోవియట్ రష్యాయందు 150,000 మంది గలరు ఆల్ యూనియన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీయందును నూటయెనుబదియైదుగురు నారులు సభ్యురాండ్రుగనున్నారు. కమ్యూనిస్టుపార్టీసభ్యులు మూడుమిలియన్లు. ఈమూడు మిలియన్లలో ఆరవవంతు స్త్రీలు. వ్యవసాయసంబంధమైన పనులకై నిర్దేశింపబడిన పెద్దపెద్ద మోటారు బండ్లను నడుపువారిలో ఇరువదియైదువేలమంది స్త్రీలుగలరు 1923-వ సంవత్సరములో ఫ్యాక్టరీలయందును, దుకాణములయందును 404,200 మంది స్త్రీలు పనిచేయుచుండువారు 1931 సంవత్సరమునాటికి ఆసంఖ్య 1,720,700 వఱకు పెరిగినది. వివిధములైన

పరిశ్రమలన్నిటియందును స్త్రీలసంఖ్య త్వర క్రమమున పెరుగుచున్నది. యంత్రముల నిర్మించు కర్మాగారములయందును, బట్టల నేయు యంత్రశాలలయందును, లోహపరిశ్రామికశాలలయందును, రసాయనికశాలలయందును బొగ్గు వేయుపని మొదలు ఇంజనునడుపు పనివఱకు—నారులు చేయుచున్నారు. పురుషులలోకంటె నారులయందు ఈ సాంకేతికవిద్యాపరిజ్ఞానము ఆదినమున కాదినము హెచ్చుచున్నది

స్త్రీలలో ఈవృత్తివిద్యాపరిజ్ఞానముయొక్క హెచ్చుదలకు ప్రత్యేకకారణములు గలవు. జీవనోపాధిని కలిగించు ఈ వృత్తివిద్యాపరిజ్ఞానము స్త్రీలలో పెంపొందుటకై ప్రత్యేకావకాశములు కల్పింపబడినవి. ఐరోపామహాసంగ్రామకాలమువఱకు రష్యాదేశమున వృత్తివిద్యాపాఠశాలలలో స్త్రీలకు ప్రవేశములేకుండెను యుద్ధానంతరము ఈ పాఠశాలలయందు పురుషులతోబాటు స్త్రీలకుగూడ ప్రవేశమొసంగబడెను ఈ సదవకాశమును జారవిడువక స్త్రీలు వృత్తివిద్యాశాలలయందు సంతోషపూర్వకముగ ప్రవేశించి క్రొత్త ఉద్యోగములను పొందుటకు యోగ్యతను సంపాదించిరి. ఈ సందర్భమున క్రింది అంకెలు గమనించుటకు ముచ్చటగ నుండును. 1925-వ సంవత్సరమున వృత్తివిద్యాపాఠశాలలలో ఒకరకపువానియందు 6,800 మంది విద్యార్థినులుండిరి. 1932-వ సంవత్సరమునకు ఈసంఖ్య 47,000 కు పెరిగెను. మఱియొకరకపు వృత్తివిద్యాపాఠశాలలలో 1925-వ సంవత్సరమున 71,600 మంది స్త్రీలుండిరి. 1932-వ సంవత్సరమున వారిసంఖ్య 272,800 దాటెను వృత్తివిద్యావబోధమునకైన ఉన్నతపాఠశాలలయందు 1925-వ సంవత్సరమున 50,700 మంది విద్యార్థినులును, 1932-వ సంవత్సరమున 143,400 మంది విద్యార్థినులును ఉండిరి సహకారసంఘములతోడను, ప్రతినిధిసభలతోడను విశేషసంబంధము కలిగియుండ నిర్వహింపబడుచున్న పౌరసత్వవిజ్ఞానపాఠములు క్రమముగా స్త్రీలోకము నాకర్షించుచున్నవి. కడచిన ఆరు వత్సరములలో పౌరసత్వవిజ్ఞాన పాఠ్యక్రమమున 10,000,000 మంది స్త్రీలు పాల్గొనియుందురని అంచనా వేయబడెను. 1932-వ సంవత్సరమున 8,000,000 మంది స్త్రీలు చదువను, వ్రాయను నేర్చుకొనిరని రష్యాదేశపు ప్రభుత్వపత్రికలు ప్రచురించుచున్నవి ఇందు కొంత అతిశయోక్తి కలదని మనము ఒప్పుకొన్నను సోవియటు రష్యాయందు స్త్రీలు తమ దేశపు ప్రజాహితజీవితమునందును, పరిశ్రమలయందును, వ్యవసాయవృత్తియందును సముచితకార్యనిర్వహణమునకై తగుతరిఫీయతును పొందుటలో గొప్ప అభివృద్ధి గాంచిరని అంగీకరింపక తీరదు.

కమ్యూనిస్టు పార్టీకి అనుబంధముగ స్త్రీల కొకకేంద్రసంఘముగలదు ఆకేంద్రసంఘమువారు నారుల హక్కులను పరిరక్షించుటలోనేమి, వానిని పెంపొందించుటలోనేమి మిక్కిలి శ్రద్ధకలిగియుందురు. నారుల క్షేమాభివృద్ధికరమగు విషయములను ప్రచురించుటకును, వారికి సంబంధించిన సమస్యలను చర్చించుటకును ఆ కేంద్రసంఘమువారు పలుపత్రికలను ప్రచురించుచున్నారు. 1933-వ సంవత్సరపు మార్చి ఎనిమిదవ తేదీని మాస్కోనగరమున జరుపబడిన అంతర్జాతీయ స్త్రీలదినముయొక్క ఇరువదియవ వార్షికోత్సవ సందర్భమున పంద్రెండుగురునారులకు ఆర్డర్ ఆఫ్ లెనిన్, పదునేడుగురు నారులకు ఆర్డర్ ఆఫ్ ది రెడ్ బ్యానర్ ఆఫ్ లేబర్

అను ప్రశంసలును ఈయబడెను 'రాబట్ నీటా' (ది వుమన్ వర్కర్) అను మాసపత్రికకుకూడ దిఆర్డర్ ఆఫ్ ది రెడ్ బ్యానర్ ఆఫ్ లేబర్ అను ప్రశంస ఒసంగబడెను.

గవర్నమెంటు ఉద్యోగములకు, వివిధ వృత్తులకు, వ్యాపారనిర్వహణమునకు తరబీయతు చేయుటయేగాక సోవియట్ ప్రభుత్వమువారు నారులకు సైనికశిక్షణముకూడ నిచ్చుచున్నారు. అయితే ఈ సైనికశిక్షణము నిర్బంధముకాదు, ఐచ్ఛికము మాత్రమే విశేషసంఖ్యస్త్రీలను ఈ సైనికశిక్షణము దిక్కునకు ఆకర్షించుటకుగాను ప్రభుత్వమువారు మంచి ప్రయత్న మొనరించుచున్నారు. స్త్రీలకొఱకైన సైనికశిక్షణశిబిరములయందు వారి శెలవుదినములను వెళ్లబుచ్చుటకు నారులను ప్రభుత్వమువారు ప్రోత్సహింతురు. ఆ శిబిరములయందు నారులకు మిలటరీ డ్రిల్లును, సైనికు లవలంబించు పద్ధతులయందలి యుక్తిప్రయుక్తులును నేర్పబడును. ఈ శిబిరములందుండుట కగు వ్యయము స్వల్పమాత్రము రెండు వారముల ఉనికికగు వ్యయమంతయు ఒక డోలరు, ఏబది సెంట్ల ధనముతో తుదముట్టును. ఈ శిబిరములందు యుద్ధవీరమునకు బీజావాపము జరుగును. ధనశక్తిని కొలుచు దేశములన్నియు సోవియట్ రష్యాపై ఎత్తివచ్చుటకు పన్నాగములు పన్నుచున్నవనుట పలుసారులు హెచ్చరింపబడుచుండును ఈ శిబిరములందు సైనికశిక్షను పూర్తిచేసికొనిన వారు తమగ్రామములకు తిరిగి వెళ్లిపోయిన తరువాత ఈవృత్తాంత మచటివారలకు నివేదించుచుందురు.

ఈపైన చెప్పిన విషయముల నన్నిటిని పర్యాలోచించి చూచువారికి బోల్షివిక్ ప్రభుత్వమువారి యాజమాన్యమున నారులు గ్రహించు విద్యఅంతయు జీవనోపాధికి మాత్రమే ఉపకరించునదియని తేటతెల్లమగును. ఉజ్వలాదర్శములు ఈ విద్యయందు లేవు. కళ, కవిత్వము మొదలగునవి వారి జీవితమున నే లేవు మన్న, ముద్ద అవిరెండే వారి మనస్సులందు ఎల్లవేళల తరళించుచుండును.

సోవియట్ నందు ప్రస్తుతము అమలునందున్న న్యాయముప్రకారము శిశువుపై తల్లిదండ్రులకంటె ప్రభుత్వమువారికే హెచ్చు హక్కుగలదు. చదువవేయనగు వయస్సు పొందుటకుపూర్వమే పిల్లలను ప్రభుత్వమువారు తమ అదుపాజ్ఞలక్రిందకు తెచ్చుకొందురు. ఏపిల్లలు ఎట్టివిద్య పొందవలయును అను విషయమై తుది నిర్ణయము ప్రభుత్వమువారియందే నిలిచియుండును.

1918-వ సంవత్సరపు రష్యాదేశపు వివాహస్మృతిప్రకారము వివాహమునకొక ప్రత్యేకపుతంతుఉండుట నిర్బంధమై యుండెను. కాని 1927-వ సంవత్సరమున వివాహస్మృతి మార్చబడెను వివాహమున కెట్టి ప్రత్యేకపు తంతును అవసరములేదు. రిజిష్టర్డు వివాహమెంత చట్టసమ్మతమైనదో 1927-వ సంవత్సరమునుండియు రిజిష్టర్డుకాని వివాహముకూడ అంత చట్టసమ్మతమైనదే. వివాహములు రిజిష్టరు చేయించుకొనుటవలన ప్రభుత్వమువారి పనిమాత్రము కొంత సుకరమగును ఈరిజిష్టర్డు వివాహపు దంపతులు అనంతరకాలమున విడివడుచో వారివారి పిల్లల పోషణమునకు ఒక్కొక్కరు ఎంతెంత సొమ్ము ఈయవలసియుండునో నిర్ణయించుటకు ప్రభుత్వమువారికి సులువగును. భార్యాభర్తలుగ రిజిష్టరుచేయించుకొనని దంపతులకు పుట్టిన సంతానముకూడ ఈ క్రొత్తవివాహస్మృతి ప్రకారము శాస్త్రసమ్మతమైనదే.

# ఇన్స్యూరెన్సు విషయములు

## ౯. జపాను దేశము : ఇన్స్యూరెన్సు విషయకవిద్య

"జపాను దేశస్థులు జీవితభీమాపద్ధతినిగ్రహించి ఎన్నియో సంవత్సరములు కాలేదు కాని దాని ప్రాముఖ్యమును గుర్తించుటలో వారు అమెరికావారికికూడ అగ్రసరులై యున్నారు- మనదేశపు విద్యావిధానమున చేర్పబడిన దానికంటె ఎన్నియో యధికాంగులు హెచ్చుగ జపాను దేశపువిద్యావిధానమున ఇన్స్యూరెన్సు విషయములు చేర్పబడియున్నవి. మనదేశపు వ్యాపారవిషయక పాఠశాలలయందును, కళాశాలలయందును, ఇన్స్యూరెన్సు విషయములు పఠనీయములుగ చేర్పబడుగాకయని నేను గాఢముగ కోరుచున్నాను. నేనీనడుమ గావించిన జపానుయాత్రలో అచ్చట పాఠశాలలలో ఇన్స్యూరెన్సువిషయములు బోధింపబడు పద్ధతిగాంచి అద్భుతానందములకు లోనైతిని" అని అమెరికాయందలి పెన్ సిల్ వేనియా విశ్వవిద్యాలయమునకుచెందిన డాక్టరు యస్. యస్. హ్యూబ్లైనర్ గారు వక్కాణించుచున్నారు జీవితభీమావ్యాపారాభివృద్ధియందు ప్రపంచమునందలి ఏదేశముగాని అమెరికాతో దొరయజాలదు అట్టి అమెరికాదేశమునకుచెందిన అధ్యాపకునిచే జపాను జీవితభీమావిషయమై ఇట్టి ప్రశంస అందినదానికి జపానుదేశము సంతయు అభినందింపవలసియున్నది. ఈవిషయమున జపాను అమెరికాకే ఆదర్శప్రాయమై యున్నదనగా ఇక మన ఇండియాసంగతి చెప్పనేల? జపాను ప్రభుత్వమువారు ఇన్స్యూరెన్సువిషయములను పాఠశాలలో బోధించుటకు తమముద్ర వైచియున్నారు. జపానునందలి విశ్వవిద్యాలయములును, కళాశాలలును ఇన్స్యూరెన్సు విషయములను నిర్బంధపఠనీయములుగ నొనర్చియున్నారు. కమ్మర్షియలు విషయములను బోధించు అన్ని ఉన్నతపాఠశాలలయందును ఇన్స్యూరెన్సు విషయకములగు పాఠములు నిర్బంధమొనర్పబడినవి. హిందూదేశమునందలి విశ్వవిద్యాలయములు తమదృష్టిని ఈవిషయముపై ఎప్పుడు బరపునో?

—The Indian Insurance.

---

**సుభాషితము**

**౧**

"భీమా జాతియందు ఐక్యానుబంధమును పుట్టించునట్లే నాగరికసంఘము అనుకట్టడమునకు పునాది యగుచున్నది. అంతర్జాతీయశాంతికి భీమా మంచి దోహదకారి."

—శ్రీ జార్జి సార్వభౌముడు

---

## ౧౦. హైందవకర్షకులు : జీవితభీమా.

హిందూదేశమున వ్యవసాయమే ముఖ్యవృత్తి అగుట హిందువులలో పలువురు పల్లెటిపట్టులందే నివసించుచున్నారు. పల్లెటిపట్టులలో బాగుగా కాన్వాసుచేయుటకు ఏజెంటు శ్రద్ధపెట్టుచో పట్టణములలోకంటె అచ్చట హెచ్చుభీమావ్యాపారము చేయవచ్చును. ఒక్కొక్క గ్రామమున జనసంఖ్య కొద్దిగనుండును. ఆకారణమున అచట ప్రతిఒక్కరినికలుసుకొని కాన్వాసింగుచేయుటకు అవకాశములు హెచ్చుగనుండును. గ్రామములందు సాధారణముగ ఒక కుటుంబముగాని ఒకవ్యక్తిగాని, ఇతరులకు మార్గదర్శియైయుండును. అట్టి కుటుంబముగాని, వ్యక్తిగాని జీవితభీమాయెడ సుముఖతచూపుచో ఇతరులును సుకరముగ దానియెడ సుముఖులు కాగలరు. అయితే గ్రామస్థులకు సహజముగనుండు క్రొత్తవానియెడభయము పోగొట్టుటకు

కడలేని ఓరిమి, విడువనిపట్టుదల ప్రారంభమున ఏజెంటు కడ హెచ్చుగనుండవలయును. వివిధములైన భీమా కంపెనీ ఏజెంట్లు తఱుచుగవచ్చుచు వారికి జీవితభీమా తత్వమును బోధించుచుండుటచే వారు జీవితభీమా యెడ సుముఖులు కాగలరు ఈ సుముఖత్వమును అంగుకొని కార్యము నడుపుకొని వచ్చుచో పట్టణములందు కంటె పల్లెటిపట్టులందు భీమాఏజెంట్లు హెచ్చు వ్యాపారమును చేయవచ్చును. పట్టణములందు ఒక్కరిచే భీమా చేయింప చేయుకేన్వాసింగులో వెచ్చించుకాలమును ఒక పీరిగ్రామమునందు వెచ్చించుచో పట్టణమునందు కంటె ఇచ్చట పదిరెట్లు ఎక్కువ వ్యాపారముసాగును. భీమాయొక్క లాభములను ఒక్క వ్యవసాయదారుడు గ్రహించినచో ఆతడు దాని విషయమై తన పొరుగువారితోడను, చుట్టములతోడను, సాటివారితోడను చెప్పి వారుకూడ తమ జీవితములను భీమాచేయునట్లు చేయగలడు ఒక క్లెయిమును భీమాకంపెనీ చెల్లించుచో గ్రామమున ఆ విషయము వెంటనే మంచి వెల్లడిలోకి వచ్చును. ఇరుగు పొరుగున నున్న వారీవిషయమునుగూర్చి వినుటతోడనే జీవితభీమాయొక్క లాభములను సులువుగనమ్ముదురు ఒక్కసారిగ అంత మొత్తము వచ్చుటవలన వారియందు గాఢమగు నమ్మక మేర్పడును. సాధారణముగ అచ్చటి వారికి ఇంటివైద్యుడుగనుండు గ్రామసీమలయందలి డాక్టరుయొక్క పలుకుబడి ఈవిషయమున కొంత కార్యకారిగనుండగలదు. ఆడాక్టరే భీమాకంపెనీ వారొప్పిన వైద్యపరీక్షకుడుగకూడ నుండుచో నాతనికుండు పలుకుబడినిబట్టి మంచివ్యాపారము సాగగలదు. అవసర సమయములయందు వ్యవసాయదారులకు అప్పులిచ్చుచుండు షావుకార్లు పలుకుబడికూడ ఈవిషయమున చాలకార్యకారిగనుండగలదు. పోలసీలను అమలునందు నిలిపియుంచుకొనుటకు నియమితదినమున ప్రీమియములను

సుభాషితము

౨

"జీవితభీమా వ్యాపారప్రపంచమున నైతికభావమును పెంపొందించును వ్యాపారమునకు స్థిరత్వమును కలిగించును. ప్రజాక్షేమమునకు ముఖ్యావసరములగు పొదుపు, కూడిక అనుగుణములు జీవితభీమావలననే పెంపొందును."

—శ్రీ థియోడర్ గూజువెల్టు.

కట్టవలసినదిగా పాతపోలసీహోల్డరులను తఱుచు కలయుచు వారి కావిషయము జ్ఞాపకము చేయుచుండవలయును. పంటకారుతీరి వ్యవసాయదారులచేతిలో డబ్బు బాగుగాఆడుచుండు కార్తితోడనే ప్రీమియము చెల్లించవలసిన దినముకూడ కలసివచ్చునట్లు చూడవలయును. నాలుగుమాసములకు, అర్ధవత్సరమునకు ప్రీమియము విభజించుటకంటె ఏడాదికి ఒకేసారి ప్రీమియము చేకొను పద్ధతి పల్లెటిపట్టులందు బాగుగా పనిచేయును. వ్యవసాయదారులలో పలువురు ప్రాయకముగా త్వరనిశ్చయమునకురారు. కావున పలువిధములగు పలుకుబడిని, నొప్పింపని ఒత్తిడినికలిగించుచు నెమ్మదిగ వారిని ఒప్పించుకొని రావలయును ఒకసారి ఏజెంటుపై గురికుదిరిన తరువాత నాతనిని ఏజెంటుగా గాక కేవలము స్నేహితునిగా చూతురు.

—The Indian Policyholders' Review.

౯. భీమా. ఆర్జనశక్తి.

'కనక్టికట్ మ్యూచ్యుయల్ లైఫ్' కంపెనీకిచెందిన జేమ్సులిలూమిస్ అనువారు రక్షణయను సామాన్యలాభముకంటె జీవిత భీమా వలని ఇతరమైన లాభములనుగూర్చి ఇట్లు చెప్పుచున్నారు: "వ్యాకులపాటునుండి కాపాడుటయే మానవునకు జీవితభీమా చేయు గొప్ప సేవ. వ్యాకులపాటు ఒకానొకవిధమైన భయము. అని చెప్పవచ్చును. ఈభయము మానవుని మనశ్శక్తుల పూర్తి విజృంభణమునకు గొప్పప్రతిబంధకము జీవితభీమాచే మానవుని మనశ్శక్తుల పూర్తివిజృంభణమునకు గొప్ప ప్రతిబంధకమగు ఈ వ్యాకులపాటు తొలగిపోవును. అందుచే ఆతని మనశ్శక్తుల పూర్తివిజృంభణమునకు వీలుకలుగుటతోబాటు ఆతని ఆర్జనశక్తియు పెంపొందును. భావిసుఖస్థితినిగూర్చి ఆందోళనపరిస్థితులలో పడియుండ నక్కరలేనిమనస్సు నిర్దిష్టకార్యనిర్వహణమున శక్తిమంతమైయుండును. వ్యాకులపాటుచే

మనశ్శక్తులు చెదరినవాడు క్రమముగా ఒకరోజులో, ఒకమాసములో, ఒకసంవత్సరములో చేయగలిగిన దానికంటె వ్యాకులపాటు పొంతపోవని మనశ్శక్తులు గలవాడు క్రమముగా ఒకరోజులో, ఒకమాసములో, ఒక సంవత్సరములో హెచ్చుపనిని చేయగలడు. ఎవడు తన కుటుంబమునకు జీవితభీమా అను రక్షణమునిచ్చుచున్నాడో ఆతడు తన్నుదా గౌరవముతో చూచుకొనగలడు. కుటుంబమునకిట్టి రక్షణమును కలిగింపజాలనివాడు తన్నుదా నిట్టి గౌరవముతో చూచుకొనజాలడు. జీవితమును భీమాచేసి తనకుటుంబమునకు తగిన రక్షణమును గల్పించినవాడు. ప్రపంచమున తలయెత్తి తిరుగగలడు, ప్రజాలోకమును తేరిచూడగలడు; తన సోదరమానవునికంటె తానేవిధముగను తీసిపోవనివాడని గ్రహించును బాధ్యతలను గుర్తించినవాడగుట భీమాచేసినవాడు గౌరవమును పొందుచున్నాడు; వ్యాపారమునందును, పరిశ్రమలయందును, వృత్తులయందును నిర్వాహకుడగుచున్నాడు. తనకుటుంబముయొక్క భావిసుఖమునకు తాను బాధ్యతవహింపవలసిన అవసరముకలదని గుర్తించినవాడనుటకు నిదర్శనముగా జీతమును భీమాచేసిన కారణమున ఆతడు తాను బాధ్యతయను భారమును మోయగలుగుటను నిరూపించుచున్నాడు.

— National Underwriter.

## ౨. స్త్రీలు : జీవితభీమా.

బైబిలునందు ఒకకథగలదు. ఇసుకమీద నొకటియు, రాతిమీదనొకటియు రెండుఇండ్లు కట్టబడినవి. కొంతకాలమునకు పిమ్మట వరదవచ్చినది ఇసుకమీద కట్టబడినయిల్లు కొట్టుకొనిపోయినది. రాతిమీద కట్టబడిన ఇల్లు వరదకు ఎదుర్కొని నిలచినది. కుటుంబముయొక్క నిలుకడకూడ నిట్లేయుండును. దానికిబలమైన ఆధారము స్థిరపడవలసియుండుచో అది జీవితభీమా అను పునాదిని కలిగియుండవలయును. జీవితభీమా అను పునాదిపై నిలచియుండు కుటుంబము మృత్యుప్రవాహముయొక్క ధాటికి తాళగలుగును. జీవితభీమా అను పునాదికి నోచిపుట్టని కుటుంబము పైనచెప్పిన ఇసుకమీద కట్టబడిన ఇంటివలెనే ప్రవాహమునకు కొట్టుకొనిపోవును. కావున గృహరాజ్ఞియగు స్త్రీ కుటుంబముయొక్క స్థిరత్వమునకు జీవితభీమాచే తగుమైనఏర్పాటులు గావించుటకు ఎంతమాత్రమును ఏమఱరాదు. జీవితభీమావలని గనమే లభించనిచో ఒక్కొక్క పరిస్థితులలో పచ్చముపాడై యుండగల కుటుంబముల చరిత్రలు అసంఖ్యాకములుగ గలవు. తమజీవితమునకై ఇతరులపై ఆధారపడ నక్కఱలేకుండ జీవితభీమా ఒసంగు వార్షికమువలనగాని, పింఛనువలనగాని, లేక పూర్తి మొత్తమువలనగాని స్వతంత్రముగా జీవింపగలిగియుండుచో హిందూవితంతువులస్థితి ఇప్పటంత విషాదకరముగా నుండజాలదు స్త్రీల ఆర్థికసాంఘికాభివృద్ధుల విషయమై కష్టించు దేశనాయకులు దేశమున జీవితభీమాతత్త్వము బాగుగా వ్యాప్తినందుచో నేటి మన మాతృశ్రీలయు, సోదరీమణులయు ఆర్థికపరాధీనత చాలవరకు తొలగిపోవునని గుర్తింపగలరు. పలువురు పేదవితంతువుల నైతికపతనమునకు కారణము వారి ఆర్థికపరాధీనతయే యని మనము నొక్కి చెప్పవచ్చును. కామాతురుడగు పురుషుని కాసులకై ఆ పేదవితంతువులయందు ప్రలోభము పుట్టుటవింతగాదు. జీవితభీమాయొక్క ఆవశ్యకత ఎంతవఱకుగలదో దీనివలన బోధపడగలదు. కూలిచేసుకొనువాడు హఠాత్తుగ చనిపోవుచు గంపెడుపిల్లలతో నిరాధారయైన వితంతువును సంఘమున విడనాడుచుండుట తఱుచు జరుగు సంఘటనవే. జీవితభీమా రూపమున ఆధారము కల్పింపబడియుండుచో ఆవితంతువు జీవిత మెంతసుఖకరమగును! నా స్వానుభవముచే

సుభాషితము

౩

"కాలవశమున కలుగు ధనసష్టములకు తట్టుకొనుటకై స్త్రీపురుషులకు జీవిత భీమా చక్కని అవకాశము కలిగించుచున్నది. అదియునుగాక జీవితభీమా ధనమును కూడబెట్టుటకును, పెట్టుబడిపెట్టుటకును అనువైనమార్గముగుచున్నది."

— శ్రీ హెర్ బర్టు హూవర్.

జీవితభీమా స్త్రీకి ఎంత అవసరమైనదో నేను కనుగొంటిని. దయామయుడును, ఇప్పుడు కీర్తిశేషుడును నగు నా భర్త తనకుగల కొలదిలోనే జీవితభీమాచేసియుండెను ఆజీవితభీమాలేకుండినచో నేటి నాస్థితి ఎట్లుండునో అని తలచుకొనినప్పుడెల్ల నాగుండెలు జలదరించుచుండును. కొలదికాలముక్రిందు పూర్వమువలెను పలుజీవితభీమా కంపెనీలు స్త్రీల జీవితములను భీమాచేయ నంగీకరించవు. ఇప్పుడు కొన్నికంపెనీలు స్త్రీల జీవితములనుకూడ భీమాచేయ నంగీకరించినది సంతోషకరవిషయము. చేతిలో ఏమాత్రము ధనము కలిగియున్న స్త్రీయైనను ఈ శుభావకాశమునుపై కొని వెంటనే తనజీవితములను భీమాచేసి కొనవలసియుండునని హెచ్చరించుచున్నాను. పెట్టుబడులలో ఉత్తమమైనది, లాభకరమైనది జీవితభీమాయే అట్టి పెట్టుబడికి స్త్రీల కవకాశము దొరకినది గావున హారీనదవకాశమును పూర్తిగ వినియోగించుకొనగలరని నమ్ముచున్నాను. హిందూదేశమున స్త్రీల వెనుకబాటునకు ముఖ్యహేతువు వారి ఆర్థిక పరాధీనతయే. కొన్ని ప్రత్యేకపు రకముల జీవితభీమాలను చేకొనుటచేతను, నిర్ణీతకాలమున ధనమును పొందగలుగు పద్ధతిని చేకొనుటచేతను స్త్రీల ఆర్థికపరాధీనతను తొలగింపవచ్చును. జీవితభీమావ్యాపారము వృత్తిగాగొనుటకుకూడ స్త్రీల కెంతయు అనువైనది. చేత పైసాలేని పేదరాండ్రుకూడ జీవితభీమాఏజెంటువృత్తి నవలంబింపవచ్చును. ఎట్టి మూలధనముగాని వారికీవృత్తి నవలంబించుటలో నక్కరలేదు. ముఖ్యముగ కావలసినవి ఎదుటివారిని వశీకరించుకొనగలవాక్కు, మృదువర్తనమును. ఏమాత్రము చదువుకొనినను స్త్రీకడ ఈ గుణము లుండితీరును. జీవితభీమావృత్తి కేవలవ్యాపారమేకాదు. అది సాటిలేని సంఘసేవయు అగుచున్నది. జీవితభీమాను వృత్తిగాగొనినవారు ఆశాజ్యోతిని ప్రసాదించు ప్రవక్తలనియు, పేదవారిని ఆర్థికనాశనమునుండి కాపాడు దేవతలనియు గ్రహింపవలసియున్నది. ఇది ఒక్కవ్యక్తికేగాక అతని పరిసరమునకుగూడ శాంతిని, ఆనందమును కొనితేగల దివ్యదూత. జీవితభీమా కాన్వాసింగు వృత్తికి విశేషకాయకష్టమవసరములేదు. అగుట స్త్రీలకిది ప్రత్యేకముగా అనుసరింపదగిన వృత్తియని చెప్పనక్కరలేదు. విశేషకాయకష్టములేకనే బయటతిరుగుచు పౌరసత్వపు బాధ్యతను నిర్వహించుటకు స్త్రీకి అవకాశము కలిగించువృత్తి ఇది యొక్కటియే. పనిలేక వృధాకాలక్షేపము చేయు మధ్యమతరగతి కుటుంబములలోని స్త్రీలు నిస్సందేహముగ ఈవృత్తి నవలంబించి తమకుటుంబము గొప్ప ఆర్థికసౌష్ఠవమునకు తోడ్పడగలుగునట్లు చూడవలసియున్నది జీవితభీమా వ్యయశీలతను పోగొట్టును బాధ్యతగుర్తింపజాలని పేదవారినుండి సయితము చిన్నచిన్న మొత్తములను కూడగట్టి పెద్దధనరాశినికూర్చి భీమాసంస్థలు జాతియొక్క ధనసంపదను పెంపొందించుచు దేశమునందు పెద్దపెద్ద పరిశ్రమాగారముల నిర్మాణమునకు దోహదమొనర్చుచున్నవి జీవితభీమా పొదుపుయను గుణమును పెంపొందించును, ఆత్మగౌరవమును పెంచును, జీవనముయొక్క అంతస్థును హెచ్చించును. భూలోకముననే స్వర్గమును కల్పించవలయునను మానవుని చిరకాలకాంక్షితమగు ఆదర్శమును కొంతవఱకైన నెఱవేర్చగలుగుటకు మానవునకు తోడుపడునది జీవితభీమాయొక్కటియే మంచి సాధనమై యున్నదనుట సత్యము. కావున భారతదేశపు స్త్రీలీవిషయమై శ్రద్ధపెట్టుదురుగాక!

(శ్రీమతి ప్రియంవదాదేవి బి. ఏ.)


—Mrs. Priyamvada Devi, B. A.
(Insurance World.)

### సుభాషితము

**౪**

"కొంతధనమును కూడబెట్టుటకు శక్తి కలిగియుండియు తన కుటుంబమునకు ఎట్టి ఆస్తియు కల్పింపక చనిపోవుట గొప్ప అధర్మమని నానిశ్చితాభిప్రాయము. సులభముగా కుటుంబమునకు ఆస్తిని కల్పించుటకు జీవితభీమాను మించినమార్గము మఱియొకటి లేదు"

—రివరెండు ఇ. జి. గాజ్.




# కాశీనగరమునందలి యాంధ్రులు

భారతదేశమునఁ బ్రధానవిద్యాపీఠముగు కాశీనగరము విజ్ఞాననిలయమగుట సర్వజన వేద్యము మనయాంధ్రులు వారాణసికి వలసపోవుటకుఁ గల ప్రధానకారణము విజ్ఞానార్జనమేయని చెప్పవలసియున్నది. నేఁడును చాలమంది యాంధ్రవిద్యార్థులు వారాణసీ హిందూవిశ్వవిద్యాలయమున విద్యనభ్యసించుచున్నారు. మనదేశమునఁగల సుప్రసిద్ధసంస్కృతపండితులలోఁ జాలమంది కాశీనగరమునందే విద్యనభ్యసించియున్నారు. కొందఱాంధ్రులు క్షేత్రపురోహితవృత్తి నవలంబించియు, మఱికొందఱుద్యోగధర్మమునను కాశీనగరమున నివసించుచున్నారు. అటకు జీవనముకొఱకు వలసపోయినవారిసంఖ్య తక్కువయనియు, విద్యకొఱకు వలసపోయినవారి సంఖ్యయే యధికమనియు మాత్రము చెప్పవలెను.

వలసపోవుటకుఁ కారణములు.

ఆంధ్రులు వారాణసి కెపుడు వలసపోయినదియు నిశ్చయముగఁ జెప్పనవకాశము లేదు. విద్యాసంపాదనార్థము కొన్ని సంవత్సరము లచట నివసించిన వారినిగూడ రాష్ట్రేతరాంధ్రులలో లెక్కించినచో ననేకవందల సంవత్సరములక్రిందనే యానగరమాంధ్రనివాసస్థానమైనదని చెప్పవచ్చును. కొందఱు మహాత్ములు విద్యాసంపాదనార్థమై యచటకేఁగి యచటనే సుప్రతిష్ఠితులైనవారుగనుగలరు. అందు మానవల్లివారి కుటుంబము గణనీయమై యున్నది. శ్రీ గంగాధర శాస్త్రి మొదలగువారు జగదేకపండితులని కీర్తిగాంచిరి. వారివంశజులును ప్రసిద్ధపండితులై వందలకొలది వేతనముల గ్రహించుచుఁ గళాశాలలలో గీర్వాణవిద్యఁగఱపుచున్నారు. వారి కుటుంబము కాశీనివాసమేర్పఱచుకొని నూఱుసంవత్సరములకుఁ బైగానయ్యెనని తెలుపుటకు తద్వంశీయులు మాతృభాషయగు నాంధ్రభాషను మఱచిపోవుటయే నిదర్శనము. క్షేత్రపురోహితులుగ నున్నవారిలోఁ జాలమందిమాత్రము చాలసంవత్సరములక్రిందటనే యచట స్థిరులైనను, ఆంధ్రభాషను మఱువకయేయున్నారు. అందులకుఁగల కారణము వారికాంధ్రులతోఁ దఱచుగఁ బరిచయము, సంబంధము కలిగియుండుటయే గావచ్చును.

ఆంధ్రులెపుడు వలసపోయిరి.

కాశీనివాసులగు నాంధ్రులవృత్తింగూర్చి యిదివఱకే వివరింపఁబడినది. విశ్వవిద్యాలయమునఁ గొంద ఱుపాధ్యాయులుగనున్నారు. రమారమి మూఁడువందలమంది విద్యార్థులు కాశీ హిందూవిశ్వవిద్యాలయమున చదువుకొనుచున్నారు. శ్రీ విజయనగరప్రభువుల కాశీసంస్థానమునఁ గొందఱుద్యోగులుగను, కొందఱు తీర్థపురోహితులుగను ఉన్నారు. కొందఱు, విద్వాంసులు కొన్నిమఠముల యాధిపత్యమును నిర్వహించుచున్నారు.

వృత్తి

వారాణసీనగరమునందు స్థిరనివాసము గల యాంధ్రులసంఖ్య చాల తక్కువయగుటచే బహుళజనసాధ్యమగు సంఘసంస్కరణము మొదలగు విషయములలో వారేరీతిని అభివృద్ధినిజూప నవకాశము లేకపోయినది కాని ప్రధానములగు కొన్నివిషయములందు మాత్రము మనవారు వెనుదీయలేదు. అచట స్థిరనివాసము నేర్పఱచుకొనిన యాంధ్రు లాంధ్రేతరులగు మహారాష్ట్రులతోడను, కర్ణాటకులతోడను సంబంధబాంధవ్యములను జరుపుకొనుచున్నారు. కావున వారు శాఖాంతర వివాహములనేగాక అనాంధ్రులతోడి వివాహముల నామోదించుచున్నారని చెప్పవలెను ఈయంశముమాత్ర మంత బహిరంగముకాదు. అట్లని యుపేక్షణీయమును గాదు విశ్వవిద్యాలయమునందలి యాంధ్ర విద్యార్థులు తక్కినవారి రీతినే యస్పృశ్యతాబహిష్కరణమునఁ బ్రచారమొనర్చుచున్నారు. మఱియు నచటి మనవారు దేశీయాంధ్రులరీతిని, (ఆంధ్రబ్రాహ్మణులరీతిని) భోజనాదిసమయములందు దృష్టిదోషమును పాటింపక, వంగీయులు మొదలగువారిరీతిని సర్వసమత నవలంబించియున్నారు

**సంఘ సంస్కరణము.**

కాశీనగరమునం దాంధ్రసంఘము లేమియును లేవు: కాని విశ్వవిద్యాలయమునందలి యాంధ్రవిద్యార్థులు మాత్రము తక్కిన భారతీయ విద్యార్థులవలెనే సంఘమును స్థాపించియున్నారు. ఆంధ్రసంఘముయొక్క సభలు విశ్వవిద్యాలయమునందే పనిచేయుచున్న శ్రీ దర్భా సుబ్రహ్మణ్యముపంతులు ఎమ్. ఏ గారియొక్కయుఁ, దక్కుంగల యాంధ్రులయొక్కయు నాధిపత్యమున జరుగుచున్నవి వాఙ్మయము, నాటకకళ—సంఘజీవనము మొదలగు విషయము లీ సంఘపక్షమునఁ బుగోఽభివృద్ధిఁగాంచుచున్నవి. ఆంధ్రవిద్యార్థులు ప్రదర్శించిన నాటకములు తక్కిన భారతీయుల నాటకములకంటె మిక్కిలి ప్రశంసాపాత్రములుగనున్నవని యాంధ్రేతరులే పొగడుచున్నారు. పదునైదు దినములకొకసారి జరుగు ప్రతిసభయందును ఆంధ్రాంగ్లసారస్వతవిషయములు విమర్శింపఁబడుచుండును. నగరమునందలి యాంధ్రులు ప్రత్యేకసంఘమును గలిగియుండక పోయినను, ''దక్షిణభారతసంఘము''నందు వారికుచితమగు స్థానముకలదు ఆసంఘముయొక్క గ్రంథాలయమునందుఁ గొన్ని యాంధ్రగ్రంథములుకలవు

**సంఘములు.**

వారణాసీనగరమునందు నివసించునాంధ్రులయెడ స్థానికభారతీయులకు గౌరవమధికము. ఇట్టి గౌరవమును ఆంధ్రుల కార్జించిన అచటి సుప్రసిద్ధాంధ్రులఁ గొందఱి నిచట పేర్కొనుట అప్రస్తుతముగాదు శ్రీ విజయనగరప్రభువుల రాజ్యకార్యములను నిర్వహించువారును, దివాన్‌జీలునగు శ్రీ మద్దిరాల గోపాలరావుపంతులుగారును, ప్రధాన లేఖలగు శ్రీ పులిగెడ్డ సుబ్బారావుపంతులుగారును, యతిప్రవరులలో శ్రీ బ్రహ్మానందస్వామిగారును, పండితులలో శ్రీ మానవల్లి గంగాధరశాస్త్రులవారి పుత్రులును, శ్రీ సీతారామస్వామిశాస్త్రులుగారును, శ్రీ వేంకటశాస్త్రులుగారును గణనీయులు. విశ్వవిద్యాలయోద్యోగులలో గ్రంథభాండాగారోపాధ్యక్షులు శ్రీ దర్భా సుబ్రహ్మణ్యం, ఎం ఏ గారును, అసహాయోద్యమప్రచారకులైన శ్రీ స్వామి నమశ్శివాయగారును పేర్కొనదగినవారు.

**ఆంధ్రప్రముఖులు**

— బులుసు వేంకటరమణయ్య.

# ఆరోగ్యవిజ్ఞానము

## ౬ చర్మము, దాని రక్షణము

కాంతివంతమైనచర్మము లావణ్యప్రదాయిని మాత్రమే కాదు శరీరమునందలి సర్వాంగకములును దుస్థితియందున్నవనుటకు చక్కనిసూచన. కండరనులు, ఎముకలు సరియైనస్థితిలో లేనిచో; శరీరమునందలి వివిధములైన అంగకములు వానివానికి విధ్యుక్తములైన పనులను సరిగా నిర్వహింపకుండుచో కాంతిహీనములగు నేత్రములు, చెంగలువరంగు గల చెంపలు అను బావుటాలు మానవశరీరమను కోటపైని ఎగురజాలవు. మనచర్మము కేవలము అలంకారముకొఱకే గాదు. తుదకు అది ప్రధానముగా అలంకారముకొఱకే అని చెప్పుటకును వీలులేదు. చర్మము శరీరమున ఒక ప్రత్యేకాంగకము. దానికి విధ్యుక్తమైన ధర్మము గలదు. జాతిపారంపర్యమును నిలుపుట యను తన కార్యముకొఱకు స్త్రీపురుషులకు యౌవనకాలమున ప్రకృతి ప్రసాదించు లావణ్యసామగ్రులలో కాంతివంతమైనచర్మము ప్రధానమైనదైనను బాగుగా కనుపించుట అనునది దొక్కటియే చర్మముయొక్క ధర్మము గాదు. శరీరమునందలి మలిన పదార్థములను తొలగించివేయు అంగములలో నిదియొకటి. ఈత్వగింద్రియముచే గ్రహింపగల గుణము స్పర్శము. దానికి గల స్పర్శజ్ఞానముచేతను, శీతోష్ణముల అనుభవభావముచేతను వాతావరణమున మన శరీరములను యథాస్థితియందు నిలుపు ప్రధానకార్యమును అది యొనరించుచున్నది. ఇట్టి పెక్కు కారణములచే చర్మమును జాగ్రత్తగ పరిరక్షించుకొనుట మనవిధి యగుచున్నది. కాని ఈవిధిని మనము జాగ్రత్తగ నిర్వహించుచుంటి మనుటకుమాత్రము వీలుచాలదు. పలువురు చర్మముయొక్క జాగ్రత్త విషయమున ఎట్టి శ్రద్ధను తీసికొనకున్నారు. ధారాళమైన పరిశుభ్రవాయువును పొందుట చిరకాలానుభవమైన దాని వాక్కు అనియు, బాగుగ పనిచేయుటకు ఇతర శరీరాంగముల వలె నదియు లెస్సగ పరిశ్రమకు లోనుపడవలయుననియు పలువురు మఱచిపోవుచున్నారు. ముఖ్యముగా చెమటపట్టునట్లు దేహపరిశ్రమచేయుటయే చర్మమునకు తగినపరిశ్రమ కల్గించుపద్ధతులలో ఉత్తమమైనది కాని త్వరజీవనులమగు మనకు ఇట్టి దేహపరిశ్రమకు సరియైనకాలము నిత్యక్రమమునదొరకుట బహుకష్టము. కావున ప్రతిఉదయమున శీతలజలస్నానము చేసిన వెంటనే చర్మమును వెట్టపుట్టునటుల బాగుగా నొక్కి రాచుకొనవలెను. చన్నీళ్ళలో స్నానముచేయుటకు అలవాటులేనివారుగాని, పడనివారుగాని వేడినీళ్ళలో స్నానముచేసిన తరువాత ఒడలు బాగుగా తుడుచుకొని విసురుగా గాలివచ్చునట్లు కిటికిటికీతలుపులు తెఱచుకొని శరీరమంతయు గాలిప్రసరించునట్లు చేసికొనవలయును. పిమ్మట ఒక ముతకతువ్వాలుతో శరీరమంతయునొక్కి రాచుకొనవలయును. ముఖమునుతఱచుచు కడుగుకొనుచుండుట మంచిది సాధారణముగ సబ్బు, నీళ్ళు మంచివే. పెసరపిండి, నీళ్ళు ఉత్తమము కొందఱి మొగములు సబ్బువాడుకచే పెళుసుబాఱును. పెసరపిండివలన అట్టి చెడుపులుండవు సరికదా చర్మమునకు నునుపు, కాంతి కలుగును. ఎల్లప్పుడు చెమురుగక్కుచుండు మొగములుగలవారు నీటిలో కొంచెము ద్రావకము కలుపుకొని మొగము కడుగుకొనుచో మంచిపనిచేయును. కాని కాంతివంతమైన చర్మమును కలిగియుండు రహస్యమంతయు ఇట్టి బాహ్యక్రియలకంటె శరీరములోపలి శుచినిబట్టియే యుండుననుట మఱువరాదు. పరిశుభ్రమైనగాలి, నిత్యక్రమమైన దేహపరిశ్రమ, మితమైన భోజనము ఇవి మానవుని చర్మముయొక్క సౌందర్య

మును పెంపొందించు పరమహంసక్రియలు. వీటియన్నిటికంటెను ఉదయమున లేచుటతోడనే నిత్యము శీతల జలపానముచేయుట చర్మముయొక్క లావణ్యమును, ముఖముయొక్క వర్చస్సును పెంపొందించుటలో సమర్థమైనది. యౌవనప్రాదుర్భావకాలమున గలుగు పిటకలు ఈశీతలజలపానమువలన నివారణయగును.

### ౮. పరుండునపుడు గమనింపదగు మెలకువలు

అలసిపోయినట్లు ఏలయగుపడెదవు? ఆరోగ్యానందమును తిరిగిపొందగలవు. అట్లుపొందుటకు ప్రథమసాధనము నీ మనస్సును కలతపెట్టుచున్న భావములను ముఖముపై ప్రతిబింబింప చేయకుండుటయే. నీముఖమును మందహాసమునకు నివాసమందిరము గావింపుము. గాఢమైననిద్ర, సకాలభోజనము, పరిశుభ్రమైనగాలి, క్రమమైన దేహపరిశ్రమ కలిగియుండునట్లు చూచుకొంటివేని జీవితమున నూత్నరుచి, బ్రతుకునందు క్రొత్తఅభిలాష కలుగును. సుందరమైన చూపులు, సుఖము, ఆరోగ్యము గాఢనిద్రవలననే కలుగును. మానవునకుండవలసిన యంత నిద్రలేనివాడు చిరుబుస్సులకు, అశాంతికి తావలమైయుండును; ముదిరూపము, ఉబ్బుకన్నులు కలిగి వాడు ఎల్లవేళల అలసటచెందియుండునట్లు కనిపించును. నిద్రించునపుడు ఒకడు పరుండియుండు పద్ధతిమీదనే అతని ఆరోగ్యము, చూపులలోని సౌందర్యము, శిరముయొక్క సమస్థితి ఆధారపడియుండును. మానవునకు సాధారణముగ రోజుకు ఎనిమిదిగంటల నిద్ర ఆవశ్యకమైయుండును. ఈ ఎనిమిదిగంటలసేపు గాఢముగ నిద్రించువ్యక్తి నిద్రలో ఒకటి రెండుసారులుమాత్రమే ఒత్తిగిలును. కాబట్టి నాలుగైదుగంటలు శిరము మొదలైన శరీరావయవములు ఒకేస్థితిలో నుండుచుండునన్నమాట. ఏస్థితిలో ఆనాలుగైదుగంటలుండుచుండునో అదేస్థితిలో ఇతరకాలములందుకూడ ఆ అవయవములుండుట కెక్కువ అవకాశముకలదనుట నిక్కము. కండరములు అదేస్థితిలోనుండుటకు అలవడును. సాధారణముగ పలువురు చెంపకింద నొకచేయిపెట్టుకొని నిద్రించుచుందురు. ఈకారణమున వారిచెంపలు అకాలముననే ముడతలుపడి ముఖముయొక్క అందమును చెఱచుచున్నవి. తలక్రింద మిక్కిలి ఎత్తైన తలగడపెట్టుకొనుటచే భుజములయందు వంపు ఏర్పడుట అసంభవముకాదు. ఎత్తైన తలగడపెట్టుకొని నిద్రించునంతకాలమును వెలకిలబరుండుటకు అలవాటుపడినవారు పగలు తమతలను సమస్థితిలో నిలుపుకొనియుండజాలరు. మఱి ఇక ఎత్తయిన తలగడపెట్టుకొని ఒత్తిగిలి పరుండువారి మెడనరములకు చెఱుపుకలుగును. తలగడపై వ్రాసియున్న వైపు మెడనరములు పొడుగుగ సాగును, హెచ్చునలుగుపాటునొందును. రెండవవైపు మెడనరములు సంకుచితమగును. దీనివలన తల ఒకప్రక్కకు కొంచము వాలును. చలికాలమున ముచ్చుముడిగి పండుకొను పద్ధతి తెగడదగినది. సాధ్యమగునంతవఱకు కుడిప్రక్కకు తిరిగి పండుకొనుటకు ప్రయత్నించుచుండవలయును. కాళ్ళు, వెన్నెముక ఎంతసాపుగ చాచుకొనియుండిన అంతమంచిది. ధారాళముగ రక్తము ప్రవహించుటయును అందువలన మంచిపీలు ఏర్పడును. ఒత్తిగిలి పరుండునపుడు క్రిందివైపునుండు చేతిని సుఖకరమైన పద్ధతిని మలచుకొనవచ్చును. అయితే అది మొగమునకు ఎంతమాత్రమును అడ్డురాకుండునటుల చూచుకొనవలయును. ఎగుభాగమున నుండుచేయి శరీరముపై సాపుగా చాచుకొననగును. విస్తారము ఎత్తులేక నునుమెత్తగనుండు తలగడపై భుజములతో సమస్థితియందుంచుపాటి ఎత్తున తలను పెట్టుకొని నిద్రించుచుండవలయును. పక్క సరియైనస్థితిలో నుండునట్లు చూచుకొనవలయును. ఉండలుండలు కట్టినపఱుపుపై గాని గాలిరానిగదిలో గాని గాఢమైనది మరియు ఆరోగ్యకరమైనదియు నగు నిద్రను పొందదలచుట వ్యర్థము. పడకగదిలో ఆగదియొక్క ఉపయోగమును, సౌఖ్యమును హెచ్చించువస్తువులనుమాత్రమే ఉంచవలయును. ధూళినికూర్చునవి, రోగకారకక్రిములనుచేర్చునవియగు వస్తువులను పడకగదిలో ఎంతమాత్రమును ఉండనీయరాదు. కిటికీనుండి ధారాళముగ గాలివచ్చు స్థలమున పడక ఉండుటచే నిద్రించుసమయమున కావలసినగాలి లభించుచుండును. ఉదయభానుని కిరణములు సూటిగా మొగముపై బడునరీతినిమాత్రము పడక ఎప్పుడును ఏర్పాటుచేసికొనరాదు. ఈ మెలుకువలను జాగ్రత్తగ గమనించువారికి సుఖమగు గాఢనిద్ర లభించును.



[గుంటూరుమండల కేంద్రగ్రంథాలయమగు వేటపాలెమునందలి సారస్వతనికేతనసంస్థాపనాచార్యులును; గుంటూరుమండలగ్రంథాలయసంఘాధ్యక్షు మహాశయులును అగు శ్రీఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠిగారి ఈవ్యాసము ఆంధ్రదేశగ్రంథాలయోద్యమాభిమానులెల్ల చదువదగినది.......సంపాదకుడు.]

## గ్రంథాలయోద్యమము

# గ్రంథాలయములు

పేరువలననే గ్రంథాలయములు ఆలయకోటిలో చేర్పదగినవని తెల్లమగుచున్నది. ఆలయములన ఆంధ్రులకేగాక భారతీయులెల్లర కెంత గౌరవప్రదములో, యెంతటి పవిత్రములో పాఠకులకుయెరుకయే. మన దేశీయులకు బహుప్రాచీనకాలమునుండియు నేటిదనుక గుళ్లు, గోపురములు కట్టించుటయనినను; వాపీకూపతటాకాదులను త్రవ్వించుట యనినను; సత్రములు, రామానుజకూటములు, యాగశాలలాదిగాగలవానిని నిర్మించుటయనినను, మిక్కిలి యానందకరములైన కార్యములు.

ప్రాచీనకాలమున ప్రతిదేవాలయాంతర్భాగమున గ్రంథాలయశాఖయు లీనమైయుండుటచే గ్రంథాలయముల కొకానొకప్పుడు ప్రత్యేకత్వము కానరాకుండెను. దేవాలయనిర్మాణములోనే గ్రంథాలయనిర్మాణము, దేవాలయపోషణయందే గ్రంథాలయ పోషణయు అవినాభావసంబంధముగలిగి జరుగుచుండెడివి. అందుచే ప్రతిదేవాలయము లేక ప్రతిగ్రంథాలయము భుక్తి, భక్తి, ముక్తిదాయకమై, విజ్ఞాననిలయములై విలసిల్లుచుండెడివి. పరదేశరాజుల దండయాత్రల సందర్భమున జరిగిన బహువిషాదకరములగు దేవాలయాదుల దోపిడులలో అందుండు గ్రంథసముదాయములెల్ల. నిర్మూలింపబడినవి పోగా, కొఱవడినవి పరదేశములకు కొంపోబడెను. ఆకారణమున భారతవిజ్ఞానకోశమంతయు విదేశములపాలైనది. భారతవిజ్ఞానమునకు జన్మదేశమున కరవువాటిల్లినది కరవేల పూర్తిగా నశింపే కలిగినది.

తదాది నిర్మింపబడినట్టిగాని, పునరుద్ధరింపబడినట్టిగాని దేవాలయములు గ్రంథాలయరహితములై, విజ్ఞానమును వెదజల్ల గలిగినవిగాక, కేవలము శిలావిగ్రహశాలలుగా మాత్రము రాణించుచున్నవి. భారతీయులు రిక్తభక్తిపారవశ్యముచేత అనేక దేవాలయములను నిర్మించుచుండుట గాంచుచున్నారము గాని యేకారణముననో గ్రంథాలయముల నిర్మాణమునకు గడంగరైరి. గ్రంథాలయములు వీరి దృష్టిపథమునుండి దూరములైనవి, గ్రంథాలయము లనిన సామాన్యభారతీయులు మరచిరనవచ్చును. ఆకారణమున భారతవాఙ్మయము చాలభాగము క్షీణించినది. భారతవిజ్ఞానము కృశిం

చినది. భారతదేశైశ్వర్యము ముడిగినది పరిశ్రమలు పాడైనవి పంటలడుగంటినవి మానవుల తెలివితేటలు తగ్గినవి. దాస్యమునకు తావుదొరికినది పరాధీనత ప్రబలినది సర్వారిష్టము లావరించినవి.

విదేశీయులు తమకు లభించిన గ్రంధకోశము నండగాగొని, తమబుద్ధికుశలత విజృంభించిన కొలది తమ వాఙ్మయమును, తమ విజ్ఞానమును పెంపొందింప జేసికొని తమ దేశములలో గ్రంథాలయోద్యమమునకు ప్రత్యేకముగ ప్రధానస్థాన మొసంగి తోడి దేశములలో సగ్రస్థానముల నధిష్ఠించి సమస్తశాస్త్రవిద్యాపారంగతులై వెలలేని సిరిసంపదలతో తులదూగుచున్నారు. విదేశముల వైభవమంతయు యేబది లేక నూరు వత్సరముల కిటీవల దేననియు, అంతయు గ్రంథాలయోద్యమము వలననే వృద్ధిపొందిన దనియు, దాని యభివృద్ధిమీదనే ఆధారపడి యున్నదనియు చరిత్రలవలన మనము సత్యము గ్రహింపగలుగుచున్నారము.

ఒకానొకప్పుడు భారతవర్షము వివిధవిదేశములకు గురుపీఠముగానుండి, నేడు వాఙ్మయమునందేమి, విజ్ఞానసంపదయందేమి, ఆర్థికవిషయములందేమి, పాడిపంటలయందేమి, పరిశ్రమలయందేమి, సర్వవిషయములయందును వెనుకజిక్కియున్నందుకు మనము తప్పక సిగ్గుజెందవలసియున్నది.

అన్నిటికిని మూలకారణమైన, సమస్తమునకు మూలాధారమైన గ్రంథాలయోద్యమమును మరల భారతదేశమున నూతనమార్గముల పునరుద్ధరింపనెంచి కొందరు బుద్ధిమంతులు కృషిచేయ నారంభించిరి తదాది భారతవాఙ్మయము క్రమశః యభివృద్ధిజెందుచున్నది. విజ్ఞానము వృద్ధిగాంచుచున్నది. పండితులు, కవీశ్వరులు, పరిశోధకులు, శాస్త్రకారులు, చరిత్రకారులు, జ్యోతిష్కులు, సిద్ధాంతులు బయలుదేరుచున్నారు. గ్రంథముల వ్రాయుచున్నారు. కాని విదేశీయవాఙ్మయమునకు దాసులము కాక తప్పుటలేదు. విజాతీయభావము లమితముగ గ్రంథములలో నింపబడుచున్నవి. ఆ అన్యదేశగ్రంథముల నాశ్రయింపు తగ్గిననేగాని జాతీయమయిన స్వతంత్రవాఙ్మయము వృద్ధిజెంది మనదేశస్వభావములు, సంప్రదాయములు మొదలుగాగలవి గ్రంథములలో నెక్కవు శైశవావస్థ దాటవలయునుగదా.

బరోడారాష్ట్రీయ ఆ రాష్ట్రమునందు గ్రంథాలయోద్యమవ్యాప్తికి ప్రత్యేకస్థాన మొసంగి, విరివిగ ధనమొసంగి, ప్రత్యేకశాఖ నొకదానిని నిర్మించి తోడ్పడిన కతమున బరోడాదేశము తత్ఫలితములు ముందుగా అనుభవింపగలుగుచున్నది బరోడా ప్రభువు యీయుద్యమమునకు ప్రత్యేక గణ్యతనొసంగి తనప్రజలయొక్క విజ్ఞానాభ్యుదయమునకు తోడ్పడినందులకు మిగుల వందనపాత్రుడు. తనరాష్ట్రమునకు తాను సర్వస్వతంత్రాధికారియగుట తానీయుద్యమమునకు ప్రత్యేకస్థాన మొసంగగలిగె.

ఆంధ్రదేశమున సైతము 1890 సంవత్సరప్రాంతమున ఆధునికగ్రంథాలయోద్యమము మొలకరించినది తదాది నేటిదనుక యుద్యమము యథోచితాభివృద్ధితోడనే సాగుచున్నది గ్రంథాలయోద్యమమాంధ్రదేశమునకు గావించినమేలు నిరాడంబరము, నిస్సందేహమును అయినది గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునకు గావించిన మహోపకారములలో గొన్నిటి నిట చేర్కొనెద.

ఆంధ్రులను నిద్రనుండి మేల్కొలిపినది. ఆంధ్రోద్యమమునకు దోహదమొసంగినది. ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను పురికొల్పినది. ఆంధ్రులను దేశసేవారాధకులనుగా జేసినది. ఆంధ్రులకు జాతీయాభిమానము కలిగించినది. మాతృభాషాసేవయందాసక్తిని కలిగించినది. ఆంధ్రవార్తాపత్రికల యుత్పత్తి కాకరమైనది. ఆంధ్రవిజ్ఞానమును వెదజల్లగలుగుచున్నది. ఉన్నతోద్యోగపదవులను ఆంధ్రులకిప్పింపగలిగినది. మనము నేడు గాంచుచున్న అన్ని యభివృద్ధులు, అన్ని మార్పులు గ్రంథాలయోద్యమ ఫలితములే యనుట నిర్వివాదాంశము. గ్రంథాలయములు చేయజాలని పనులు గలవా? గ్రంథాలయములు గాధింపజాలని మార్పులుగలవా? గ్రంథాలయములు విజ్ఞాననిలయములేగాక మానవులను చక్కని మార్గములలో సంస్కరింప శక్తిగల సాధనాలయములు. గ్రంథాలయములు నిశ్శబ్దముగ, నిరపాయకరముగ కాలుపి సాధనసంపత్తిని సమకూర్చుచు దేశమును, మతమును, జాతిని సంస్కరింపగలుగును. దేశౌన్నత్యము, దేశసౌభాగ్యము, జాతీయవికాసము, మానవుల ఆయురారోగ్యాభివృద్ధులు, మతసాంఘికాది సంస్కరణములు, యివి యవి యననేల? సమస్తము గ్రంథాలయోద్యమముపై నాధారపడియున్నవి.

గ్రంథాలయోద్యమము జీవించియుండునంతవరకు దేశము జీవించియుండును జాతి జీవించియుండును. మతము జీవించియుండును. వాఙ్మయము జీవించియుండును. దానితోనే సర్వము, సర్వముతో నదియు.

మన మేయుద్యమమును కార్యాసక్తులమై సాగించినను గ్రంథాలయోద్యమము దోహదమొసంగనిది అది వ్యాప్తినొందనేరదు ప్రజలలో యుద్బోధన చేయజాలదు. కాన అన్నియుద్యమములకు గ్రంథాలయోద్యమము పునాది గ్రంథాలయములే ఆయువుపట్టులు, లేక ఊపిరితిత్తులు.

కాన భారతీయులు తమ వర్తమానస్థితిగతులను గమనించి భవిష్యదభివృద్ధికి సాధనములైన గ్రంథాలయములను యూరూర స్థాపించి, భగవదాలయములతోపాటు దానధర్మములు నొసంగియు, మడిమాన్యము లొసంగియు పోషింప దీక్షవహింతురనియు; మాతృదేశమును, మాతృభాషా యోషను తొల్లింటివైభవస్థానము నలంకరింప జేయుదురనెదరని నభిలషించుచున్నాడ.

—ఊటుకూరు వేంకటసుబ్బరాయశ్రేష్ఠి.

* * *

అల్లరిమూకనుండి గ్రంథాలయమును కాపాడిన అధ్యాపకుడు:—

"ఈ భవనమున వెలలేని గ్రంథసంపుటములు వేలకొలదిగలవు. నేను వీనిని పరిరక్షించుటకు దీక్షవహించియున్నాను. మీరీపుస్తకభాండాగారమును పరశురామప్రీతి గావింపదలచినచో నా మృతశరీరమును త్రొక్కివెళ్లిననేగాని మీతలంపు నెఱవేరదు" ౧౯౩౬-వ సంవత్సరమున స్పెయినుదేశమునందు నడచిన రాజకీయవిక్రాంతిసమయమున అల్లరిమూక పెచ్చురేగి రాజధానీనగరమగు మాడ్రిడ్ నందలి పుస్తకభాండాగారమును మూలముట్టముగ కూల్పరాగా ఆ భాండాగారమున చదువుకొనుచున్న ఐరిషు దేశపు అధ్యాపకుడు డాక్టరు బెర్నార్డుమాల్లే పై వాక్యములను గర్జాగంభీరస్వరమున పలుకుచు వారిని నిరోధించెను. డాక్టరు మాల్లే అప్పట్టున చూపిన ధైర్యసాహసములకు అభినందనములు తెలుపుటకుగాను మాడ్రిడ్ నందలి మతసంఘములు, సారస్వత

సమాజములు ఒకదినమును ప్రత్యేకించినవి. మాడ్రిడ్ పట్టణమునకు కొలదిమైళ్ల దూరమున స్పెయిను దేశపు పూర్వరాజులలో నొకడగు రెండవ ఫిలిప్ చే నిర్మింపబడి నలుబదివేల పుస్తకసంపుటములతో నేడు విరాజిల్లుచున్న బ్రహ్మాండమైన ఆపుస్తకభాండాగారము ఈ ఒక్కవ్యక్తి ధైర్యసాహసములచే నిర్మూలనమునుండి నిరోధింపబడెను పుస్తకభాండాగారమును తగులబెట్టు తలంపుతో కట్టెలు, పెట్రోలు పట్టుకొని అల్లరిమూక అచ్చటికి చేరునరికి అచ్చట ఒకయుద్ధభటుడుగాని, సివిల్ గార్డుగాని లేకుండెను. డాక్టరు బెర్నార్డుమాల్లే లోన శాంతముగ చదువుకొనుచు అల్లరిమూక రాకను వారిగల్లంతునుబట్టి తెలిసికొనెను. ఎదురుగనున్న ఒకపెద్దకర్రనుమాత్రము కరమునకీలించి యాతడు వారి నెదిరించుటకై బయటకువచ్చెను. మేఘగంభీరస్వరమున ఉపన్యసించుచు, దీనికి ఆశ్చర్యచకితులై యున్న ఆఅల్లరిమూక నాయకులతలల పైభాగమున తనకరమునసున్న కర్రనుత్రిప్పుచు ఆఐరిషు అధ్యాపకుడు ఆగ్రంథసముదాయమును పరిరక్షించెను ఉద్రిక్తుడగు నా అధ్యాపకుని గంభీరోపన్యాసము అల్లరిమూకకు జ్ఞానమునురప్పించి వారిచేతిరుగు మొగముపట్టించినది. పోవుచు ఆమూకలోని పలువురు మాల్లే ధైర్యసాహసములనుప్రశంసించిరి. మాడ్రిడ్ నందలి వార్తాపత్రికలన్నియు డాక్టరు బెర్నార్డుమాల్లేయొక్క చిత్రపటమును, జీవితకథను ప్రచురించి ఆతనిని బహువిధముల ప్రశంసించుచు సంపాదకీయములు వ్రాసినవి. ఇట్టివారు లోకారాధ్యులుగదా!

వార్తాపత్రికల భాండారము:—

ఆంగ్లదేశమున నేడు ప్రచురింపబడుచున్న పత్రికలకు లెక్కలేదు. అగుట బ్రిటీషు మ్యూజియమున ఆపత్రికల సంచికలనుడుంచుటకు స్థలసంకోచము కలిగినది. అందుచేత హెన్డన్ నందలి కోలిన్డేల్ లోని క్రొత్త భవనమునకు బ్రిటీషుమ్యూజియమునందలి వార్తాపత్రికలశాఖను మార్చిరి. ౧౮౦౦ సంవత్సరము మొదలుకొని నేటిదనుక ప్రచురింపబడిన అన్నిబ్రిటీషుపత్రికలు, ఇతరదేశపు పత్రికలు సేకరింపబడి తారీఖులవారీగా అందు పేర్చబడియుండును. ఒక్కొక్క కాలము నాటి అభిరుచులను, ఘోషనులను, ప్రజాభిప్రాయమును స్పష్టముగ తెలిసికొనుటలో సాంఘిక చరిత్రకారునకు వార్తాపత్రికలు తోడుపడునట్లు మఱియేవియు తోడుపడజాలవు. కాని ఈ నూటముప్పదివత్సరములుగ ప్రచురింపబడుచున్న వార్తాపత్రికల నన్నిటనిచదువ నభిలాషపడు సత్యప్రియుడగు చరిత్రకారుని కార్యముమాత్రము సుకరమైనదికాదు. ఏమన ఈవార్తాపత్రికలభాండారమున బైండు చేసినవి ౨౭౫,౦౦౦ సంపుటములుగలవు. వానితూకము ౨౦ ౦౦౦ టన్నులను మించియున్నది. అసంఖ్యాకపత్రికాప్రచురణముగల బ్రిటనుదేశమునందు పత్రికలకొఱకు ప్రత్యేకభాండారముండగా వ్రేళ్లపై లెక్కింపగల పత్రికలకుమాత్రము నోచిపుట్టిన మన ఆంధ్రదేశమున పత్రికల కొకప్రత్యేకభాండారము లేదు సరిగదా మనసాధారణగ్రంథభాండాగారములం దయినను పత్రికలను సంపుటములుగ కట్టి కాపాడుపద్ధతి విరివిగా అవలంబింపబడుచున్నట్లు కానము. ఇకనైన ఆంధ్రదేశమునందలి ప్రతిగ్రంథాలయమునందును అచ్చటికివచ్చు ప్రతిపత్రికయు సంపుటములకెక్కి జాగ్రత్తగ కాపాడబడునట్లు ఆంధ్రదేశమునందలి వివిధగ్రంథాలయపాలకులు విశేషమైన శ్రద్ధవహించుట వాంఛనీయము.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౧౦. తర్కసంగ్రహము

ఆయుర్వేదమునకు పదార్థవిజ్ఞానమును, సదసన్నిరూపణమును అత్యావశ్యకములు. అగుట సదసన్నిరూపకమును, పదార్థవిజ్ఞాననిరూపకమును అగు తర్కశాస్త్రము ఆయుర్వేదమునకు విడువరాని అండయైయున్నది. దీనివిలువ నెరసిన మహాశయుడు గావుననే ప్రాచీనాయుర్వేదాచార్యులలో నతిప్రసిద్ధుడగు సుశ్రుతమహర్షి 'స్వతంత్రకుశలః అన్యతంత్రేష్వ బహిష్కృతః' అని నుడివియున్నాడు. ప్రాచీనాయుర్వేదాచార్యులలో మఱియొకడగు చరకాచార్యులును తన ఆయుర్వేదసంహితయందు ఈవిషయమును కూడినంత విపులముగ చర్చించియున్నాడు. అయితే కణాదగౌతమమహర్షులచే ప్రవర్తకమైన తర్కశాస్త్రము అపారమును, స్థూలబుద్ధులకు అగ్రాహ్యమును అయి ఉన్నది. ఆకారణమున తర్కశాస్త్రజ్ఞుడగు శ్రీమదన్నంభట్టపండితుడు విద్యార్థులకు సులభగ్రాహ్యముగ నుండునటుల తచ్ఛాస్త్రసారమును గ్రహించి క్లుప్తముగ తర్కసంగ్రహమనబడు గ్రంథమును వ్రాసియుండెను. మన ప్రస్తుతవిమర్శనమునకు పాల్పడిన గ్రంథము దానికి తెనుగుసేత. మూలగ్రంథశ్లోకములు, వానికి తెనుగుతాత్పర్యమును, అవసరమగు తావున విశేషవివరణమును ఈ తెలుగు తర్కసంగ్రహమున గలవు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈ ఆంధ్రతాత్పర్యము ఆంధ్రులగు ఆయుర్వేదవైద్యవిద్యార్థుల కెంతయు నుపకరింపగలదనుట నిక్కము. ఈ గ్రంథరచయితలగు ములుగు విశ్వేశ్వరశాస్త్రిగారు సంస్కృతభాషాపండితులును, ఆయుర్వేదాచార్యులును నగుటచే నిందలి విషయములను సుఖబోధములగునట్లు గావింపగలిగిరి. తర్కశిరోమణులగు శ్రీమాన్ వేదాల తిరువెంగళాచార్యులవారి తోడ్పాటును ఈ గ్రంథరచనమున శ్రీశాస్త్రిగారు పొందియుండుట తెల్లగనున్నది.

## ౧౧. ఆత్మజ్యోతి

ప్రకాశకులు:—ఆంధ్రసేవాకుటీరము, మేలుపాక, ఎలమంచిలిదగ్గఱ, (విశాఖపట్నముజిల్లా.) వెల 6 అణాలు. ఇది 136 పుటలు గల చిన్నపుస్తకము. కర్త: శ్రీముద్దా విశ్వనాథముగారు. టాల్‌స్టాయిమహర్షి విరచితమైన నీతికథలలో నొకదాని కిది స్వేచ్ఛానుకరణము. "టాల్‌స్టాయి మహామహుడే ఆంధ్రబాలబాలికలకు తేటతెనుగున నీకథ చెప్పుచున్నాడా" అన్నట్లు ఇది చక్కగా వ్రాయబడినది. ఇందు దీక్షితులను బ్రాహ్మణుడును, సుదర్శనమను బ్రాహ్మణేతరుడును తీర్థయాత్రలు సేవింప బయలుదేరి ఉభయులును కలిసి కొంతకాలము నడచి కొన్ని యాత్రలు సేవించిరి. తరువాత వారొక కఱువుగొట్టు దేశము చేరిరి. అందొక గ్రామము చేరుసరికి సుదర్శనమునకు దాహమైనది. "దీక్షితులూ' నడుచుచుండుము. ఇప్పుడే మంచి నీళ్ళు త్రాగివచ్చెద"నని సుదర్శన మాయూరిలో నొక యింటికివచ్చెను. ఆయింటివారందరును తినుట కన్నము లేక, త్రాగుటకు గంజియైన లేక, మంచినీళ్ళైన తోడుకొనుటకు శక్తిలేక శల్యావశిష్టులై బల్లులవలె మంచములకో, చాపలకో, నేలకో అంటుకొనిపోయి, 'సర్వసేనామూర్ఛగా'పడి చావ సిద్ధముగానుండిరి వారి గురవస్థచూచి సుదర్శనము చాలా జాలిపడెను. అట్టివారలకు తాను ఓపినకొలది సేవచేయుటయే పరమార్థమనుకొని ఆ దయాపరుడు వారందరికి తనచేతనైన యుపచారములుచేసి, పునర్జీవితులగావించి, తాను దారి `కర్చులకు తెచ్చుకొన్న ద్రవ్యముతో ఆకుటుంబస్థులు

షావుకారున కియ్యవలసిన ఋణము కొంత తీర్చి వారి భూమి విడిపించి మరల వారి కిప్పించి, కృశాంగులగు నా పేదల శరీరపోషణమునకు మంచి యావును, వ్యవసాయమునకు వలయు బండి, యెద్దును కొని యిచ్చి కొన్నినెలలకాలము అక్కడనే ఉండిపోయి, అటుపైని యాత్రలుచాలించి యింటికి మగలి వచ్చెను. దీక్షితులు హిందూదేశమునందు కల సమస్త పుణ్యక్షేత్రములు సేవించెను. ఇతడు ప్రవేశించిన ప్రతిపుణ్యక్షేత్రములోను, దేవాలయముల గర్భగుళ్ళలోను తనకంటె సుదర్శనమే ముందువచ్చి దైవమును సేవించుకొనుచున్నట్లు దీక్షితుని కనులకు పొడకట్టుచుండెను. కాని పిలిచి మాటాడుదమన్న దొరకకుండెను. "ఏమి యీ విచిత్రమ"ని దీక్షితులు ఆశ్చర్యపడి పోవుచుండెను. తుద కింటికివెళ్లి మిత్రునికలసికొని, జరిగిన సంగతులు తెలిసికొని, ఇట్లు విలపించెను :—"కాళ్ళు రోళ్లగునట్లు దేశమంతయు తిరిగినాను. నేపడిన వ్యయప్రయాసములు దేవుడు మెచ్చినాడో లేదో తెలియదు. కాని సుదర్శనముసేవమాత్రము స్వీకరించుట నిశ్చయము. సుదర్శనమే దేవుడు. దేవుడే సుదర్శనము. ప్రేమసూత్రము ధరించిన ఆత్మజ్యోతి, అఖండజ్యోతి. మానవసేవయే మాధవసేవ. గోసేవయే గోవిందసేవ. సర్వాంతర్యామియైన భగవంతుడు పైనున్నాడని విశ్వమంతయు వెలుపల వెదకుచు వెఱ్ఱినైతిని." ఇది చదువువారందరకు ఈపరమార్థము చక్కగా బోధపడును. "స్వకర్మణామభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః" అని భగవద్గీతయు, 'Let thy service to Humanity be thy prayer to thy God' అని పాశ్చాత్యఋషిసత్తములును చెప్పు సత్యమున కీకథ చక్కని యుదాహరణము. భగవంతుడు సర్వాంతర్యామి యగుటచేత మానవసేవ భగవంతునిసేవయేకాని మరియొకటి కాదను గొప్పసత్యమునగ్రహించి ఆచరణలో పెట్టుట సామాన్యమైన పనికాదు. స్వార్థమే సర్వమనియు, "మా కాయుష్యము - మా కారోగ్యము - మాకు ధనము - మీకు ఋణము" ననుటయే జీవిత పరమార్థమనియు ననుకొని పెడదారిని బోవుచున్న నేటి మానవకోటికి స్వార్థత్యాగమును, మానవసేవయు మోక్షసాధనములను సత్యమును బోధించు ఇట్టి కథలు అత్యావశ్యకములు. శ్రీ విశ్వనాథముగారు ఈకథారచనమును చక్కగా నిర్వహించినారు. కథావివరణసందర్భములలో నేమి, సంభాషణసందర్భములలోనేమి, రచనము చక్కని లోకోక్తులతో నిండి జాతీయమై యొప్పుచున్నది. ప్రత్యక్షములా అనిపించు వర్ణనలతోను, సమయోచితమైన హాస్యప్రసంగములతోను, సందర్భోచితములైన యుపమానములతోను కూడుకొని శైలి సులభమై రసవంతమైయున్నది. 'ఆంధ్రావలి మోదముం బొరయు' నట్లీకథ సొగసుగా వ్రాసి కృతకృత్యులైన శ్రీ విశ్వనాథముగారి నభినందించుచు, ఇట్టికథ లింకనువ్రాసి భాషాసేవచేయుమని కోరుచున్నాను.

—గొబ్బూరు వేంకటానందరాఘవరావు.

## ౧౨. వైజయంతి

శ్రీకొల్లాపుర స్నేహలతాకవితాసంఘమునుండి వెలువడిన వార్షికపత్రిక. సంపాదకురాలు: శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు, నూజవీడు. సంపాదకురాలు ఈసంచికనుగూర్చి 'స్వవిషయము'న నిట్లు తెలుపుచున్నది "ఈ 'వైజయంతి' అనున దొకవార్షికపత్రికగా బ్రచురింపదలచినారము; ఇదియ ప్రథమప్రయత్నము ఆంగ్లమందును, పాళీభాషయందును, సంస్కృతమందును గూడ ఈ సంఘమువారు యోపినకొలది కృషిచేయుటంజేసి యిందు తత్సంబంధమగు వ్యాసములు ప్రకటింపబడినవి. ఆంధ్రము ప్రధానముగనుండును." ఇందుగల వ్యాసములలో రెండుమూడు తప్ప మిగిలినవన్నియు పద్యమయములు మూడు నాలుగు ఆంగ్లగద్యవ్యాసములును గలవు. అందు శ్రీజటప్రోలు సంస్థానాధీశ్వరులగు శ్రీరాజా సురభి వేంకటలక్ష్మణరావు బహద్దూరువారి జీవితము ముఖ్యమైనది. ఈఆంగ్లవ్యాసమును రాజావారి సంస్థానమునకు చెందిన భాషాసేవకులగు శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయుడు బి. ఏ., గారు వ్రాసినదగుట సత్యాంశములతో గూడియుండి రాజాగారి చరిత్ర చక్కగ తెలుపుచున్నది. కవిత్వమునుగూర్చి కొందరు ఆంగ్లకవులిచ్చిన

అభిప్రాయములు కొన్ని యస్. ఇ. రాజగోపాలరావు గారు సమీకరణముగావించి ఇందు చూపియున్నారు. ఇందలి మూడవ ఆంగ్లవ్యాసము 'శాస్త్రము, వేదాంతము, మతము' అనుదానిని గూర్చి ఈ వ్యాసమును రచియించినది కె వెంకటకృష్ణారావుగారు బి ఏ. ప్రాకృశ్చమసిద్ధాంతము లిందు చర్చింపబడినవి. ఇక ఆంధ్ర గద్యవ్యాసములలో శ్రీ చాగంటి విశ్వపతిశాస్త్రి గారు బి ఏ. వ్రాసిన 'వ్యసనములు ఫలింమనా?' అనునదియు, శ్రీ జంధ్యాల జానకిరామశర్మగారు వ్రాసిన 'యతులు, ప్రాసలు' అనునదియు ముఖ్యమైనవి. పాళీ భాషనుంచి అనువదితమై ఇంకు ప్రచురితమైన 'జవశకున జాతకము' ఇందలి గద్యవ్యాసములకు శిరోభూషణము పద్యవ్యాసములలో కొన్ని శ్రీయుత కేతవరపు వేంకటశాస్త్రి, కీ. శే జనమంచి వేంకటరామయ్య. కీ. శే. ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహము, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి మొదలగు ప్రఖ్యాతకవిపండితులచే వ్రాయబడినవి. డబుల్ క్రౌను సైజున ౭౨ పుటలు. కోరువారి కీపుస్తకము ఉచితముగ నొసంగబడును. వెలయువారు సంపాదకురాలిపేర వ్రాయవలయును. ఈసంచిక ప్రచురించుటకు ప్రధాన కారకులైన శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయుడు గారు అభినందనీయులు

## ౧౩. రసేంద్రసారసంగ్రహము

ఆయుర్వేదవైద్యము ఎడల ఇపుడు ఆంధ్రదేశమున మంచి అభిమాన మేర్పడియున్నది. అగుటనే ఇపు డాంధ్రదేశమున పెక్కు ఆయుర్వేదౌషధశాలల నిర్మాణము, కొన్ని ఆయుర్వేదగ్రంథప్రచురణముల ప్రారంభము జరుగుచున్నది ఆయుర్వేదభిషక్, వైద్యవిద్వాన్, భూషణ, విశారద, భిషగ్రత్న బిరుదాంకితులు శ్రీ శ్రీపాద దేవీశంకరప్రసాదశర్మ (ఎ. ఆర్. ఎ. సి) గారు ఇప్పట్టున 'క్షీరసముద్రం ఆయుర్వేద ఫార్మసీ'యను పేర నొకఆయుర్వేదౌషధశాలను నిర్మించుటయేగాక ఆయుర్వేదగ్రంథప్రచురణమునకు గూడ గడంగినది కాలానుగుణ్యముగ నున్నది. వీరుకొన్ని ఆయుర్వేదగ్రంథములను ప్రకటింపదలచి యుండి ఆ గ్రంథపరంపరకు ఆంధ్రాయుర్వేద గ్రంథమాల అని పేరిడిరి. మన ప్రస్తుతవిమర్శనకు పాల్పడిన 'రసేంద్రసారసంగ్రహము' ఆంధ్రాయుర్వేదగ్రంథమాలలో ప్రథమపుష్పము. ఈ 'రసేంద్రసారసంగ్రహము' సంస్కృతమున మహామహోపాధ్యాయ గోపాలకృష్ణ భట్టసూరి విరచితము. ఆంధ్రగీర్వాణభాషాకోవిదులును, కవులును అగు బ్రహ్మశ్రీ పండిత పాలమర్తి సూర్యప్రకాశశర్మగారి తోడ్పాటున శ్రీ శ్రీపాద దేవీ శంకరప్రసాదశర్మగారీగ్రంథమునకు తెలుగున తాత్పర్యము వ్రాసియుండిరి. పూర్వఖండముమాత్రము ప్రస్తుతము ప్రచురితము. ఇందు రసాదులశుద్ధులు చక్కగ నిరూపితములు. ఆంధ్రదేశమున రసవైద్యము బహుళప్రచారమునను న్నది. 'దోషయుక్తమైన రసము విషము, శుద్ధమైన రసము అమృతము' అని గోపాలకృష్ణభట్టసూరి విషమువంటి రసమును అమృతముగా చేసికొనజాలు పలుమార్గములను నిరూపించు ఆంధ్రతాత్పర్యసహితమగు ఈ 'రసేంద్రసారసంగ్రహము' ఆంధ్రులగు రసవైద్యులకు బాగుగా నుపకరింపజాలుననుట నిశ్చయము. ఈ ఉత్తమగ్రంథమునందలి ఇతర ఖండములనుగూడ సత్వరప్రచురణముగావించు అవకాశము శ్రీశర్మగారికి ఆంధ్రవైద్యవిద్వాంసులు కల్గింతురుగాక! గ్రంథము డెమ్మిసైజున గ్లేజుకాగితములమీద ముద్రితము. ౧౨౦ పుటలు. వెల రు ౧-౦-౦. ప్రకాశకుడు: శ్రీపాద దేవీ శంకరప్రసాదశర్మగారు, రాజమండ్రి.

## ౧౪. భాగవతావతరణము

'సంయమిప్రకరసంభావ్యానుభావుండు', 'విజ్ఞానసంపద్విఖ్యాతుఁడు', 'విద్వత్సింస్తవనీయభవ్యకవితావేశుండు' నగు వ్యాసుఁడు 'మూఢుల కెల్ల మేలగునని భారతాఖ్యానంబుసేసియు భూతహితంబునందుఁ దన హృదయంబు సంతసింపకున్న' 'దుస్సంతాపాపహ' మగు సరస్వతీతటమున వికలచిత్తముతోనుండి ఈగ్రంథమునందు మనకు పరిచితుడగుచున్నాడు. రామాయణావతరణమునకును, భాగవతావతరణమునకును ఆయా ఉత్తమగ్రంథరచయితల చిత్తవిక్షేపములతో చాల సంబంధముగలదు. భాగవతావతరణమునకును, వ్యాసుని

చిత్తవిక్షేపమునకును గల సంబంధము ఇందు చూపబడినది. ఇది యొకపద్యనాటిక. కర్తలు సాహితీసమితి సభ్యులగు శ్రీయుత నోరి నరసింహశాస్త్రిగారు బి ఏ, బి.యల్. వ్యాసహృదయమును కలంచిన విషయమిందు బాగుగా ప్రస్తరింపబడియున్నది. శైలి తెలియుటకై మూడుపద్యముల నెత్తిచూపెదము.

శా. శాంతం బీ బదరీవనాశ్రమ తరు
చ్ఛాయా నివాసంబు దు
స్సంతాపాపహ మీ సరస్వతీనదీ
శ్రావ్యాపస్సాగావ మే
కాంతం బీ మృదుశాద్వలస్థలము
నస్సైనన్ మనస్సేల య
శ్రాంతక్షుబ్ధ మహార్ణవంబుపగిదిన్
సంక్షోభముం జెందిడిన్ ?

ఉ. ఓ మహనీయ ధర్మ వినయోన్నత
చిత్త, అశేషవేద వే
త్తా, మునివంద్యవృత్త, జనతా
ఘనసంసృతి తాపమార్పగా
నీమహి బుట్టినట్టి పరమేశ్వర
మూర్తివి జ్ఞానకీర్తి, వే
లా మది వ్యాకులంబయిన
దయ్యె వచింపు పరాశరాత్మజా !

ఉ. నీ రసనాగ్రవర్తియయి నిత్యము
నృత్యముచేయువాణి పం
కేరుహనాభ నామగుణకీర్తనచే
మురవైరి సత్కథా
ధోరణిచేత భాగవతధూర్వహణంబున
వన్నెగాంచు, సం
సారమహాబ్ధిమగ్నజనసంతతికిన్
తరియై వెలింగెడిన్

ఈ సరసరచనము సుందరముద్రణమున నొప్పుచున్నది. డెమ్మి చిన్నసైజున ౬౦ పుటలు. ఫెదరువెయిటు కాగితములు వలయువారు గ్రంథకర్తపేర గుంటూరు జిల్లా, రేపల్లె వ్రాయునది.

## ౧౫. బందిగములున్నవే దేశభక్తులకును ?

లార్డుబైరన్ గారి 'ప్రిజనర్ ఆఫ్ చిలాను'నుండి అనువదింపఁబడినది గ్రంథకర్త జే సుబ్బయ్యగారు. ప్రొద్దుటూరుపురవైశ్యప్రముఖులగు గాథంశెట్టి సుబ్రహ్మణ్య శ్రేష్ఠిగారి కీగ్రంథము అంకితముచేయబడినది. దేశభక్తి, కష్టసహనశీలము ఇందు కీర్తింపబడిన ముఖ్యగుణములు.

"స్వేచ్ఛచేకూరె మాకున్న యిచ్ఛతీరెఁ
జచ్చియు బ్రతుకువార మీజగతియందు
బందిగములున్నవే దేశభక్తులకును?"

క్రౌనుసైజున ౩౨ పుటల గ్రంథము. వెల రు. ౦-౪-౦. గ్రంథప్రతులు వలయువారు గ్రంథకర్త పేర కడపజిల్లా, ప్రొద్దుటూరుకు వ్రాయునగును.

## ౧౬. ఆటో మోటివ్ ఇంజనీరింగుస్కూలు

మద్రాసునందలి ఆటోమోటివ్ ఇంజనీరింగు స్కూలువారి విద్యాప్రణాళికను తెలుపు చిన్నగ్రంథము. మధురయందలి గవర్నమెంటువారి ఇండస్ట్రియల్ ఇన్‌స్టిట్యూటునందలి మోటారుసెక్షనుకు అసిస్టెంటు సూపరింటెండెంటుగ నుండిన వి. వేణుసామిఅయ్యంగారు ఎ. యస్. ఎ ఇ గారు ఈపాఠశాల నిర్వాహకులు. నిరుద్యోగసమస్య ప్రబలియున్న ఈ దినములలో ఇట్టి వృత్తివిద్యాపాఠశాలలెంతయు వాంఛనీయములు ఈ గ్రంథముకోరువారికి ఉచితముగపంపబడును.

## ౧౭. బాల భక్తులు

ఇది పాఠశాలల ఉపయోగార్థమై ఆవంత్స వేంకటరత్నముగారిచే రచింపఁబడెను. ఇందు ప్రహ్లాదుఁడు, ధ్రువుఁడు, మార్కండేయుఁడు, నందుఁడు అను నలుగురు పౌరాణికబాలభక్తుల కథలు గలవు ఈ గ్రంథపు మొదటికూర్పుప్రతులు త్వరలోనే అమ్ముడుపోయియుండుట గ్రంథప్రచారమున గ్రంథకర్తగారి శ్రద్ధను సూచించుచున్నది. ఈగ్రంథము మూడవముద్రణమున ఈరెండవకూర్పకంటె సుందరముగ అచ్చొత్తింపబడుట కోరదగినది క్రౌనుసైజున ౯౨ పుటలు. వెల రు ౦-౧౦-౦ పుస్తకములకై గ్రంథకర్తపేర పెద్దాపురము పోస్టు, ఆనూరు వ్రాయునది.